# THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204438
UNIVERSAL
LIBRARY

PRESCRIBED BY THE UNIVERSITY OF MADRAS
AS A DETAILED TEXT FOR THE INTERMEDIATE EXAMINATION
1924.

# VASANTIKA

## A DRAMA IN FIVE ACTS

BY

**SREERAM VEERABRAHMAM,**
PANDIT, NOBLE COLLEGE,
MASULIPATAM.

# వాసంతిక

గ్రంథకర్త.

శ్రీరామ్ వీరబ్రహ్మము,
పండిట్, నోబిల్ కాలేజి, మచిలీపట్టణము.

Printed by D. K. Pant at the Vani Press, Bezwada—1922.

Copy Right.] [Price Re. 1-4-0.

# వాసంతిక.

ఇది

నోబిల్ కాలేజిలోని యాంధ్రోపాధ్యాయుఁడును
చంద్రకాంత జపానియ మార్కండేయ
ప్రియదర్శికా నానారాజన్యచరిత్రేత్యాది
గ్రంథకర్త లునునగు

## శ్రీ రామ్ వీరబ్రహ్మము గారిచే

రచియింపఁబడి ప్రకటింపఁబడియె.


మచిలీపట్టణము.

రెండవకూర్పు.

వాణీ ముద్రాక్షరశాల, బెజవాడ.

సర్వస్వామ్య సంకలితము. వెల 1—4—0.

1922



గ్రంధకర్త:

శ్రీ రామ్ వీరబ్రహ్మము,

మచిలీపట్టణము.

# విజ్ఞప్తి.

---

ఈ గ్రంథము చిరకాలముక్రిందట మద్బాల్యమిత్రులును, సహపాఠకులును నగు స॥ రా॥ శ్రీ పెద్ది రామయ్య, బి.ఏ., యల్.టి., గారి ప్రోత్సాహంబుచే స్కాటు నవల యగు 'బ్రైడ్ ఆఫ్ లేమర్‌మూర్' అను నొకానొక యింగ్లీషుగాథనుండి యనువాదింపఁబడి రచింపఁబడినది. మఱియు నోబిల్ కాలేజి ప్రొఫెసర్ శ్రీయుత ముత్తరాజు సుబ్బరావు, యం. ఏ., గారును దమ సదభిప్రాయ మొసంగి ప్రోత్సాహపఱిచినందున దీని ముద్రింపించితిని. ముద్రణమైన కొలఁదికాలముననె వేయిప్రతులును విడుదలయైనను నూతనగ్రంథరచనాపరత్వం బీ గ్రంథ పునర్ముద్రణంబున కవకాశ మొసంగ దయ్యెను.

అట్లయ్యును ప్రస్తుతమునఁ జెన్నపురి విశ్వవిద్యాలయాధికారుల దృష్టిపథంబునఁబడి రాఁగల 1924 వ సంవత్సరమునఁ బరీక్షింపఁబడు ఇంటర్‌మీడియేటు తరగతికిఁ బఠనీయ గ్రంథముగ చేర్పడుటచే మఱల ముద్రింపింపవలసివచ్చినది.

కావున నీ గ్రంథరచనకును దద్వ్యాప్తికిని గారకు లైన పూర్వోక్త విద్వద్వర్యులును, నీ గ్రంథ ప్రథమ ద్వితీయ ముద్రణంబులకు నార్థికంబుగ సాహాయ్యముం జూపిన శ్రీ మద్దుల నరసింహము, లింగం నాగభూషణముగార్లను మత్కృతజ్ఞతాభివందనంబుల కెంతయుఁ బాత్రులు.

ఇట్లు,

10—7—22. గ్రంథకర్త.

నోబిల్ కాలేజి ప్రొఫెసరుగా రగు శ్రీయుత ముత్తరాజు సుబ్బారావు, యం. ఏ. గారిచే ననుగ్రహింపఁబడిన యభిప్రాయము :—

ఈనాటకమును సాంతముగాఁ జదివితిని. ఇది యాంగ్లేయభాషలో స్కాటుగారిచే వ్రాయఁబడిన 'Bride of Lammermoor' అను నవల ననుసరించి వ్రాయఁబడినది. ఇట్టి నాటకరచన యందిది యీ కవిచేసిన ప్రథమోద్యమము. ఇది మొత్తముమీఁద రసవంతముగా నున్నది. దీనియందలి పద్యములయొక్కయు గద్యలయొక్కయు శైలి మృదువుగాను సర్వజనగ్రాహ్య మగు నట్లును నున్నది. సంస్కృత నాటక ధర్మములఁ బాటింపక నూతనవిధముగ వ్రాయఁబడినను నట్టి దొక లోపముగాక నాటకమునకు నూతనశోభ నిచ్చుచున్నది. ఇట్టి నాటకము లనేకములు మనభాషయందు వెలువడినఁగాని భాషాభివృద్ధి చేకూరదని నొక్కి వక్కాణింపఁగలను. కాన భాషాభిమాను లెల్ల రీకవిని బ్రోత్సాహపఱచెద రని నమ్మెద.

మచిలీపట్నము,<br>
15—10—12.

ఇట్లు,<br>
ముత్తరాజు సుబ్బారావు.

# పీఠిక.

1. తెలుఁగుబాసయందు దేశీయులు నాటకములు వ్రాయుచున్నారు. అయిన నవి గద్యకావ్యములవలెనే యంతగా గౌరవింపఁబడకుండుటను మన మందఱ మెఱిఁగిన విషయమే. దీనికిం గల కారణ మేమియో విచారింపఁ బూనిన నీ యాంధ్రనాటకరచన నొక్కింత విమర్శించినఁ దెలియవచ్చును. తెలుఁగునందు సాధారణముగ వ్రాయఁబడిన నాటకములను రెండు భాగములుగ విభజింపవచ్చును. ఇందాంగ్లేయభాషనుండి భాషాంతరీకరింపఁబడినవి మొదటి తరగతివి. ఇట్టి వానికి మూలములు మహాకవులచే రచింపఁబడినను భాషాంతరీకరణము చేయబడుటచే వానియందుండు రసమాధుర్యములు పోయి శల్యావశిష్టములుగ మాత్రము గన్పట్టుచున్నవి. కావున వీనిని మన మంతగా గౌరవింపము. రెండవతరగతి నాటకములు సంస్కృతనాటకములఁగాని లేక యాంధ్రపురాణములఁగాని యనుసరించి వ్రాయఁబడినవి. ఇట్టి నాటకరచనలయందుఁ దత్కర్తలు సంస్కృతనాటకలక్షణముల నవలంబింపఁ గోరినను దద్గుణముల నంతగా గ్రహించినట్లు కానరాదు. కావున నివియు మన కెక్కుడు రమ్యములుగా నుండఁజాల వని తలంచెదను.

2. మన మితరవిషయములలో నింగ్లీషుభాష మనకుం దెలియుటవలనఁ జాలలాభములను బొందినట్లే నాటకరచనయందు నైత మట్టి సాయ మెందువలనఁ బడయఁగూడదో తెలియరాకున్నది. కావున నీ విషయమును గొంతకాల మాలోచించి పిమ్మట నాకుఁ బ్రియమిత్రుఁడగు నీ గ్రంథకర్త సాహాయ్యముచేఁ దెలుఁగున నింగ్లీషునాటకము ననుసరించి వ్రాయఁబడిన యొక్క నాటకము నేర్పఱుపఁగలిగితిని.

3. నాకుఁ జూడఁగాఁ దెలుఁగునాటకము లింగ్లీషునాటకము లంత రమ్యములుగా నుండమికి రెండు కారణములు గానవచ్చెడిని. ఇందు మొదటిది కార్యనియమము (Unity of Action). ఇయ్యది యాంధ్రనాటకములయం దంతగా గణింపఁబడుచుండినటులఁ గానరాదు. అయిన మన కందఱ కట్టి గుణవిహీన మగు కావ్యము గావ్యముగా దని తెలిసిన విషయమే.

4. మఱియు నీ నాటకరచనయందు వేఱొకవిషయముగూడ నాలోచింపఁ బడినది. గ్రంథ మెట్టిదియైన నద్దానిఁ జదువుటవలన మనకు మనస్సంతోషము గలిగి ప్రపంచవ్యవహారము లెక్కుడుగాఁ దెలియవలయును గావున మనుష్యుల వ్యాపారము లన్నియు భగవంతుఁడే ప్రత్యక్షమై నడుపుచున్న మనయత్నముల కంత యవకాశ ముండదు. మఱియు దైవసహాయము పూర్వకాలమం దెంత యెక్కుడుగా నున్నను నిప్పటికాలమున మనయత్ని

వృద్ధి మన యత్నములనుబట్టి యుండును. కావున నీనాటకమునందు వచ్చు పాత్రల వ్యాపారములలో భగవంతు నంతగాఁ బురికొల్పక ప్రపంచరీతుల ననుసరింపఁ బ్రయత్నము చేయఁబడినది. మఱియు స్థలకాలనియమములు (Unities of Place and Time) పూర్వాణభాషాకవీశ్వరుఁ డగు షేక్స్పియరు నైతము గమనింపకపోవుటచేత మన మవ్వానింగూర్చి విచారింపకపోవుటచే నష్టములేదు. రెండవకారణ మేమన మన నాటకముల యందు వచ్చు పాత్రల స్వభావము బాగుగఁ దెలియఁ బఱుప కుండుటయే. దీని నింగ్లీషున (Characterization) అందురు. భారతాది మహాపురాణంబుల యందు వచ్చు స్త్రీ పురుషుల స్వభావంబులు వరుస బాగుగా తెల్లడి యగుటంజేసి మన కా గ్రంథము లన్న మిగుల నభిమానము.

5. కావున నీ ముఖ్యమైన రెండుమూడు విషయములను మనసునందు నిలిపి యీ "వాసంతిక" యను నాటకమును, "స్కాట్" మహాకవి విరచితం బగు "(Bride of Lammermoor)" అను నవల ననుసరించి వ్రాయ నీగ్రంథకర్తను వేడ నీయన యింపుల కొడంబడి దీనిని రచించె.

6. మఱియు నిందనవసరములగు వర్ణనలను పాత్రలను దినికొనివచ్చి పెట్టక కథాసారాంశమునకు ముఖ్యమగు విషయములే ప్రదర్శింపఁబడినవి. పద్యగద్యరచనలయందు క్లిష్టాన్వయములును, కఠినపదములును లేకుండ వ్రాయఁబడినది. ఇట్టిది యాంధ్రీకరణ విషయమునఁ బ్రథమోద్యమ మగుటచేఁ జదువరులు దీని యందున్న లోపముల నెన్నక గుణములనే గ్రహించి కృతికర్త నాదరింతురు గాక యని నేను దలంచెదను.

మచిలీపట్టణము.
15—10—12,

పెద్ది రామయ్య, బి. ఏ., ఎల్. టి.,
Asst. Master, Noble College.

## ఈ నాటకమునందు వచ్చుపాత్రలు.

---

### పురుషులు.

అశ్వనమంత్రి = ప్రకంపనచక్రవర్తియొక్క మంత్రి.

సాగరుఁడు = ఇతని సేవకుఁడు.

రామరాజు = అశ్వనమంత్రికుమారుఁడు.

సుదర్శనసేనుఁడు = పురందరచక్రవర్తియొక్క మంత్రికుమారుఁడు; కథానాయకుఁడు.

కుముదుఁడు = సుదర్శనసేనుని వంటలవాఁడు.

సౌమ్యుఁడు = బ్రతికిచెడిన యొక జమీందారుఁడు.

సుదిరుఁడు = సౌమ్యుని జెతిపిన యనుచరుఁడు.

పురోహితుఁడు = అశ్వనమంత్రియొక్క యాత్రికుఁడు.

కొందఱు పౌరులు.

వైద్యుఁడు.

### స్త్రీలు.

రవణిక = అశ్వనమంత్రి భార్య.

మరాళిక = రవణికసోదరి.

వాసంతిక = రవణికపుత్రిక, కథానాయకి.

చతురిక = సుదర్శనసేనుని తండ్రికి పరిచారిక.

కథాక్రమము :—పాంచాల దేశమును బురందరుఁడు పాలించుచుండ వాని సోదరుఁడగు ప్రకంపనుఁడు మంత్రులలో నొకఁడైన యశ్వనమంత్రిసాయమున నాతనిని వెడలఁగొట్టి తాను చక్రవర్తియగుట. రెండవమంత్రి యగు సుదర్శనసేనునితండ్రి అశ్వనమంత్రికి ఋణగ్రస్తుఁడై యతని దుస్తంత్రము వలనఁ దనకుఁ గల భూమిని కాఁపురమున్న సౌధమును తుదకుఁ బ్రాణములను గోల్పోవుట. వీనిసుతుఁడగు సుదర్శనసేనుఁ డశ్వనమంత్రికుట్రలకుఁ గినిసి వానిని జంప నెంచుట. ఒకనాఁడు కూఁతురగు వాసంతికతో నశ్వనమంత్రి యూరివెలుపల విహరించుచుండ నొక మహిషము వారిని దఱుమవచ్చుట. సాయుధుఁడై యశ్వనమంత్రిని వధించుతలంపున వచ్చియున్న సుదర్శనసేనుఁడు వాసంతికను జూచి జాలిపడి మహిషమును వధించి వారిని గాపాడుట. అశ్వనమంత్రి సుదర్శనసేనుని ప్రయత్నములఁ దెలిసికొని వానితో సఖ్యము జేసికొనినఁగాని బ్రతుకుతెరువు లేదని తిరిగి వాసంతికతో వాని సౌధసమీపమునకుఁబోయి వానియింటియతిథియై కొన్నాళ్ళట నుండి సుదర్శనసేనుని లోఁబఱచుకొని తిరిగి సుదర్శనసేనుని తనయింటికి విందునకై పిలిచికొనిపోవుట. అప్పుడు వాసంతికాసుదర్శనసేనులనురాగబద్ధులై పెండ్లాడ నిశ్చయించుకొనుట. ఇంతలో రవణిక యేతెంచి సుదర్శనసేనుని వెడలఁగొట్టి తనకు నచ్చినవాఁడగు సౌమ్యునకు వాసంతిక నిచ్చి పెండ్లిసేయుఁబూనుట. వాసంతికాసుదర్శనసేనులు పరస్పరవియోగమునకై దుఃఖించుట. వాసంతిక మనోవ్యథఁ గొని స్మృతిలేకుండుట. రవణిక బలవంతమునఁ పెండ్లి ముగించుచుండ సుదర్శనసేనుఁడు వచ్చి వాసంతిక నన్ను పెండ్లాడ వాగ్దత్తము చేసియున్నదని యడ్డగించి విఫలుఁడగుట. వాసంతిక యట్టిస్థితిలోనె పెండ్లాడఁబడి యా కార్యాంతముననే మరణించుట. శవమును శ్మశానవాటికకుఁ గొనిరాఁగా సుదర్శనసేనుఁడటకు వచ్చి విలపించుచుండఁగా రామరా జీదుస్థితి కితఁడే కారకుఁడని వానిని గలహమునకు బిలుచుట. సుదర్శనసేనుఁడు వాసంతికావియోగమునకుఁ గలిగిన దుఃఖాక్రాంతచిత్తముతో రణమునకై సంకేతస్థానమున కేగుచు విధివశమున నొక ప్రవాహమునఁ గొట్టుకొనిపోవుట. కుముదుఁడు విధిగతియన నిదిరా కదా యని చింతిల్లుట.

# వాసంతిక.

## ప్రథమాంకము.

ప్రథమరంగము:— పాంచాలదేశము లోని పల్లెటూరిలో నొకవీధి.

ప్రవేశము:— కొందఱు పౌరులు.

1 పౌరు— తే॥గీ॥ తేల దయ్యెను విషయంబు ♦ వేళ మించు
చుండెఁ బాలముల కదె పోవు ♦ చుండి రెల్ల
వారు; సెలవిండు వేగఁ గష్టముల నేఁటి
నుండి యెవరికిఁ జెల్లించు ♦ టుచిత మగునొ?.

2 పౌరు— ఈ విషయ మవశ్యము పరిశీలనీయము. అక్కటా! అవినీతుల వలన వినీతులకుసైతము కష్టములు దటస్థించుచుండుఁగాఁబోలు! లుబ్ధాగ్రేసరచక్రవర్తియుఁ, బరధనాపహరణతంత్రపరాయణుం డగు నీ యశ్వనమంత్రివలనఁ బాపము మన సుదర్శనసేనున కెట్టి యిక్కట్లు సంప్రాప్తమయినవి!.

3 పౌరు— ఒక్క సుదర్శనసేనునకే కాదు. తత్పాలితపౌరజనం బగు మనకును దటస్థించినవి.

1 పౌరు— ఔ నౌను; ఇట్లగు నని మన మిదివఱకే కృతనిశ్చయుల మై యుంటిమి కదా! చిల్లిగవ్వ యైనను జేజార్పఁ జాలని యీ యశ్వనమంత్రిగారు మన సుదర్శనసేనునితండ్రికిం దింత ధనము నేవేళ నడిగిన నావేళ మాఱాడక లోకములో లేని

3 పౌరు— తే॥గీ॥ అప్పుడే పోవు నట్లుండు • నన్నఁగ నేల
యప్పుడే పోవు ననిన బా • గగును దొల్లి
వీని చైదముల్ వినుమాత్ర • విడఁడె ప్రాణఁ
మును సుదర్శనసేనుని • జనకుఁ డకట!

1 పౌరు— అవును. అతఁడు జరాభారంబునకుఁ దోడు తన కాపుఁడగు పురందరచక్రవర్తియొక్క రాజ్యవియోగంబునకు మిక్కిలి కృశించుచున్న తఱిఁ దన జమీా యశ్వనమంత్రిచే హరింపఁ బడినదను వార్త వినుటతోడనే ప్రాణములను విడువలేదా! వాని ప్రాణములను హరించి జమీాని స్వాధీన మొనర్చుకొని శవము నావల కీడ్పించి యా నాఁడే తద్గృహంబునఁ బ్రవేశించిన మహానుభావుఁ డీ యశ్వనమంత్రి కాఁడా!

3 పౌరు— అవు నవును.

తే॥గీ॥ ఎలుకతోఁ జెలగాట • ములు ప్రమోద
కరము పిల్లుల కవి మెలు • కలకుఁ బ్రాణ
హాని; యట్లె దుర్జనుల కృ • త్యంబు లరయ
సజ్జనాళి కెంతయుఁ బ్రాణ • సంకటంబు.

2 పౌరు—కావుననే యశ్వనమంత్రిని దిరస్కరించి మన సుదర్శనసేనునకుఁ గప్పములఁ జెల్లించుచుండినచో వాని యుద్యోగస్థుఁడుగు లాగరుఁడు మన యిండ్లు వాకిళ్ళు తెగ నమ్మించియైనను గ్రహించును గాని యూరకుండఁడు.

3 పౌరు—ఆఁగు మాఁగుము. ఆవచ్చున దెవ్వరు? మన సుదర్శనసేనుని వలె నున్నాఁడు.

1 పౌరు— అవును. వాని వంటలవాఁ డగు కుముదుఁడును వెంటనే యున్నాఁడు. ఆ మహామహుని ధనకనకవస్తువాహనాదులు విడిపోయినవిగాని వీఁడుమాత్రము విడిచిపెట్ట లేదు.

2 పౌరు—అదిగో! సమీపించు చున్నారు. మన మందఱము విధేయ
తాసూచకంబుగ నీ ప్రక్క కొత్తిగిలుదము. బ్రతికిచెడినవారి
నవమానింప రాదు.

మ॥ అకటా! తొల్త సమానరాజ్యరమచే ♦ నత్యంతసద్వైభవో
త్సుకుఁ డై పార్శ్వముల న్నిజానుచరు ల♦స్తోకంబుగాఁ గొల్వఁగా
సకలాత్మీయజనాళిఁ గాంచు తమి న♦శ్రాంతంబు నేతెంగు నే
లిక నేఁ డీగతి వచ్చె నంతయును జా♦లి న్గొల్పెడి న్గాందినే.

(సుదర్శనసేనుఁడు, కుముదుఁడు ప్రవేశింతురు)

అందఱు—ఆర్యా! నమస్కారపూర్వకస్వాగతం బొనర్చుచున్నారము.
కుము—ఈ స్వాగతముల కేమిగాని మీశిస్సు లేవి? ఇంతవఱకును
జెల్లింప లేదు. మీరు త్వరగా నిచ్చెద రేని మిగుల సంతో—

3 పౌరు—ఎవ్వ రా వచ్చుచున్నది? రక్షకభటుని వెంట నిడుకొని
వచ్చు చున్నాఁడు.

2 పౌరు—ఓహో! వారు నిప్పుడే బైలుదేరినారా! ఆవచ్చునది యశ్వన
మంత్రిగారియుద్యోగస్థుఁ డగు లాగరుఁడు-రక్షకభటుఁడు.

(లాగరుఁడు, రక్షకభటుఁడు ప్రవేశింతురు)

లాగ—ఓ పౌరులారా!

తే॥ గీ॥ మాన్యచరితుఁ డా యశ్వన♦మంత్రివరుఁడు
మీ సుదర్శనసేను జ♦మీని గొనియెఁ
గాన నేఁటినుండియు మీరు ♦ కప్పములను
మాకె యొప్పగించుచు నుండు ♦ మనఁగ వలయు.

కుము—(రోషముతో) ఏమి!—ఈ జమీ సుదర్శనసేనునిది కాదా! ఆ మాట యెవ్వఁడనఁ గలఁడు? ఎన్నితరముల నాఁటిది! నేఁటికీ యశ్వినమంత్రి దిగివచ్చెఁ గాఁబోలు! గ్రామస్థులారా! దీనిలో నావంతయు నిజము లేదు. మీరు యథాప్రకారముగా సుదర్శనసేనునకే కప్పముల నొప్పగింప కున్న మీ రాయన యాగ్రహమునకుం బాత్రు లగుదురు. అట్టిశాంతమూర్తి కాగ్రహంబు గలిగె నేని—

సుద.—కుముదా! ఊరకుండుము.

రక్షు—ఏమిచేయును? ఊరిబెట్టుకొనుఁ గాఁబోలు.

సుద—ఎవఁడవురా! నోటికి వచ్చిన ట్లెల్ల వదరు చున్నావు?

రక్షు—ఎవఁడా! నీయబ్బ— నీతాత— (అని తుపాకిమడమతో నావలకుం ద్రోయును.

సుద—ఛీ! దుర్మార్గుఁడా! నీవెన్నఁడును బెద్దలదర్శనము జేసినట్లు లుండ లేదు. (అని మెడఁబట్టి త్రోయును)

రక్షు— (ఆగ్రహమున) రాజభటుల మైన మమ్మే యెదిరించు చున్నావుగా! (అని కలయఁబడి సుదర్శనసేను చేతి ఖడ్గముచే గాయమంది) హా! చచ్చితిఁ జచ్చితి. (అని నేలఁ గూలును)

పౌరులు—ఆహా! ఎంత ఘోర కార్యము! ఎంత దౌష్ట్యము!—మన మింక నిచ్చటనే మసలినచో మరణ దండనకే పాత్రులము గావలసి వచ్చును. (అని నిష్క్రమింతురు)

లాగు— ఈ దుర్మార్గుఁడు నా జోలికి రాకమునుపే పాఱిపోవు టుచితము. (నిష్క్రమించును)

సుద—తే॥గీ॥ అల్లులకు సమున్నతపద ♦ మబ్బె నేని
లేని యధికారములను గ♦ల్పించుకొని మ
దాంధులై తారతమ్యంబు ♦ లరయ కెట్టి
జనులకైన న గ్గౌరవింప ♦ జంక రకట.

కుము—ఔ నౌను. స్వామీ! ఎంతఘోరకార్యము!

సుద—ఓయీ! నీ యుపన్యాస మేమియు నవసరము లేదు. తత్క్షణాబ నీ వింటి కరుగుము.

కుము—చిత్తము (స్వగ.) ఈయనకు మతి చెడినది. ఈ వధతోఁ బులిపిల్ల పిల్లిపిల్లయైనది. ఆహా! ముం దేమి కానున్నదో కదా!

(నిష్క్రమించును)

సుద—ఆహా! ఎంతటి యకృత్య మొనర్చితి!

ఉ॥ ధీనిధి యింద్రుఁ డన్న విశ♦దీకృత మయ్యెడు నిట్టు లింగిత
జ్ఞానవిహీనుఁ డౌ కృ—రుఁడు ♦ కాఱులు గూసినమాత్రఁ గోపి నై
వానిని గూల వైచితిని ♦ ప్రౌఢతనంబును జూపువాఁడ నై
నే నపరాధి నైతి నిఁక ♦ నీయెడ నిల్వఁగ నెట్లు నేర్తునో.

నేర్చుట కే మున్నది. నా తండ్రిని దన యాప్తవర్గములో నొకనిగ భావించుకొనిన పురందరచక్రవర్తి ననుసరింప నిదివఱకే మగధ కేఁగ నిశ్చయించుకొంటినిగదా! కార్యాంతరములచే నించుక మసలు చున్న నన్నీపని మఱింత త్వరఁ బెట్టుచున్నది. కావున నాకీ దుష్టకృత్యంబు మహోపకారంబుగనే పరిణమించు చున్న యది. కావున—

ఉ॥ పూజ్యుఁడు నాదుతండ్రి మృతిఁ ♦ బొందినఁ గష్టము లెన్ని వచ్చినన్
రాజ్యము గోలుపోయినను ♦ ప్రాణముతో నిట నుంటిఁ గాని సా

మ్రాజ్యము వీడి నట్టు లల ♦ ప్రాణము లీ యెడ వీడ నాయె నీ
త్యాజ్యని కారణంబునఁ గటా! మగధావని నాకు దిక్కెఁకన్.

(నిష్క్రమించును)

---

## ద్వితీయరంగము.

అశ్వసమంత్రికోటలోని యొకచావడి.

ప్రవేశము:— అశ్వనమంత్రి, లాగరుఁడు.

అశ్వ— ఇట్లు జరుగు తఱి నీవు సుదర్శనసేను నేమియు వారింప లేకపోయితివా?

లాగ— వారించుట యుండ నిండు. వాని యెదుట నిల్చుట కైనను సాహసంబు గలుగ దయ్యె—

మ॥ కనులం దగ్నికణంబు లూడి పడ ని♦ష్కారుణ్యుఁడై రాజభృ
త్యుని ధైర్యం బడియేమొగాని పిలుచ ♦ న్దోస్సారముల్ జూపుచున్
దునిమెన్ దీక్ష్ణకృపాణధారహతి ధూ♦ర్తుండు డాచు న స్త్రా సుద
ర్శనసేనుం డనిమిత్తవాక్కలహముల్ ♦ సాధించు నుద్యోగియై.

అశ్వ—ఇఁక సంగతు లన్నియు విశదమైనవి. ఇటువినుము. నేఁ డా వీధిలో జఱిగిన యుదంతంబు నెల్ల నొక్క కాగితంబుపై లిఖించి సాయంకాలము నీవు న్యాయస్థానంబునకు వచ్చునప్పుడు నా యొద్ద నొప్పగింపుము. నే నద్దానిని బ్రకంపనచక్రవర్తిగారికి విన్నవించి కర్తవ్యమూహించెదను. ఈ పని త్వరలోనె కావలసియున్నది. ఇఁక నీవు వెళ్ల వచ్చును.

లాగ — చిత్తము. (నిష్క్రమించును.)

అశ్వ — తే॥గీ॥ ఇట్టి సాహసాంకుని భువి ♦ నెందుఁ జూడ
రాజమార్గంబునన యొక ♦ రాజభటుని
జంకు కొంతయు లేక యీ ♦ సరణి గాసి
సేయఁ గలిగె సుదర్శన ♦ సేనుఁ డౌర!.

ఇట్టి సాహసంబు నాకు లేదు గదా! ఈ ధైర్యగుణము పారంపర్యముగా రావలసినది కాఁబోలును.

తే॥ గీ॥ ఇట్టులే మున్ను తనజనియా ♦ నెవరొ వశముఁ
జేసికొని రంచు వారిని ♦ మోసమున వ
ధించి మగుడ వశం బొన ♦ రించుకొనఁడె
వీనిజనకుండు గంభీర ♦ మానసుండు.

అయిన నట్టిపను లిక్కాలంబున జరుగ నేరవు. మఱియు—

తే॥ గీ॥ ఇప్పు డీతం డొనర్చిన ♦ యీ యకృత్య
మును లిఖించి లాగరుఁడు పం ♦ పిన క్షణంబ
చక్రవర్తి వీనికిఁ బ్రవా ♦ సంబొ మరణ
శిక్షయొ విధించునట్టులఁ ♦ జేయువాఁడ.

ఈ రెండు శిక్షలలో దేనివలన నైనను నా కీతండు దూరస్థుండు కాఁగలండు. ఇఁక నన్నితఁ డేమి చేయును? ఇది యొక ధైర్యకార్య మని యోచించితిని గాని యి దేటి ధైర్యము! ఈ దారుణ కృత్యము నొనర్చి తన ప్రాణముఁ గోల్పోవు టెంతయు వాని మూర్ఖతను దెలుపును గాని యది ధైర్య మని యూహింపరాదు. ఇంతదనుక నీతఁడు నన్నేమి చేయునో యని భయపడుచుంటిఁ గాని యిఁక నన్నితఁ డేమియుఁ జేయఁజాలఁడు! నేఁటినుండి స్వయంకృతాప

రాధకారణమున నీతండు బంధీకృతుండు కాఁ గలఁడు. ఆహా! ఏమీ నా యదృష్టదినములు! ఇఁక నిర్భీతిగ నుండ నగునుగదా!

(భటుఁడు కొన్ని యుత్తరములతోఁ బ్రవేశించును)

అశ్వ—ఏమిరా! ఇటు వచ్చితివి?

భటు—అయ్యా! టపాలవాఁడీ జాబుల నిచ్చినాఁడు.

అశ్వ—ఏవి- ఇటు తెమ్ము (జాబులఁ బుచ్చుకొని చదువుచు) నీవు పోయి వాసంతికను బిలిచికొని రమ్ము.

భటు—చిత్తము. (నిష్క్రమించును.)

అశ్వ—(ఉత్తరములఁ జదువు కొనుచుఁ దల యూఁకించి ప్రకాశముగ)

ఆ॥ వె॥ జనకుఁ డెంత తఱుకుఁ ♦ జనవరి యైనను
నాఁడుబిడ్డలు హృద ♦ యాంతరమునఁ
దల్లి యెడలఁ బ్రేమఁ ♦ దగిలి యుండుదు రాపె
వీడ నయ్యె నేని ♦ బెంగఁ గొంద్రు.

ఆ కారణముననె—

చ॥ ఉరుకరుణాంతరంగుఁడు గుణోన్నతుఁడై తగు ప్రాణనాథుతో
నిరుపమభాగ్యరాశి యయి ♦ నిత్యసుఖోన్నతిఁ జెన్నుమీఱఁ గాఁ
పుర మొనరించు కాంతకును ♦ బుట్టినయింటికిఁ బోవుపట్టునన్
జరణము ముందు సాగు నను ♦ సామ్యమదేల వృథా జనించెడిన్.

పుట్టినయిండ్లకడఁ గల సహోదరపితృజనంబుల యందలి ప్రేమాధిక్యతయ యిందులకు ముఖ్యకారణంబు.

వాసంతిక—(ప్రవేశించి) నాయనగారూ! ఎందులకో పిలచితి రఁట?

అశ్వ—అమ్మాయి! మీ యమ్మ యొద్దనుండి యీ లేఖ వచ్చినది. అచ్చట నందఱకు క్షేమమే యఁట. మఱియు మీ యమ్మ కొన్ని దినములవఱకును రాదఁట. అయిన నీ కేమైనను గావలసియున్న నన్నడుగ రాదా? ఆమెకు వ్రాయు టెందులకు?

వాసం—అందువలన నేమి జరిగినది?

అశ్వ—ఏమియు లేదు. కాని నీ ముద్దులను శ్రద్ధతోఁ జెల్లింప వలసినదిగా నాకు వ్రాయుచున్నది. నే నిదివఱ కట్లు సేయుచుండ లేదా?

వాసం—ఆ॥ శా॥ ప్రేమమీఱఁగఁ దమ బిడ్డల నోముఁగఁ
దామె వలతు లనుచుఁ దమ వియోగ
మపుడు వారి నోము నాప్తులు లే రంచుఁ
దలఁతు రెపుడుఁ గూర్మి తల్లు లార్య.

ఇది పుత్రవాత్సల్యంబు గాని వేఱొండు కాదు. ఈ కారణంబున మాజనని మీ కేమైన వ్రాసి యుండవచ్చును, గాని నే నామె కేమియు వ్రాయ లేదు.

అశ్వ—అయినను మీతల్లి చనినది మొదలు నీవు మిగుల బెంగగొనిన ట్లగపడు చున్నావు. నేఁడు మన మొక విహారస్థలము నకుఁ బోవుదము. నీ వెఱింగినస్థల మేదియో చెప్పుము?

వాసం—జనకా! ఉద్యానవనముంబోలు నొక విహారప్రదేశము గలదు; అది—

ఉ॥ శీతలవాతపోతములఁ జేఁ జెలువారుచు శ్రోత్రపర్వమౌ
గీతములన్ ద్విజవ్రజము గేరుచుఁ బాడుచు నుండ నెంతయో
చేతముఁ జల్లఁ జేయుచు విశేషముదావహమై నిరంతరా
యాతవిహారతత్పరుల కాకరమై రహిం బెంచు నెంతయున్.

దాని ప్రక్కనే యొక యాటవికప్రదేశమును గలదు. మన మా వైపునకుం బోవుదము.

అశ్వ—నేను నద్దానినే యనుకొనుచున్నాను. నీ వా త్రోవ లన్నియు నెఱుంగుదువా?

వాసం—ఆ త్రోవల నన్నియు నేను బాగుగ నెఱుంగుదును.

కం॥ కల దా తావున నొక ముదు
సలిదానికుటీర మొండు ♦ జనకా! యది పూ
ర్వాలనాటిగాథ లెన్నియొ
పలువిధములఁ జెప్పుచుండుఁ ♦ బ్రస్ఫుటఫణితిన్.

ఆ ముదుసలిది మన సేవకులలో నొకనితల్లి యగుటచే నేఁ బలుసారు లచ్చటికి పోవు చుందును.

అశ్వ—అట్లయిన నీదినమున మన మిరువురమును బోవుదము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు).

---

## తృతీయరంగము.

ఒక సత్రములో నొకగది. (ప్రవే) సారాబుడ్డితో మదిరుఁడు.

మది—(సారాయిని ద్రాగుచు) అహా! ఏమి రుచ్యము—

మ॥ కనులన్ గన్పడఁ జేయు దేవవితతిన్ ♦ గష్టంబు లెన్నింటి నేఁ
గనరా నీయదు సంఘటించుఁ గడు వాఙ్గాటిన్ సముత్సాహుఁగా
నొనరించు న్సతతంబు ధైర్యయుతుఁ జేయు న్మద్యపానంబు దీ
ని నిషేధింతురు కొంద ఱజ్ఞు లకటా ♦ సంద్యం బ దెట్లయ్యెడిన్.

మఱియు దీనిని సేవించువారికి మాటసిలుకడ యుండ దందురు; కాని యదియు నసత్యంబె; ఏల యన—

కం॥ కల నైన పీడ నిన్నని
పలికిన నా సంగడీఁడు ♦ వాసెనె? పాయం
గలఁడే! యిఁక నైనను మృష
గలదే! మదిరప్రియుండు ♦ గాఁడే! యతఁడున్.

అదిగో! అతఁడు సిల్లే నన్ను వెదకికొనుచు వచ్చుచున్నాఁడు. కల నైన పీడ నన్నవాఁడు తన మాటను దబ్బర చేసికొనునా? నన్ను విడఁజాలఁ డని పలికిన నా మాటయు సత్యమే యయినది కదా? కావున మా యిరుపురిమాటల యందు నసత్యమే లేదు. మమ్ము మించిన సురాపానులును లేరు. ఇఁక సురాపానులమాట నమ్మ రా దనుట కేవలము వెఱ్ఱి—ఛాందసము.

సౌమ్య—(ప్రవేశించి) మదిరా! నీవు సుదర్శనసేను నెట్లు పురందర చక్రవర్తికొలువున కేఁగ నొప్పించితివి? ఆతఁ డెప్పుడు నీ పాంచాలము విడువ నొల్లఁడే!

మది—అవును గాని యతఁడు నా యుపాయమునకు లొంగిపోయెను.

సౌమ్య—ఆ యుపాయముమాటఁ దరువాత విందును గాని—

ఉ॥ ఏ పని నైనఁ జేయుట కొ ♦ కించుక లాభము లేక యున్నచో
నే పనిలేనివాఁ డయిన ♦ నెన్నఁడుఁ బూనఁడు నిశ్చయంబు; నీ
కీ పనిచే లభించు ఫల ♦ మెయ్యదియో యెఱిఁగింపు మిత్రమా!
కోపము సేయ కయ్య మన ♦ కూరిమి పెంపున నిట్లు కోరితిన్.

మది—చెప్పెద వినుము—

సీ॥ చేసినారము గద ♦ చెల్మిఁ బిన్నట నుండి
బహుళానురాగంబు ♦ పరిఢవిల్ల

వ్యయ మొనర్చితిమిగ ♦ యమితధనంబును
సారాయి బ్రాందుల ♦ చవుల మఱిగి
దాఁగి యుంటిమి గదా ♦ తస్కరులను బోలె
సందుగొందుల ఋణ♦స్వాములకును
నిలువ నొక్కంతయు ♦ నీడ లేదుగ యిట
ఋణబాధ నానాఁట ♦ హెచ్చుకతనఁ
తే॥ గీ॥ గాన మన మీ సుదర్శన♦సేను మగధ
రాజ్యమునకుఁ గొంపోయి పు♦రందరాఖ్య
చక్రవర్తికొల్వునఁ జేర్ప ♦ సంతసించి
యాతఁ డెంతేనియు మనల ♦ నాదరించు.

సౌమ్య—అతఁ డనఁగా సుదర్శనసేనుఁడా? పురందరచక్రవర్తియా?

మది—పురందరచక్రవర్తియే.

సౌమ్య—ఏమీ చిత్రము!

మది—ఒక్కబుద్ధికే చిత్రములు గన్పించు చున్నవా? అటు లైన నీసారాయి నాశ మయినదియే.

సౌమ్య—ఓయీ! అది కాదు—

కం॥ ఉపకారము వడసినవా
రుపకారము మగుడఁ జేతు ♦ రొరు లేటికి నీ
కుపకారము నొనరింతురు?
విపరీతము గాఁగఁ దోఁచె ♦ విన నీ నుడువుల్.

కావునఁ "దా దూర సందులేదు—మెడ కొకడోల్" లన్నట్లు తన సర్వస్వముఁ గోలుపోయిన నీ సుదర్శనసేనుఁ డేమియు నీ కుపకృతి సేయ లేఁడు. ఇఁకఁ బురందరచక్రవర్తి సేయు కారణము గాన రాదు.

మది—కానరా కేమి? ఈ బుడ్డినిగూడ సేవించి దీర్ఘదృష్టితో విలో
కింపుము. (బుడ్డి నిచ్చును.)

సౌమ్య—(బుడ్డిని బుచ్చుకొని యాలోచన మభినయించి) మున్ను రాజ్యాంగవిషయములలో నీపురందరచక్రవర్తికిని ప్రకంపన చక్రవర్తికిని సంభవించిన కలహామునం దీ పురందరచక్రవర్తిపక్షమున నెంతయో వాక్కలహ మొనరించి యతని రాజ్యచ్యుతి కెంతయుఁ బరితపించిన దీనుదర్శనసేనునితండ్రి కాఁడా?

మది—అవును.

సౌమ్య—అహా! ఏమి నీ కుశాగ్రబుద్ధి! (విచారముతో) నీతివర్తన కారణముననేకదా పాప మీతని కీయైశ్వర్యచ్యుతియు దేశభ్రష్టతయుఁ దటస్థించినది!—

చ॥ పరమకృపాన్వితాత్ము లగు ♦ బంధురసద్వ్రతతత్పరాళికిన్
నిరుపమసత్యశీలురకు ♦ నిందకు జేను పొట్ట యేని, ట
క్కరులకు నీతిబాహ్యులకు ♦ గౌరవపూర్వకజీవనంబు, భా
సుర మగు భోగభాగ్యములు ♦ సూచితె కాలమహాత్త్వమో సఖా.

మది—నిజము మిత్రుఁడా! ఆ కారణముననే నా పూర్వవర్తనమును మార్చుకొని యెల్లరును నింద్య మని వాకొను చున్నను నేనిట్లు సురాపానసక్తుండనై యిప్పుడు సుఖముగాఁ గాలంబుఁ గడపు చున్నాఁడను.

సౌమ్య—(చిరునవ్వుతో) అగు నగును. నీ సుఖంబునకు నీవును నీ యనుచరుండ నగునేనును సంతసింపవలెఁ గాని; యిఁక సుదర్శనసేను నయ్యెడ కేఁగ నెడఁబఱచితివా?

మది—అదియే నా కసాధ్యముగ నున్నది - కాని (ఇటు నటుఁ జూచి రహస్యముగ) అశ్వనమంత్రిని వధించుటకుమాత్రి మతం డొడంబడియె.

స్యాము—అందువలన లాభ మేమి?

మది—అప్పుడు మన ప్రయత్నము లేక తనంతటఁ దానే మగధకుఁ బయన మగును.

స్యాము—అ దెట్లు?

మది—ఏమి?—

తే॥ గీ॥ తన యసూయాభరంబునఁ ♦ గినుకఁ జెంది
యధముఁ బోలె రాజద్రోహ ♦ మాచరించు
వానికి విదేశగమనంబె ♦ ప్రాపు గాక
యన్య మేది ప్రాణంబుపై ♦ నాస యున్న.

సాము—అవు నవును. మంచి యుక్తినే పన్నితివి; కాని యశ్వన మంత్రిని వధింప నతనిఁ బ్రోత్సాహపఱచుటలో నెంత శ్రమ దీసికొంటివో యది కూడ నెఱింగింపఁ గలవా?

మది—అదియు నవలీలగనె నెఱవేఱినది. శ్రమ యేల!

సీ॥ తన జమీ హరియించు ♦ తలఁపున నశ్వన
మంత్రి పన్నిన యట్టి ♦ తంత్రములను
బెట్టిదం బగువార్త ♦ వినిపించి వాని తం
డ్రిని గతాయువుగఁ జేసినవిధంబు
ము న్నిట్టిసందర్భములఁ వాని పూర్వులు
ప్రకటించి నట్టి శౌర్యముల తెఱఁగు
నవసానసమయంబు ♦ నందు నాతని తండ్రి
సలిపిన యా ఘోరశపథములను

తే॥గీ॥ నున్న వారికి కొన్ని లేనివి ♦ కొన్ని నవిన
యమునఁ బోధించి వాని రో♦షాగ్ని రవులఁ
జేయ శలభంబు మాడ్కిఁ బ♦డ్కించు చుండె
మనసుదర్శనుఁ డశ్వా♦మాత్రివరుని.

మఱియుఁ దన కట్టి ఘోరాపకారి యైనవానిని వధించుటయు పౌరుషోచితధర్మంబుగ నెంచు నశ్వామిత్రిని. ఇప్పు డతఁడు తదర్థం బై మించినరోషంబున నెప్పు డెప్పు డాయని సమయాన్వేషణతత్పరుం డై యన్య చింతనము లేకుండె.

సౌమ్య—(స్వగ.) ఆహా! దుర్మార్గులచేతులలో సన్మార్గులు సైతము కీలుబొమ్మ లగుచున్నారు గదా! (ప్రకా.) మిత్రుఁడా! నే నొక్కరుండనే యనుకొంటిఁ గాని నావలెనింక నెందఱుం దఱు నీవలనఁ మోసగింపఁబడ నుండిరో కదా!

మది—సంగడీఁడ! నీసౌమ్యగుణంబులచే నీనామము నెంతయు సార్థకము సేయుచుంటి వని పలుమాఱుఁ బ్రశంసించు న న్నిట్లు వంచింపు చున్నాఁడవా? నేను నీ కొనరించిన మోసమెయ్యది?

సౌమ్య—ఏమియు లేదు—

సీ॥ అనవరతాధీన ♦ మై యున్న పిస్తుల
భాగ్యరాసుల నెడఁ ♦ బాపినావు
విబుధసంగతమున ♦ విహరించు న న్నిట్లు
నీచులమధ్యను ♦ నిలిపినావు
నింద్య మనుచు దేని ♦ నిరసింతునో యట్టి
మద్యంబుపైఁ జవుల్ ♦ మలపినావు

తగువారిలోన న • న్నాగుణుల్ తనిపించి
గౌరవాదుల బూదిఁ • గలిపినావు
తే॥ గీ॥ కటకటా! యేమి చెప్పుదు నీ • కరణి నిన్ను
డుంచె మున్ దింక నేమికా • నున్న దౌకొ
భావిభాగ్యంబు నెఱుఁగ నె • వ్వారి శక్య
మైనఁ గలుగద యిఁక నైన • జ్ఞానలవము.

మది—అకటా! నీచే నిప్పుడు సంపూర్ణముగ నిందింపఁ బడితిని; గాని యుభయులము గలిసి చేసినపనికి నే నొక్కరుండనే నిందార్హుండనా! ఇది నీ వెఱుంగనిదియా! నీ విట్లాడు కారణంబు నాకుఁ దెలియ దనుకొంటివా?

సౌమ్య—మిత్రుఁడా! కోపింపకుము. పూర్వస్థితి యించుక జ్ఞప్తికి వచ్చుటచే న ట్లంటిఁ గాని నేనే స్థిరచిత్తుండ నైన నీవు నన్నే మి చేయఁ గలవు? కావున నీ వన్నట్లు నీ వొక్క రుండవే నిందార్హుఁడవు గావు. అయిన దీన నీకుఁ దెలిసిన దేదియో యించుక వచింపుము.

మది—నీ పినతల్లి యవసానస్థితియం దుండిన దనియు నా జమీాకెల్ల నీ వొక్కరుండవే యుత్తరాధికారి వనియుఁ జప్పితివే— ఆ విషయ మిప్పు డే మయినది?

సౌమ్య—ఇది నిన్నటివార్త. నేఁటివార్త యింకను దెలియలేదు.

మది—ఆ యుదంతము సంపూర్ణముగఁ దెలిసికొనిన పిదప నన్ను వీడ వచ్చును. అంతదనుక నన్ను వీడకుందువు గాక యని కోరుచున్నాను; కాని—

క॥ ఒకమంచంబున శయ్యాయు
నొకకంచంబునను బువ్వ • యును భ్రాతృలపో

లిక స్నేహంబును జేయుచు
సకటా! తుద కిట్లు వీడ • న్యాయమె సఖుఁడా!.

సౌమ్య—ఓయి! నిన్ను విడుతు ననియా చింతిలు చున్నాఁడవు? అట్లెన్నఁడును దలంపకుము. నిన్ను వీడఁ గలుగుదు నేని యిదివరకే వీడెడివాఁడను. అట్లు వీడుదు నేని నాకు సారాయిబుడ్లు నం దిచ్చువా రెవరు? ద్యూతక్రీడాదులచేఁ గాలక్షేప మొనర్చువా రెవరు?

మది—(తేరి పాఱఁ జూచి) ఎవరో రాజభటులవలె నున్నారు. ఆ వచ్చున దెవ్వరు? తెలుపు మూయుము.

సౌమ్య—ఆ—వారు రాజభటులు గారు లే. మన సుదర్శనసేనుఁడు మఱి యింకొకఁడు.

మది—అవును. సుదర్శనసేనుఁ డిప్పుడు వచ్చెద నని చెప్పెను. నేను మఱచియే పోయితిని. అశ్వినమంత్రిని జంపుటకు వీలు చిక్కినదో? లేదో?

(సుదర్శనసేనుఁడు, చారుఁడు ప్రవేశింతురు.)

సుద—సౌమ్యుఁడా! ఇతఁడు నీ పినతల్లియొద్దనుండి వచ్చెను. నీకయి వెదకు చుండుటను జూచి నేను నిక్కడికే వచ్చు చుంటిని గనుక వెంటఁ దీసికొనివచ్చితి. పాపము నీపినతల్లి కాలము చేసిన దఁట. కడు విచా... ... ...ఏమిది! —విచారమునకు బదులు సంతోషసూచకముగ నీముఖకమలము వికసించుచున్న ది!

మది—ఆ॥ వె॥ పెద్దవారి చావు • పెండ్లితో సమ మండ్రు
ధనము వచ్చు నెడ ము•దంబుఁ గూర్చు

నంద్రుడు గాన యేల ♦ వ్యసనంబు వొడఁ జూపు
నా పెయాస్తి కితఁడె ♦ యాధిపుఁ డార్య.

(సౌమ్యుని వంకఁ జూచి) మిత్రుఁడా! మన యొక్క నిముస మైనను వృథాగాఁ గడపఁ గూడదు. తత్క్షణమే పోవలయును.

చారు—అవును. మిమ్ములను దత్క్షణము వెంట నిడుకొని రమ్మనిరి. శవము నట్లే నిలిపి యుంచిరి.

మది—అటులనా! సౌమ్యుఁడా! పోవుదము. త్వరపడుము. (సుదర్శన సేనుని వంకఁ జూచి) శౌర్యధనా! నేఁ జెప్పినమాటను మఱవకుము. (ఇరువురు నిష్క్రమింతురు.)

సుద—అయ్యో! మదిరునితో మాటలాడుటకే వీలు లేకపోయెనే. ఈతఁడు; మున్నెవ్వఁడో యశ్వనమంత్రి—

మ॥ తన కెగ్గెదా రవంత చేసెనని క్రో♦ధం బెంతయు న్బూని య
శ్వనమంత్రి న్వధియింపు మంచుఁ బురికొ♦ల్పన్జూచు చున్నాఁడు వా
నిని జంప న్నానేల కల్గదగఁ డెం♦తే మోసముం జేయు కుం
డెనె; నా యీస్థితి కెల్ల కారకుఁ డతఁ♦డే యూగఁగ యూహింపఁగన్.

ముమ్మాటికి నతండె — ఏలన—

సీ॥ తన జమి గొనఁబడె ♦ ననువార్తఁ జెవి నిడి
ప్రేమంపు జనకుఁ జం♦పించు టొకటి
రాజ్యంబుతోడ సా♦మ్రాజ్యంబు నెల్ల హ
రించి సౌధము వెడ♦లించు టొకటి
సచ్ఛీలుఁడై యజ♦స్రము మముఁ బ్రోచు నే
లికను రాజ్యము వెడ♦లించు టొకటి
గ్రుడ్డిగవ్వకు నైనఁ ♦ గొఱగాని యాతని
భృత్యులు కాఱులు ♦ బ్రేలు టొకటి

ఆ॥ వె॥ యిట్టికారణము ల । నేకంబు లుండ నే
నేల యాతని వధి । యింప రాదు!
సాహసంబులేదొ! । శౌర్యధనుఁడఁ గా ను!
కానఁ గూల నడుతు । వాని నిపుడె.

(నిష్క్రమించును.)

---

## చతుర్థరంగము

### కోటవెలుపలి మైదానము.

ప్రవేశము:— అశ్వనమాత్రి—వాసంతిక.

వాసం—ఆ॥ వె॥ చూడు మదిగొ మనకుఁ । జూపుమేరను దాళ
పటకుటీర మొండు । పఱఁగు చుండు
వెలయు చుండు నందు । వృద్ధురా లొకరిత
యంధురాలు సన్న । నాథ్యురాలు.

ఆమె మన వనపాలకునితల్లి. నేను విహారమునకు వెడలునప్పు డెల్ల నచ్చటికే వెళ్లుచుందును. ఈమె సుదర్శనసేనుతండ్రిని గూర్చి చినకథల నన్నింటినో చెప్పు చుండును. అచటకుఁ బోవుదము రమ్ము.

అశ్వ—అమ్మా! మన కాకథ లెందులకు? అయినను ప్రొద్దుగూడ విశేషించి లేదు. ఇంటికిఁ బోవుదము రమ్ము.

వాసం—తండ్రీ! ఇచ్చటి వింతలఁ గొన్ని చూచి పోవుదము. చూడు!
(పరీక్షించుచు)

మ॥ బలవంతుల్ బలహీనులన్ దుడుకుమైఁ । బైకొన్నచందాన సం
కలితానేకగుహాళిశోఁ బఱఁగు నీ । యున్నతభృత్తునుం జూచితే

పాలయింపం గల దీనకుటీరమును సం♦పూర్ణానిలోదగ్రసం
చలితంబై యన వ్రాలియుండెను భయా♦శ్చర్యంబుల న్గొల్పుచున్.

మఱియు నా పూలగుత్తు లిరుపార్శ్వముల నెట్లు లాగుడిసె నలంకరించినవో **చూడుము.**

అశ్వ—వీని నెల్ల మఱియొకసారి వచ్చి **చూడ** వచ్చును గాని యిటు వీక్షింపుము—

ఆ॥ వె॥ వేడివెలుఁగుఁ జూడు ♦ వేడిమి విడి పశ్చి
వడిగఁ బోవు చుండె ♦ వ్యవధి లేమిఁ
గాన మనము నేఁగఁ ♦ గావలె నిలు సేర
వేగ రాఁ గదమ్మ ♦ వినఁగదమ్మ.

వాసం— నాయనగారూ! మాట లాడుచునే మనము సమీపించితిమి. ఇఁక రెండుమాట లాడి పోవుదము రండు. (చతురికగుడిసెను సమీపించి) ఎవ రక్కడ? చతురికా! (పిలచును.)

చతు—(గుడిసెలో నుండి బైటకు వచ్చి) ఎవరు వారు? (స్వగ.) వాసంతికమాటవలె నున్నది. (ప్రకా) అమ్మా! వాసంతికా!

వాసం— అవును నేను వాసంతికనే— మా నాయనగారు నిన్నుఁ జూడ వచ్చిరి.

చతు— అమ్మా! ఆలాగా! నేఁడు మహాసుదినము. స్వామీ! ఆ పీఁటపైఁ గూర్చుండుఁడు. నాకుఁ గన్నులు గాన రావు-కాని చేతిగుర్తునఁ జూచుచున్నట్లే కాలము గడుపుచుందును. వయసు చాల తీఱిపోయినది నాయనా!

అశ్వ—నీ విచ్చట నెన్ని దినముల నుండి కాఁపుర ముంటివి?

చతు—సుదర్శనసేనుని తాతముత్తాతలనాఁటి నుండి మే మిచ్చటనే కాఁపుర ముండెడివారము; కాని వారితోడ మేముమాత్రము వెతలు నోము నోఁచుకొనలేదు బాబూ!

అశ్వ—(వాసంతికతో)

క॥ "మే" మని భాషించుటచే
నీ ముదుసలిదాని కింక ♦ నేమో యాప్త
స్తోమము గల దని తోఁచెడి
నే మైన నెఱుంగు దమ్మ ♦ యెవ్వారో వారల్.

వాసం—క॥ వినవే! యీ ముదుసలి కొక
తనయుఁడు గలఁ డంచుఁ జెప్పుఁ ♦ దండ్రీ! యతఁడే
మనరు వనీపకుఁ డై కొ
ల్వొనరించుచు నుండె హర్ష ♦ మొదవఁగ నిచ్చల్.

అశ్వ—ఓహూ. (చతురికతో) అట్లు విచారపడుచుంటి వెందులకు? నీకుమారునకు వా రిచ్చినంత జీతమును మే మిచ్చుటలేదా?

వాసం—అది కాదు నాయనగారూ—ఈమెగుడిసె జీర్ణ మగుటచే వాన కురియుచున్న దఁట. చాల శ్రమపడుచున్న ట్లిది వఱకు నాకుఁ జెప్పియున్నది.

అశ్వ—నీ వెప్పుడును జెప్పనే లేదే—అట్లయిన నీగుడిసె బాగుచేయుటకే మగునో యది యిప్పించెద.

చతు—ఆ॥ వె॥ స్వామి! వృథగ పలుకు ♦ వలదు మీ ద్రవ్యంబు
కొడుకుఁ దెచ్చుచుండెఁ ♦ గూలిసేసి

పొట్టకొఱకుగాదు ♦ పూర్వపుదొర లందుఁ
గలుగుభక్తి నిట్లు ♦ పలికి యుంటి.

అశ్వ—అదియేమి! వానిస్థానమున మేము ప్రవేశించి యుంటిమి. నీకుమారుఁడు మాయొద్దనే యుండెను. మేముమాత్రము మీదొరలము గామా? ఆభక్తి మాపై నుండవలదా?

చతు—ఆ విధమున మిమ్మును బ్రేమించుటకు నాకు సమయము దొరక కున్నది.

వాసం—చతురికా! నీ వెవ్వనితో సంభాషించు చుంటివో యెఱుఁగుదువా?

చతు—ఆ- ఎఱుఁగ కేమి? మీతండ్రిగా రగు యశ్వసమిత్రిగారు గారూ?—

వాసం—అవును.

చతు—అయిన నే నిప్పు డేమి తప్పాడితిని? స్వామీ! నేను మీయన్నము దిను చున్నందులకు మీ కొకయుపకృతిఁ జేసెద. సావధానుల రై వినఁగలరా?

అశ్వ— తే॥గీ॥ క్రుంకుచున్నది ప్రొద్దు మే ♦ మింక నటవిఁ
గడచి పోవలె నింటికిఁ ♦ గాన వేగఁ
జెప్పఁ గలిగినఁ జెప్పుము ♦ చిత్తగింతు
మైన నీప్రక్క మాకు సా♦యం బొనర్ప!

చతు—బాబూ! తృణీకరింపకుము. ఏమో పెద్దదాననుగదా! అయిన యీజమియంతయుఁ దన దనియు మీ రక్రమముగ హరించితి రనియు సుదర్శనసేనుఁ డనుకొనుచున్నాఁడుసుమా!

అశ్వ—నేను నట్లే విను చుంటిని. అయిన—

చతు—అతనితండ్రిమరణమునకుఁ గూడ మీరే కారకు లఁటే?

అశ్వ—పిచ్చిదానా!

ఉత్సాహ.

ఒకనినాపు బ్రతుకులకు ము • ఆలోకఁ డెల్ల కర్తయా
సకలమునకుఁ గర్త యొకఁడె • శక్తియుక్తుఁ డైన పర
ప్రకరమునకుఁ గలుగఁజేయు • వారి వారి పూర్వజ
న్మకృతసుకృతదుష్కృతముల • మహిని మేలు కీళ్ళుగాఁ.

కావున నది దైవాధీనము.

చతు—అవునుగాని వారివారియు లెల్లను మహాశూరులు. మంచిచెడ్డలకు వెరవరు. ఇపుడు మీ రిల్లొంటరిగా వచ్చుట—

అశ్వ—(సాటోపముగ) నీవు కేవల మమాయకురాలవు సుమా!

ఆ॥ వె॥ వృద్ధురాల వగుట • నఱుఁగ వేమో రాజ్య
మెవ్వ రేలు చుండి • రిప్పు డట్టి
పనులు సాగ విట్టి • పలుకుల కెవ్వరు
భయము పడెద రనుచుఁ • బలికె దీవు!

చతు—స్వామీ! నాకుఁ దోఁచినమాటఁ జెప్పితిని. నాపైఁ గోపగింపకుఁడు—తమచిత్తము—క్షమింపుఁడు.

వాసం—నాయనగారూ! ఏ మిది యిట్లను చున్నది? ముదుసలిదియని దీనిమాటను ద్రోసివేయకుఁడు.

అశ్వ—అమ్మాయీ! దీనికి వయస్సుతోఁ గూడ బుద్ధియు జడత్వము బొందినది; కాని యిటుఁ జూడుము.

చ॥ ఖరకరుఁ డెట్లు బాఱె, విహంగంబులు రివ్వున జంటఁగూడి కో
టరముల దూరెఁ, గ్రేళ్ళు ఘుకుంటల్ బచరించు ము లేఁగ లెంత యో

పరుగిడుచుండ గోగణము ♦ బారులుదీరుచు స్వీయ పశాగృహాంతరములఁ జేరెఁ గాన విపినంబున నుండఁగ రాదు రమ్మికన్.

(అశ్వసమంత్రియు వాసంతికయు నిష్క్రమింతురు.)

చతు—అయ్యో! ఏమీ నాబుద్ధిజాడ్యము! అకటా ప్రాణము విషయములో భయ మెవ్వరి కుండదు? ఈ భయమున నితఁడు పాప మా సుదర్శనసేనున కేమికీడు సేయునో కదా! ఏసి కుపకారము జేయఁబోయితినేకాని వాని కపకార మగు నని యెఱుంగ నైతి.

శా॥ హృద్యంబైన మదీయమానసము నేఁ ♦ డీరీతి నజ్ఞాన మై
చోద్యంబయ్యెది యేమొ యిట్లు చలన♦స్ఫూర్తి న్వడంబించునన్
సద్యోత్పన్న జడత్వమూలమున నా ♦ సంభావణం బెన్నఁగా
నాద్యంతంబులు లేని దయ్యె నకటా! ♦ యద్దాన నేమౌ నొకో.

(స్తుతి నభినయించి) ఇశ్శో! ఈ పాడుకుక్కలు నా ప్రాణములు దీయుచున్నవి. ఎప్పుడు నేదో యొకటి పడఁద్రోయుచునే యుండును.

(నిష్క్రమించును.)

---

## పంచమరంగము.

అడవి.

ప్రవేశము:—అశ్వసమంత్రి—వాసంతిక.

అశ్వ—అమ్మా! వాసంతిక! భయపడకుము. ఆ కారుదున్న మనల నేమియుఁ జేయదు. నా దగ్గఱగ నడువుము.

వాసం—తండ్రీ! చూడు—మనవంక నెటుల వెఱ్ఱిచూపులఁ జూచుచున్నదో! అయ్యో—

ఆ॥ వె॥ చూడు మయ్యా కాళ్ళు ♦ జాడించుచును ముట్టి
వంచి తోఁక నెత్తి ♦ పరుగు లిడుచు
వచ్చుచున్నది మన ♦ పైఁ బడు చందానఁ
దప్పుకొనఁగ నెట్లొ ♦ తండ్రి! చెపుమ.

అశ్వ—భయము లేదు. అది చాల దూరమున నున్నది. నీవు మాత్రము త్వరత్వరగా నా వెంటనే నడుచు చుండుము.

వాసం—అయ్యో—నాయనా! దూరముగ నున్న దను చున్నావేమి. ఇప్పుడు చూడు—

అశ్వ—అక్కటా! నీ వన్నట్లు మనమీఁదికే వచ్చుచున్నది. అయ్యో! ఇఁక నే మున్నది!—సమీపించినది!

వాసం—నా కాళ్ళు వడఁకు చున్నవి. ఇఁక నేను నడవలేను. ఏమి చేయుదు?

అశ్వ—అమ్మాయీ! ఇట్లు మన మిద్దఱముఁ గలిసి యుండినచో దానిచే నిరువురమును జావ వలసివచ్చును. గావున నేను ముందు నడచెదను. అది నాపైఁ బడి నాతోఁ బెనఁగు లాడు చుండును. ఈలోఁగా నీ వింటి కేఁగుము. ప్రాణ ముండిన నేనును వచ్చెదను.

వాసం—ఆ! చచ్చితిమి—చచ్చితిమి! (మూర్ఛిల్లి పడుచున్నది.)

అశ్వ—హా దైవమా! బిడ్డా! ఇక్కడనే పడిపోయితివా! (అనిమీఁదఁ బడును.)

(తెరలో "ఢం" అను శబ్దము వినవచ్చును.)

అశ—(తిరిగి చూచి) ఏమీ చిత్రము! (లేచి దృష్టి నిగిడించి) మృగ మిట్లు చచ్చి పడు కారణ మేమి? ఎవరును గానరారే!

అమ్మా! వాసంతికా! మృగ మెవ్వరివలననో చంపఁబడినది. ఇఁక లెమ్ము. (విచారముతో) మాటలాడ దేమి? ప్రాణములు గడఁ బట్టఁ గాఁబోలు ఏమి చేయుదు? మృగమును జంపిన వా రెవరో? (ఇటు నటుఁ జూచును.)

(కవచధారుఁడై సుదర్శనసేనుఁడు ప్రవేశించును.)

అశ్వ—మహానుభావా! ఈ మహిషమును జంపి నాప్రాణములఁ గాపాడితివి ఈ మూర్ఛనుండి తప్పించి నా పుత్రికప్రాణములను గూడఁ గాపాడి పుణ్యమును గట్టుకొనుము.

సుద—మీ ప్రాణముల మీ పుత్రికయే కాపాడినది—కాని నేను గాదు. ఈమెను లేవఁ దీయుఁడు. పాపము—మూర్ఛఁ జెంది నట్లున్నది.

అశ్వ—అమ్మాయీ! వాసంతిక!

వాస—(కదలు చున్నది) ఊఁ...

సుద—ఆర్యా! ఈమెకు స్పృహ దప్పినది. ఇంచుక సే పూరకుండుఁడు. తేఁ గలిగితి రేని దాహంబుకొఱకుఁ గొంచెము మంచినీటిని దెండు.

అశ్వ—అట్లను. చల్లనినీటిచే ముఖమును దుడిచి మఱికొంత దాహ మిచ్చినచో నీమెకు సేద దీరఁగలదు. అట్లే తెచ్చెదఁ గాని యంతదనుక నీమెను గాపాడు చుండుఁడు.

సుద—ఆమాట మీరు చెప్ప నక్కఱలేదు.

అశ్వ—ఆపద్బాంధవుఁడవు. నిశ్చయముగాఁ జెప్ప నవసరమే లేదు.

(నిష్క్రమించును.)

సుద — ఓహో! ఈతని కీ ప్రదేశము నూతనము కాఁబోలు. రెం
డడుగులదూరములోఁ గల నీ కాసారమును విడిచి యెక్కడకో
యట్లు పోవుచున్నాఁడు. నేనుబోయి తెచ్చెద.

(పోయి దోసిటినిండ నీటినిదెచ్చి కనులను దుడుచును.)

వాసం — (సుదర్శనసేనుని జూడక యే కనుల నులుముకొనుచు లేచి)

మ॥ జనకా! యే యెడ కేఁగినాఁడవొకో యీ ♦ చందంబునన్ ఘోరకా
ననసీమన్ ననుబాసి జీవమున నున్నావొ? కటా! లేవొ యే
రిని నీక్షేమ మెఱుంగఁ జెప్పఁ డని ప్రార్థింతు న్మదీయోక్తులన్
విను వా రెవ్వ రిఁ కేది దిక్కుద దిగుల్ ♦ నిండారె నో దైవమా!

సుద — (ఎదుటకు వచ్చుచు) అబలా! బేల వయ్యెద వేల?

వాసం — (ససంభ్రమముగ) ఆర్యా! మీ రెవ్వరో నే నెఱుఁగ.
నాతండ్రిని గుఱించి మీ రేమైన నెఱుంగుదురా?

సుద — ఎఱుఁగ కేమి కాని, నీ తండ్రి క్షేమముగనే యున్నాఁడు.
ఇప్పుడే వచ్చును. భయపడకుము.

వాసం — నాతండ్రి క్షేమముగా నుండెనా! ఉండిన నన్నేల యొం
టరిగా విడిచిపోవును?

సుద — తే॥గీ॥ నిన్ను వెన్నంటి యున్నవాఁ ♦ డెన్నఁటికిని
క్షేమముగ నుండుఁ గాదె యీ ♦ చింత యేల?
మఱియు నొంటరి వెట్లౌదు ♦ మగువ నీదు
దండ వెరువరి నగుచు నే ♦ నుండుదనుక.

వాసం — మీ మాటలు నాకేమియు నర్థమగు చుండుట లేదు. మా
తండ్రిగా రిచ్చటి కేఁగిరి?

సుద— నీవు మూర్ఛిల్లి పడిపోవుటచే నేద దీర్ప మంచినీటి కొఱకై వెడలెను. ఇప్పుడే వచ్చును.

వాసం— కారుదున్న యే మయినది?

సుద— భగవంతుని దయవలన నది నాచేఁ జంపఁ బడినది.

వాసం— అహా! ఏమి మాభాగ్యము! స్వామీ! మీరెవరు ? మీపే రెయ్యది?

సుద— నాపేరు నీకెందులకు? అది వినిన నీకుఁ గష్టముగ నుండును.

వాసం— ఏమీ యాశ్చర్యము! మృత్యువునోటనుండి తప్పించి మమ్ముఁ గాపాడిన మీ నామమును బలుమాఱు స్మరించుటకు మాఱు వినుటయే కష్ట మగునా?

క॥ ఆపద్బాంధవుఁడవు మముఁ
గాపాడిన సుకృతి వగుటఁ ♦ గలకాల మెదన్
నీపేరు దలఁచుకొనియెద
మో పావనచరిత! దాఁచు ♦ చుంటి వదేలా?

సుద— అటులైన నన్ను సుదర్శనసేనుఁ డందురు. మీ కోట పూర్వము నాదియె.

వాసం— (లజ్జ నభినయించుచు) ఆలాగుననా! (అటు నిటుఁ జూచి) అదిగో! నాయనగారు వచ్చుచున్నారు. (డాయఁబోవును.)

అశ్వ—(ప్రవేశించి దోయిటిలోని నీటిని బాలఁ బోసి) ఆహా! తల్లీ! బ్రదికి యుంటివా! (కౌఁగిలించుకొనుచు) చూచితివా!—

ఆ॥వె॥ ఈ మహానుభావుఁ ♦ డామృగంబును జంపి
మనకుఁ బ్రాణ దాన ♦ మొనరఁ జేసెఁ

గాన దైవసముఁడు ♦ గద మన కీతఁడే
విధిని దీర్పఁ గలము ♦ వీని ఋణము.

కావున నొక్క నమస్కారమును మాత్రము చేయుదము.

సుద—అట్లు వలదు. మీరు పెద్దలు.

అశ్వ—(స్వగ.) ఆహా! ఏమీ వీని బుద్ధిసౌజన్యము! (ప్రకా.) నిశ్చయము. అమ్మాయి! నీవు మాత్రము నమస్కరింపుము.

వాసం—(సిగ్గున వంగి నమస్కరించును.)

అశ్వ— అయ్యా! మీ పే రెయ్యదియో వినఁగోరెద?

సుద— నా పేరు మీ కనవసరము. నా వలన మీ కేదేని సాహాయ్యము గావలసియున్న నన్నడుగుఁడు. చేయఁ గలిగిన దైనఁ జేసెద.

అశ్వ— ఇదివఱకే చేయఁ దగిన సాహాయ్యమును జేసితిరి. ఇఁక నేమున్నది? కాని మీ పే—

సుద— (నిష్క్రమించును.)

అశ్వ— వాసంతి కా!

ఆ॥ వె॥ అతఁ డెవఁడొ యిట్టి ♦ యవ్యాజకారుణ్య
మునను సాయపడియుఁ ♦ దనదు పేరు
తెలియ నీయఁ డెట్టి ♦ ధీమంతుఁడో కాని
నామ మెఱుఁగ కుంట ♦ న్యాయ మగునె!

వాసం— నాయనగారూ! తమరు లేనప్పుడు నాతోఁ దాను సుదర్శనసేనుఁడ నని చెప్పెను.

అశ్వ— (ఆశ్చర్యముతో) అలాగా!- ఊహూ- అమ్మాయీ! వాసంతి కా! అస్తమాన మైనది. చీఁకట్లు గ్రమ్ముచున్నవి. సత్వరగా నింటికిఁ బోవుదము రమ్ము. (నిష్క్రమింతురు)

---

# ద్వితీయాంకము.

ప్రథమరంగము:— చంద్రశాల. (ప్రవే.) అశ్వసముద్రా.

అశ్వ— దీని కేమి కారణ మై యుండును? ఒకవేళ—

చ॥ చతురిక సెప్పినట్లు నను ♦ జంపు తలంపు జనించ దుర్మదో
ద్ధతుఁ డయి శాతశస్త్రములఁ ♦ దాల్చి తదర్థ మరణ్యసీమ ని
గతిఁ బొదరిండ్ల డాఁగి తమ♦కంబున నేసిన బాణ మట్లు మ
త్కృతిసుకృతంబున న్మృగము ♦ గీటడగించెను నన్ను మాటుగాఁ.

అని నిశ్చయించుటకును వీలు లేకున్నది; ఏల యనఁగాఁ దదుపరి నైనఁ దనపనిని నెఱవేర్చుకొనక సాదరాయత్తచిత్తుఁడై చరించిన దెంతయు స్తవనీయమై యున్నది. మఱియు "మిమ్ము మీ సుచరిత యే కాపాడినది" అని పలికెఁ గదా. దీని యర్థ మేమై యుండును? నేను వాసంతికతో "అమ్మాయీ! నేనా జంతువుతోఁ గలయఁబడెద. నీ వింతలో నింటి కరుగుము" అని యట్లొనర్చు కుండుటకు వాసంతిక యొక్క మూర్ఛాకారణమును బట్టి యాలేఁడ ట్లనె ననుకొంటిఁ గాని, మా మాటల నతఁ డెట్లు వినఁ గలిగె? — అది కాదు—తన పేరు సైతము నాకుఁ జెప్పక యేకాంతముగ నుండి యపుడు వాసంతికతోఁ జెప్పె నఁట. ఇం కేమి చెప్పెనో యడిగి తెలిసికొనియెద—ఎవఁడురా? అక్కడ—

భటుఁడు— (ప్రవేశించి) స్వామి! ఏమి యాజ్ఞ?

అశ్వ— వాసంతికను బిలిచికొని రమ్ము.

భటు—చిత్తము. (నిష్క్ర.)

వాసంతిక—(ప్రవేశించి) నాయనగారూ! పిలిచితిరంట - ఎందులకు?

అశ్వ—తే॥గీ॥ అమ్మ! మీయన్నకు మఱి మీ ♦ యమ్మకేను
వ్రాయఁ దలఁచితి నిన్నటి ♦ వార్త లెల్లఁ
గాన సీతో సుదర్శన ♦ సేనుఁ డేమి
చెప్పె నే లేనియప్పుడు ♦ చెప్పు మమ్మ.

వాసం—ఆహా! నిన్నటియవస్థ మాయమ్మ విన్న నెంత భయపడునో కదా! నాయనగారూ! అన్నగా రున్న విదర్భకు జాబు లెన్ని దినములకుఁ జేరును?

అశ్వ—నాలుగు దినములకుఁ జేరునుగాని త్వరగా వ్రాయ వలయును. నే నడిగినసంగతిని జెప్పవైతివి.

వాసం—ఏమి చెప్పను—

చ॥ ఎఱుఁగుదు నామృగంబు పరు ♦ గెత్తుచు డాయఁగ వచ్చుచుంట, న
"న్నరుగుము పత్తనంబున"కఁ ♦ టంచును దాము మృగంబునోటిలో
నొఱగెద నింక నన్న భవ ♦ దుక్తు లెఱుంగుదుఁ గాని యన్యమే
మెఱుఁగ మృగంబు చావెటులొ ♦ యీవెటకేఁగితొ తండ్రి సర్వముర్ ॥

కొంతసేపటికి కనులు విచ్చి చూచి నిన్నుగానక పరితపించుచున్నతఱిఁ దన ప్రియోక్తులచే నన్నంతయు నాదరించుచు "నీతండ్రి యిప్పుడే వచ్చును. భయపడకుము" అని యూరడించుచుఁ దన పేరునుగూడఁ జెప్పెను. ఇంతకన్న నెక్కుడు జ్ఞాపకము లేదు.

అశ్వ—అతఁడు నీ మొదల గనఁబఱచిన ప్రేమ మిక్కిలి దొడ్డది.

వాసం—నిశ్చయము తండ్రీ! ఏమి ప్రేమ! ఏమి యౌదార్యము!

తే॥ గీ॥ ప్రాణదానం బొనర్చి యు♦వ్యాజకరుణ
మూర్ఛ నొంది యున్నపుడు నా ♦ మూర్ఛ దీర్చి
యాదరాయత్తచిత్తుఁ డై ♦ యతఁడు జూపి
నట్టి వాత్సల్యము నుతింప ♦ నలవి యగునె!.

అశ్వ—అటులనే కమ్మ వ్రాసెదను. నీ వింకఁ బోవచ్చును.

వాసం—(నిష్క్రమించును.)

అశ్వ—నాకుఁ గావలసిన సంగతి సరిగాఁ దెలియలేదు. అయినను దీనిని బట్టి కొంత గ్రహింపవచ్చును.

తే॥ గీ॥ అతని రాకడ సరిగ మా ♦ ట్లాడకుంట
నరయఁ జతురిక చెప్పిన ♦ దగును నిజము
గాని వాసంతికను ప్రేమఁ ♦ గన్న తెఱఁగుఁ
దలఁపఁ గారణ మొండగుఁ ♦ దథ్యముగను.

అతఁడు నిశ్చయముగ నన్నుఁ జంపుటకే వచ్చియుండు - కాని- వాసంతికగూడ నాతో నుంటఁ గని యాపెను రక్షింపఁ జూచి యారీతిఁ గావించె; ఇందులకు సందియము లేదు. కాని, యా సమయమున వాసంతిక నా సమీపమున లేకుండినచో నావని యేమగునో కదా.

చ॥ అసువులపై నపేక్ష యిసు ♦ మంతయు లేక చరించువారి కీ
యసదృశరాజశాసనము ♦ లన్న భయంబు జనింపకుండు న
న్న నరణి నిప్డు నాకయి వ♦నంబులఁ గాసి యొనర్పఁ గ్రూరుఁడై
మసలుచు నుండె నీతఁ డను♦మానము లేదిఁక నెట్టులో కటా!

రక్షకభటపరివేష్టితుండగు రారాజునకే మైన నిర్భయ మేమో కాని నాకది యెట్లు లభ్య మగును? నా జీవితమే సంశయాస్పద

ముగ నుండిన నా యీ వైభవములచేఁ బ్రయోజన మేమి? అక్కటా! నా మన స్సెంత వ్యాకులతఁ జెందు చున్నది! (తెరలో వీణా నాదము వినవచ్చుట నాలించి) ఆహా! ఏమి యీ సంగీతమాధుర్యము! విచారసాగరమున మునిఁగి యున్న నన్నీ సంగీతము దెప్పవలెఁ దెప్పునఁ దేల్చు చున్నది. సంశయ మేమి! రాలఁ గఱగింపఁ గల దనియు, మోడులఁ బల్లవింపఁ జేయఁ గలదనియుఁ జెప్పుదురుగదా! అట్టి గానరసము నా హృదయమును రంజింపఁ జేసినఁ దన్నఁ జిత్రము లేదు; కాని—

ఆ॥ వె॥ పాము నోటఁ జిక్కి ♦ ప్రాణముల్ గోల్పోవ
నుండి చెంత నెగురు ♦ చుండు మక్షి
కముల మ్రింగఁ జూచు ♦ కప్పవోలె ముదంబుఁ
జెందు చుంటి నహహా ♦ ముం దెఱుఁగక.

ఇంతలోనె నాప్రస్తుతావస్థను మఱచిన నేనెంత యల్పసంతోషిని! ప్రాణరక్షణము గానక పరితపించుచు నన్యవిషయములకు సంతసింపు చుంటిని. (ఇంచుక యోజించి) నా కిప్పు డీ ప్రకారము చేసిన శ్రేయస్కర మని తోఁచు చున్నది. నేను నాపుత్రికతోఁ గూడ నా జమీని జూచు నెపమున సుదర్శనసేనుని సౌధసమీపమున కేఁగి సమయమునుబట్టి యతని యింటి యతిథి నై యెట్లయిన నాతని లోఁబఱచుకొనియెద. దండోపాయ మిచ్చోఁ బనికి రాదు. చెంత నున్న నా కుమారితను జూచి నన్నిదివఱకుఁ గాపాడినట్లే యిప్పుడును నాకు లోఁబడును. ఇది నాకు రక్షణ మగుటయు కాక నా పుత్రిక కీతఁడు తగినవరుఁడును నగును. ధన మొక్కటియె లోపము గాని గుణగణములలో లోప మేమి కలదు? కావలయు నన్న ధనము నేన యిచ్చెదను. అంతయు బాగుగనే యున్నది. కాని యీ నా ప్రయత్నమును నా భార్య కొనసాగ నిచ్చునా—

శా॥ తానే సర్వ మెఱింగినట్లు పరబోధల్ జేకొనం బోదు మే
లైనన్ గీడయినన్ సదా తన మతం • బౌ నంచు మౌర్ఖ్యంబునన్
దానే పట్టునుబట్టునో యుదిరొ యు • క్తంబం చటుల్ సేయఁగాఁ
బూనన్ దీనికి నచ్చఁ జెప్ప నెటు లం • బ్బున్ బుణ్య మిప్పట్టునన్.

ఆ॥ వె॥ ఇట్టి భార్యఁ గలిగి • యేమి చేయఁగ లేని
వెఱ్ఱి నగుచు నిపుడు • వింతయూహ
లేమి సేయు చుంటి • నేరీతి నెఱవేఱు
సతికి వెరచు నట్టి • పతుల పనులు.

ఇవి యన్నియు నాసందియములే కాని తానుమాత్ర మింత కన్న మంచివరుని దేఁగలదా? అంతగాఁ గా దన్న నప్పటిమాటలప్పుడు చూచుకొనవచ్చును గాని ప్రస్తుత మిదియే కర్తవ్యము; కావున—

క॥ మొనమొన్న నాతఁ డొనరిం
చిన హాత్య నడంచి పుచ్చి • క్షేమము గూర్పన్
జనుదెంచితి నని చెప్పుచు
వినపింతుఁ దదీయవార్త • విస్పష్టముగాన్.

కావునఁ ద్వరలో నాపుత్రికతోఁ గూడ గొండొక నెపంబున నుదర్శనసేనుని సౌధాంతికమున కేఁగెద. (నిష్క్రమించును.)

---

రవణిక పుట్టినిల్లు:—ద్వితీయరంగము.

ప్రవేశము—రవణిక - మరాళిక.

రవ—చెల్లీ! మరాళికా! నా కేమియుఁ దోచుట లేదు. నీ వైనను జెప్పుము.

మరా—అక్కా! పెద్దదాన వగు నీకుఁ దోఁచకుండిన నిక నాకా తోఁచుట! అయినను యజమానురాలవుగదా నీవు!

రవ—బుద్ధిచాతుర్యములకుఁ జిన్న పెద్దతనము లేల? యుక్తముగా నుండిన యజమానురాల నైనను నీమాటను గాదందునా! ఏది? ఇది మంచిసంబంధ మని యొకదాని నిరూపించి చెప్పుము.

మరా—కడచినవారమున యోచించితిమే—పశ్చిమతీరపు సంబంధ మునుగుఱించి—అదియే నాకు యుక్త మని తోఁచుచున్నది.

రవ—అది యుక్తమే-కాని యొకటిమాత్ర మనర్థకముగ నున్నది. అది నీ వెఱుఁగవు.

మరా—ఏ మది? ఐశ్వర్యలోప మచ్చియా?

రవ—కాదుకాదు—

క॥ ధనధాన్యము లందును యౌ
వనసౌందర్యాదు లందు ♦ బాంధవ్యమునం
దును లోపములే దైనను
మన సొప్ప దతనికి వినుము ♦ నుత్సుత నీయన్.

ఏల యన—

సీ॥ సకలశాస్త్రంబులఁ ♦ జదివెఁగాక బుధాళి
నలరించు పాండిత్య ♦ మలరెఁ గాక
గౌరవార్హుం డయి ♦ భూరిసత్సభలలో
మెడఁ బూలమాలలఁ ♦ బడసెఁ గాక
కవితాప్రసక్తి స♦ద్గ్రంథముల్ లిఖియించి
యకలంకసత్కీర్తి ♦ నందెఁ గాక

సదమలాచారుఁ డైై ♦ సత్కులీనుం డయి
సజ్జనగోష్ఠియె ♦ సలుపుఁ గాక

ఆ॥వె॥ తాళిఁ గట్టినంతఁ ♦ దన యధికారంబె
చెల్లవలె నఁటంచుఁ ♦ జెప్పువారి
పొత్తు మన కదేల ♦ పొసఁగు నీలాటి సం
బంధములను దలఁప ♦ వలదు వలదు.

మరా—ఆహా! ధనధాన్యాదుల నేలోపమును లేక విద్యాతిశయంబున మించినట్టివానికి "భార్యను దనపలుకులకు జవదాటనీయఁ" డను లోపము నారోపించుచుంటివి? అటు లయిన నిది గొప్ప తప్పిదమే!

రవ—అంతియ కాదు—సర్వధర్మములును దనకుఁ దెలిసినట్లు భావించి మనల నంతగా లక్ష్యముసేయకుండెదరు. కావున—

తే॥గీ॥ వారి చేలోకు వైన సం♦బంధములను
వెదకి లోఁబర్చుకొనియెడి ♦ విధ మెఱింగి
వియ్య మందుట యుచిత మ♦వ్విధముగాక
తమకు మించు సంబంధముల్ ♦ దగవు తగవు.

మఱియు—

తే॥గీ॥ వారి కష్టసుఖంబులు ♦ వీరివిగను
వీరి కష్టసుఖంబులు ♦ వారివిగను
దలఁచి శుష్కరోషాదులఁ ♦ దగుల కైక
మత్యమున బంధుజను లుంట ♦ నూనితంబు.

మరా—(స్వగ.) ఏమీ నీమాటల తేటలు! (ప్రకా.) అక్కా! అయిన నీమతి కనుకూలించిన సంబంధ మిది యని నిశ్చయించుకొనియే యుంటివా?

రవ—సౌమ్యుఁడు తగినవరుఁ డని తలంచు చున్నాను. ఏల యన—

సీ॥ మును గల యైశ్వర్య ♦ మునకంటె నరయ న
త్యధిక మీ జమి ప్రాప్త ♦ మయ్యె నదియు
మనజమీ నంటుకొ ♦ నినరీతి సామీప్య
మున నుండి యెంతయో ♦ ముద్దు లొలుకు
మఱియుఁ బూర్వపురీతి ♦ మఱచి యాతం డిష్ట
సార్థకనాముఁ డై ♦ చనుచు మిగుల
శాంతస్వభావుఁ డై ♦ చనవరి యై మన
కనిశంబు లోఁబడి ♦ యులరు చుండు

తే॥గీ॥ నిటుల గుణరాశి యై చరించు వాని
కిడిన మనబిడ్డ కదు సుఖించుఁ గాన
నిట్టివానిని విడనాడి ♦ యేల వృథగ
వీర వారా యఁటంచును ♦ వెదకవలయు?

మరా—(స్వగ.) నీ కా త్రాఁగుబోతు సంబంధమే మంచి దని తోఁచి నది! అవు నవును. నీకుఁ దోఁచదు. ఒకరు చెప్పిన వినవు. నీ యిష్టము (ప్రకా.) అయిన నీ సమ్మతము వారికిఁ దెలిపి తివా?

రవ—అదియే నేఁడు తెలుపఁ దగిన విషయము; కాని-యేమని వ్రా యుదును?

మరా—సరే! మఱల నన్నే యడుగు చుంటివా! నీకన్న నాకెక్కుడు తెలియ దని యిప్పుడే కదా చెప్పితిని!

రవ—తెలియ కేమి కాని యీ విధముగ వ్రాయుచున్నాను.

మరా—ఏ విధముగా?

రవ— ఇదిగో చదువుము. (లేఖను బైకి తీసి) తపాలావేళ మించ లేదు గదా? (లేఖ నిచ్చుచున్నది.)

మరా— (పుచ్చుకొని చదువుచు) నీ లిఖితములో హంసపాదముఁ బెట్టింపఁగలమా! బాగుగనే యున్నది.

రవ— ఈ లేఖ సౌమ్యునకు మూఁడు దినములకుఁ జేరును. అతఁడు తన సమయమునుబట్టి యిక్కడకు వచ్చినవెంటనే వానితోఁ గలిసి మా యింటి కేఁగెద. పిదప వివాహనిశ్చయము చేసికొన నగును; గావున నిచ్చటికే రమ్మని వ్రాసితిని.

మరా— బాగుగనే యున్నది. ఉత్తరమును ద్వరగాఁ బంపుము.

రవ— (లేఖను దీసికొని నిష్క్రమించును.)

మరా— ఈ సౌమ్యునకు ద్యూతము నందును మద్యపానము నందును గల యాసక్తి సంసారంబు పైనంతగా నుండు నని తోఁపదు. కాని - వర్తన మేమో మాఱెన దని చెప్పుచున్నదికదా! దైవికమున క్షేమమే యగును గాక. (నిష్క్రమించును.)

---

తృతీయరంగము :—పురబాహ్యప్రదేశము.

ప్రవేశము :—కొందఱు సైనికులు- అశ్వనమంత్రి- వాసంతిక.

వాసం—నాయనగారూ! ఆటవికజంతు వొకటి యైనను గన్పించుటలేదేమి?

అశ్వ—ఆశ్చర్యమే యిది. నాఁడు మనల నెదుర్కొనిన కారుదున్నవంటి దొక్కటి యైనను గనఁబడుట లేదు. వానిని వధించు తలంపున నేఁడు మన మిట్టి పరిచారికావళితోడను వేటకాండ్ర తోడను వచ్చితిమి - కాని యిది నిష్ప్రయోజనమే యయినది.

వాసం—సుదర్శనసేనుని నాఁటి రాకడఁ జూడ నాతఁ డప్పు డప్పు డీప్రాంతముల వేఁటాడు చుండు నని తోఁచెడిని.

అశ్వ—(స్వగ.) అతని నాఁటిరాకకుఁ గలకారణ మీా పసిబిడ్డ కేమి తెలియును? (ప్రకా.) అగుఁనగు. ఆఁతఁడు చిన్నప్పటినుండియు ధైర్యసాహసోత్సాహంబులు గలవాఁడు. విహారమునందు నధికాపేక్ష గలవాఁడు.

వేఁటకాఁడు— దేవరా! యెనుబోతులుగాని చివంగులుగాని యొత్తుగా లేవని తమ యభిప్రాయము. అల్లెప్పటికి తల్చబోకండి. అవి యే పొదలోనో దాక్కొని మన్ని తొంగి తొంగి చూస్తూనే యుంటాయి. శలవిత్తే పెతిపొదను దూరి చూచి యీా బల్లాన వక్కొక్కదానినిగా పాణాలు తీసి మీా పాదాలుచెంత బెడ్తాము. సెలవియ్యండి.

వాసం— నాయనగారూ!

ఉ॥ తగ్గుచు నుండె సూర్యునిప్రతాపము, చల్లనిగాడ్పు లెల్లెడన్
వెగ్గల మయ్యెడిన్ గగనవీథి విహంగము లెల్ల బారులై
యగ్గిరికంధరాంతరము లందుఁ జొరంబడు చుండెఁ గాన యీా
పగ్గెలు జూడఁ దండ్రి! పనుపన్ దగు నీ మృగయార్థులన్ వడిన్.

అశ్వ—అట్లే చేసెద (వేఁటకాండ్రవంకఁ జూచి) ఒక రిద్దరుదక్క తక్కినవా రెల్లరు మీా యిచ్చవచ్చిన ట్లీ యీా చోటుల వేఁటాడి పిదప మీా మీా గృహంబులకుఁ బొండు. మేమును నీయెడఁ గొంత ప్రొద్దుపుచ్చి యావల వచ్చెదము.

వేఁట—చిత్తము. చిత్తము. (నిష్క్రమించుచు) వరే! అమ్మగారో అమ్మాయిగారో యెనక నిల్చి చెప్పల్చిందేగాని ఆయన

సొంతంగా మాత్రం తోఁచదురా ? కాని— పాపం చెప్పితే వింటాఁడు. అ దొక్కటి మేలు.

వేఁట—ఏమి మేలు! ఆడవాళ్ళమాట వినడం. మనకెందుకు- పోదమురా.

(వేఁటకాం డ్రందఱు నిష్క్రమింతురు)

వాసం—(ఉలికిపడును.)

అశ్వ—(వెన్ను తట్టుచు) అమ్మా ! ఈ చిన్ని యుఱు ముఱిమినందులకే భయపడితివా?

వాసం—అది యుఱుమా ! ఏదియో మృగ మఱచు చుండె నను కొంటిని.

అశ్వ—నీ కానాఁటి దన్న జ్ఞప్తికి వచ్చినది కాఁబోలు.

వాసం—అవును.

క॥ నే నాధ్వనిని వినినమా
త్రాన భయం బొందవెఁ జాలఁ ♦ దండ్రీ! విను నా
కానాఁటి దన్న మాటయె
మానసమునఁ దోఁచె నింక ♦ మఱవం జాలన్.

అశ్వ—వాసంతికా ! వేఁటకాండ్రీప్రాంతమునన యున్నారుకదా ! భయ మేటికి? మఱియు నీ ధ్వని యుఱుముగాని వేఁటుగాదు.

వాసం—అవును —అయినను

తే॥ గీ॥ క్రమ్ము చుండెఁ జీఁకట్లు నల్గడల మిగుల
నుఱుము లంత కంతకుఁ గడు ♦ నుఱుము చుండె
మెఱపులును గూడఁ గను మవె ♦ మెఱయు చుండె
నింటి కేఁగు టెవిధము తండ్రీ! వచింపు.

అశ్వ—(స్వగ.) నేఁ డెట్లు లయినను సుదర్శనసేనునింట విడియువలయు నను తలంపున బయలుదేరి వాని యింటఁ బ్రవేశించుటకుం గారణముఁ గానక పరితపించు నా కీ గాలివాన తా నొక నెప మయి మహోపకారం బొనరించు చున్నది. ఆహా!

తే॥ గీ॥ శుభము లొక్కొక్క వేళ నశుభము లగు, న
శుభములును మఱియొక వేళ శుభము లగును
గాన సర్వంబు దైవసంకల్ప మనుచు
నెన్నఁ దగు మానవుల్ దమ హృదయసీమ.

అనుచరుఁడు—అయ్యా! ఎటుపోవుదము?

వాసం—నాయనగారూ! మాట్లాడ రేమి! ఇంటికి దారి యెట్లు? త్వర త్వరగా నడువ రేమి?

అశ్వ—అమ్మా! మన మెంత త్వరగా నడిచినను దారిలోనె వానచే ముంచివేయఁ బడుదుము. కావున నా కొండమీఁద నేదియో యొక మిద్దెటిల్లు గన్పించు చున్నది. అక్కడ కొంతవఱకు నిలిచి యావలఁ బోవుదము. (అని నడుచును)

వాసం—ఈ లోఁగాఁ బ్రొద్దు గ్రుంకదుకదా?

అనుచ—క్రుంకిన నేమి భయము? ఇంటికిఁ బోలేమా!

(అందఱు వడిగా నడచుదురు)

వాసం—(దృష్టి నిగిడించి)

మ॥ జనకా! వర్షపుభీతిఁగాదె మన మా శైలంబు డాయన్ వడిన్
జనుచుండంగ నితం డెవండొ కద యా శైలంబునం దుండియే
మన మం దించుక భీతిలేక యిపు డీ మార్గంబున న్వచ్చుచుం
టను గంటే విపరీత మయ్యెడిని గట్టా యేడకుం బోయెడిన్.

అశ్వ—అతఁడా మిద్దెటింటివారిలో నొకఁడై యుండనోపు. ఎందులకో పోవుచున్నాఁడు!

కుముదుఁడు—(ప్రవేశించి) అయ్యా! మీ రెవ్వరు? ఎక్కడకుఁ బోవుచున్నారు.

అశ్వ—ఎవరైన నేమి-కాని- వర్షము వచ్చునేమో యని యీ మిద్దెటింటికై పోవుచున్నారము.

కుము—ఆ- రండు— రండు. ఎవరో పాపము వర్షముపాలఁ బడుదురని తలఁచి మిమ్ముఁ గొనిరమ్మని మాదొరగారు నన్నంపిరి. రండు—రండు.

అశ్వ—(స్వగ) వీఁడు సుదర్శనసేనునివంటలవాఁడగు కుముదుఁడు గాఁబోలు. ఆహా! సుదర్శనసేనుని బుద్ధిసౌజన్యమెంతని వర్ణింతు. (ప్రకా.) మేము నచటికే వచ్చుచున్నాము— పద.

(అందఱు నిష్క్రమింతురు.)

కుము—(వెనుకకు వచ్చి) ఈ తద్దినమెట్లయినను మాయింటి మీఁదుగానే పోవును. నాచేతులార నేఁ దెచ్చిపెట్టుకొననేల? వీరి కందఱకు నొక్కగొట్టి సరిపోవునేమో? ఎక్కడనుండి తెచ్చిపెట్టుదును? ఆయన కేమి- అప్పుడుదొరే- ఇప్పుడు దొరే-దొరికినా దొరకకపోయినా నాకేగద తంట అయినను బంధుప్రీతి, మిత్రప్రీతి, అతిథిప్రీతి, భోజనప్రీతి యివి యన్నియు డబ్బులేనప్పుడ! నా కెందులకు— అన్నిప్రీతులు నేఁటి కారంపుఁబొడి కూటితోఁ దెలియును లే. వర్షము వచ్చుచున్నట్లున్నది. పోవలె.

(నిష్క్రమించును.)

## చతుర్థరంగము:— సుదర్శనసేనునికోటలో నొకచావడి.

ప్రవేశము:— సుదర్శనసేనుఁడు.

సుద— కం॥ దూరమునఁ జూచుకతమున
నీ రేవరో పథికు లనుచుఁ ♦ బిలిపించితి ని
న్నేరిని గనుఁగొనఁగా నే
నారెను వధియింపఁ దలఁచు ♦ శాత్రవులనుచున్.

(వాసంతిక - అశ్వనమంత్రి - కుముదుఁడు ప్రవేశింతురు.)

కుము— దయామయుల రగు తమ యాహ్వానము లేకున్నచో వీరు నిశ్చయముగా నేఁడు తడవవలసినవారే సుఁడీ.

సుద— అవునుగాని యిఁక నీవు పోయి నీ వంటసేయ ప్రయత్నమున నుండుము.

కుము— చిత్తము. (నిష్క్రమించును.)

సుద— ఈ వర్షాగమనసమయంబున నిచ్చట తారాడుచున్న మీ నామధేయ మెద్ది?

అశ్వ— మా పేరా ... (అనుమానించుచు) నన్నెఱుఁగరా? నాపే రశ్వనమంత్రి యందురు. ఈబిడ్డ నాబిడ్డ. పేరు వాసంతిక.

సుద— అవును. ఇప్పుడు జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆ యుచితాసనముల నలంకరింపుఁడు.

అశ్వ— అమ్మా! వాసంతికా! అటఁ గూర్చుండుము. (తానును గూర్చుండును.)

సుద— (స్వగ.)

చ॥ ఎవని వధింప నే నసిశ ♦ మీ వనసీమల వేఁచియుండి శా
త్రవునిగ నెంచుచుంటినో యతం డదె ముద్దులపట్టితోడ నా

భవనము నందు నిర్భయుని ♦ భంగి మెలఁగుచు నున్న వాఁడు నేఁ
డపుర! మదీయఖడ్గమున ♦ నాతని నేల వధింప రా దొకో.

వాసం— నాయనగారూ!

కం॥ జలదమునుండి మెఱుగు దీ
వెలు మెఱయుచు నుండె నదిగొ ♦ వీక్షించితె యా
వల వర్షోదక మొకపడి
వలె నురువేగంబుతోడఁ ♦ బాఱుచు నుండెన్.

అశ్వ— అవును. ఆకాశము చిల్లులు పడునట్లు ఘోరమగు వర్షము వర్షించు చున్నది.

సుద— (స్వగ.) వీనికిని నాకును గల పూర్వ వైషమ్యమును బట్టి మొన్ననే వధింపఁ జూచితినిగాని తటస్థింప దయ్యె. అయి నను దాని నిపు డేల యొనర్ప రాదు?

తే॥ గీ॥ ఎవని వధియింప మది నిశ్చ ♦ యించినానొ
యట్టివానికి మనసార ♦ నతిథిపూజ
సలుపఁ దొడఁగ నే నే మైన ♦ జపలమతిని!
సమయు మొదవెను నాదు కా♦ర్యమున కిపుడు.

కాని యతిథిగాఁ దోడ్కొనివచ్చి తుద కట్లొనర్చు టుచితము కా దని తోఁచు చున్నది. అయినను జేఁజిక్కిన తరుణమును విడిచి పెట్ట రాదు.

అశ్వ—సుదర్శనసేనుఁడుగారూ! మేము బైలుదేఱునప్పు డీవర్షసూచన లేకపోవుటచే విహారార్థ మేతెంచితిమి; కాని మీ యాదరణము లేకుండినచో నేఁడు మాపని యేమయియుండునో కదా!

సుద—(స్వగ.)

తే॥ గీ॥ ఎన్ని యుపకారము లొనర్చి ♦ యున్నఁ గాని

యితఁడు మా కెగ్గు సేయ లేఁ ♦ డెన్నఁటికి నఁ
టంచుఁ దలఁచి నేఁ డిట్లరు ♦ దెంచె నీతఁ
డీ సుదర్శనసేను నే ♦ మెఱుఁగఁ గలఁడు.

(కన్ను లెఱ్ఱఁ జేయుచుఁ జూచును.)

అశ్వ—(స్వగ.) మొన్న వనసీమను మమ్ముఁ గాపాడిన తెఱఁగుఁ జూచి యేమో యనుకొంటిఁ గాని యితఁడు తిరిగి పూర్వవైషమ్యమునే సూచించు చున్నాఁడు.

వాసం—నాయనగారూ! ఇటులఁ జూడుఁడు—

తే॥ గీ॥ అంత కంతకుఁ జీఁకటు ♦ లలము చుండె
వర్షధారకు తెఱపి గ ♦ న్పడఁదు సుంత
నింక నింటికి మనము నేఁ ♦ డెట్లు చేరఁ
గలము? కంటే యుఱుము లధి ♦ కంబు లయ్యె.

(తెరలోఁ బిడుగుపడినధ్వని—వాసంతిక మూర్ఛిల్లి పడును.)

అశ్వ—(భీతచిత్తుఁడై వాసంతికను బట్టుకొని) అయ్యో! ఈ మ్రోఁత యేమై యుండును? అమ్మా! వాసంతికా! లెమ్ము— ఏ మది యిట్లు పడిపోయితివి?

సుద—(ఆతురతతోఁ) అయ్యో! మఱేమియు లేదు. భయపడకుఁడు. సమీపమున నెచ్చటనో యొకపిడుగు పడుటచే నీ మ్రోఁత గలిగి నట్లు తోఁచు చున్నది. పాప మీయబల యీ మాత్రమునకే భీతాక్రాంతయై మూర్ఛిల్లినది. అయినను జల్లనినీటిచే ముఖమును దుడిచిన యెడల సేద దీరఁ గలదు. నీటిని దెచ్చెద నుండుఁడు. (కొంచె మీవలకు వచ్చి స్వగతమున)

ఉ॥ చీమ చిటుక్కు మన్న సరసీరుహనేత్రలు కొంపవోయి న
ట్లేమొ భయంబు జెంది స్మృతి యింత యెఱుంగని రీతి నుందు రీ

కోమలి యట్లు భీతి మది • గొంటివొ కాక కరంబు వెల్ల నా
మోమును దాల్చి నీ పిడుగు • మ్రోఁతకు నంతటి భీరువౌ కదా!

(చిరునవ్వు నవ్వుచు) ఇది స్త్రీజన స్వాభావికంబు గాఁబోలు; కాదేని నీమాత్రమునకే భయంపడుదురా! (నిష్క్రమించి యుదకకలశముతోను బన్నీటిబుడ్డితోను దిరిగి ప్రవేశించి) అశ్వనమంత్రిగారూ! ఈనీటిచే ముఖమును గడుగుఁడు. దానఁ గొంత సేద దీఱఁ గలదు.

అశ్వ—(అటులఁ జేయుచు) అమ్మా! కనులఁ దెఱచి చూడుము. (అని లేవఁదీయును.)

సుద—(పన్నీటిని పైనఁ జల్లుచు) కోమలాంగీ! భయ మేటికి? లేఁచి కనుల విప్పి చూడుము.

వాస—(కనుల నులుముకొనుచు లేచి) మీ రిరువురును నా సమీపమున నిట్లు కూర్చుండి యుంటి రేల? (అటు నిటుఁ జూచుచు) ఇది మనయిల్లు కాన ట్లున్నది.

అశ్వ—వాసంతికా! ఇది మనయి ల్లె ట్లగును? కనులఁ దెఱచి బాగుగాఁ జూడుము.

సుద—(స్వగ.) ఈ యిల్లు నీదియె. నేను నీ వాఁడనే.

వాస—(కలయఁ జూచుచు) అవును. ఇది మనయిల్లు కాదు. ఇప్పుడు తెలిసినది.

ఉ॥ ఏదియొ యొక్క మ్రోఁత దిశ • లెల్లను బిక్కటిలంగ మ్రోయఁగా
నామనంబు దత్తరము • నన్ వివశత్వము నొందె దాన నా
కేదియుఁ దోఁపమి న్జనక! • యీగతి మూర్ఛిలి వ్రాలి యుంటి నీ
మదినిఁ జెప్పు మేకరణి • మేల్కొనఁ గల్గితిఁ గ్రమ్మఱ న్వశీ.

మఱియు నా మ్రోఁతకు హేతు వేమి?

అశ్వ—బిడ్డా! సమీపమునందే యొకపిడుగు పడినందువలన నీ మ్రోఁత

జనించినది దానిచే నీవు మూర్ఛిల్లి పడిపోయితివి. అంత నీ దయామయుని యుపచారవిశేషమునఁ దిరిగి తేవఁ గలిగితివి.

చ॥ మును మహిషంబు పాల్పడక ♦ ప్రోచిన యట్టి యుదారమూర్తియే
నిను కరుణాతిరేకమున ♦ నేఁడును బ్రీతిని నేదదీర్చి కా
చెను విను మీతఁ డిట్టి గుణ ♦ శీలుఁడొ వర్షపుబారిఁ గొందు గీ
రని పిలువంగఁ బంచి యమి ♦ తాదరణం బొనరించెఁ గాంచితే.

ఈ నిర్జనప్రదేశంబునం దీవర్షసమయంబున పిసి యాదరణంబులే కున్న మనగతి యే మగునోకదా!

వాసం— నిశ్చయమే; కాని——

చ॥ సరసులు పుణ్యమూర్తు లని♦శంబును భూరితరానురాగు లై
పరులకు మేలుగూర్చుటయె ♦ బంధురసద్వ్రత మంచు నెంచి యా
సరణి నొనర్తు రట్టులనె ♦ చారుయశోధనమూర్తి యైన యీ
నిరుపమసద్గుణాకరుని ♦ నిస్తులకారుణికత్వ మిట్టులన్
బరిగణనీయ మయ్యె మన ♦ పాలిట; నిందు విచిత్ర మున్న దే!

కావున నిది వారి స్వాభావిక మగు కారుణికత్వ మగుటచే నెల్లరకు నిట్లే యొనర్తురు.

సుద— (స్వగ) ఆయన ముఖస్తుతుల కేమి కాని పాప మీ తలో దరి నేదదేరి తిరిగి తన మృదుమధురభాషణంబులచే వీనుల విం దొనర్చు చున్నది.

కుము— (ప్రవేశించి) అయ్యా! (ఆతురతతో) నావలన లోప మేమి యును లేదు. నే నేమి చేయుదును? ఈ పాడుపిడుగు పడి నేఁ జేసినవంట సంతయుఁ బాడుచేసినది. గొప్పవారు నేఁడు మనయింటి కతిథు లై వచ్చి రని యెన్నియో రుచిగల పదార్థములఁ గ్రొత్తక్రొత్తరీతుల నాయత్త మొనర్చితిని. ఎన్ని చేసిన నేమి ప్రయోజనము? ఈ పిడుగుచే నవియన్నియుఁ బా డయినవి. నేఁడు వండినకూరలును బిండివంటలును

మిక్కిలి రుచికరము లైనవిసుండీ; కాని తినుట కొకటి యైనను ప్రాప్తించనందులకు విచారపడు చున్నాను.

అశ్వ—ఓయీ! విచార మెందులకు? మీరు మాకుఁ బ్రోత్తవారు కారు. కావునఁ బ్రేమతోఁ బచ్చడి పెట్టినను మా కది యమృతతుల్యముగనే యుండును.

కుము—(స్వగ.) నేఁడు చేసినది పచ్చడిగాక యింత కెక్కు డేమి కలదు! (ప్రకా.) నా నైపుణ్య మెల్ల వెశదపఱుప నెన్నియో మసాలాలతో నెంతయో రుచికరములగు పదార్థముల సిద్ధముచేసితిని గాని వానయేకాక పిడుగుగూడఁ బడి సర్వమును పాడుచేసినది.

సుద—కుముదా! నీవు వంటలో మంచి నేర్పరివని యెల్లరకుఁ దెలియును గాని యిఁకఁ బొమ్ము. మిగిలినదానితోడనే నేఁటికిఁ గడపవచ్చును.

కుము—అవును. ఏమి చేయుదును? నావలనలోపము లేకుండఁగ నన్నియుఁ జేసితిని గాని తుద కొక్కటియును లేదు. (నిష్క్ర.)

అశ్వ—సుదర్శనసేనుఁడుగారూ!

క॥ మీ యోగ్యగుణమునకు ముద
మాయె మదీయాంతరంగ మం దిటువలెనే
మీ యయ్య యుచితరీతిని
మాయెడ వర్తింపఁ డయ్యె మాన్యత కెక్కన్.

ఏల యనఁ బ్రకంపనచక్రవర్తికిని బురందర చక్రవర్తికిని గలిగిన కల్లోల మందు మీ యయ్య మిన్నకుండక తానేమో జోక్యము గలిగించుకొని తుదకు మిగుల నష్ట మనుభవించె సుమా?

సుద—(కోపముతో) ఏమి? ఇలుసేరి యింటివాసముల లెక్కిడె నన్నట్లు మాయింటి యతిథి వై తుదకు మా లోపములనే యెన్నుచుంటివిగా!

అశ్వ—త్వరపడకుము. మిత్రమా! నీ వే మెఱుఁగుదువు. చిన్నవాఁడవు. అయిన నెప్పటిమాటయో యేల? నీవు మొనమొన్న మొన రించిన రాజభటునిహత్యను గుఱించి యే మైనదో యెఱుఁ గుదువా?

సుద—(ఆలోచన మభినయించి పశ్చాత్తాపముతో) అవును. ఆవిషయ మిపు డేమైనది?

అశ్వ—ఏ మైనదా—

క॥ ఒకహత్య నేరమును మీ
రొకనాఁ డొనరించితి రని ♦ యొక మానిసి యా
సకలము మాకడ మొఱ లిడ
నకటా యని యుఱుక కుండ ♦ నడఁచితి దానిన్.

ఆ సంబంధము లగు కాగితములుగూడ నాయొద్దనే యిపు డున్నట్లు జ్ఞాపకము. (చొక్కాజేబులను జూచుకొనుచు) ఇవిగో—దగ్గఱనే యున్నవి. (జేబునుండి కొన్ని కాగితములఁ దీసి యిచ్చును)

సుద—(చదువుకొనుచు స్వగతమున) నిశ్చయముగ దీనినిబట్టి నే నీతనిచే వధ్యుఁడఁ గాఁ దగియుండినప్పటికి నీతఁ డేలకో నాపై నిట్లు మిగుల వాత్సల్యమును జూపుచున్నాఁడు. ఇట్టివా నిని నేనుమాత్రము ప్రేమింపవలదా? (ప్రకా.) ఆర్యా! అతఁడు నన్ను కాఱులు గూయుటచే న ట్లొనరించితి. అయినను మీ కృపాతిరేకమున నిప్పుడు నిర్భయముగనే యున్నాఁడను.

అశ్వ—మీరు నిర్భయముగనే యుండ వచ్చును. నే నా విషయం బును చక్రవర్తిగారి కెఱుకపడకుండు న ట్లొనర్చితి.

సుద—ఆర్యా! మీ మహోపకారమునకు నేను కృతజ్ఞుఁడను.

కుసు—(ప్రవేశించి) దేవా! భోజనసమయము మించుచున్నది. త్వరగా దయ సేయుఁడు.

వాసం—(నిదురఁ గూరుచుండును.)

సుద—ఆర్యా! ప్రసంగవశమునఁ జాల ప్రొద్దుపోయినది. మఱియు—

మ॥ ముకుళీభూతము లయ్యె నేత్రజలజం♦బుల్ పూర్ణచంద్రాననం
బౌక యోరల్లన వాల్చి నిద్ర గొనఁగా ♦ నున్నట్లు మీ ముద్దుబా
లిక గన్పట్టెడుఁ గాన సత్వరమునన్ ♦ లేవం దగున్ మీరు; భు
క్తికి వేళాయెను రండు పోవుదము సం♦దీప్యద్యశోభూషితా!

(నిష్క్రమించును.)

అశ్వ—వాసంతికా! లెమ్ము. భోజనమున కేఁగుదము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

---

పంచమరంగము. సుదర్శనసేనుని సౌధాంతికోపవనము.

ప్రవే:—చిన్ని కట్టెలమోపుతో కుముదుఁడు.

కుము—(కట్టెలమోపును గ్రిందఁ బడవైచి)

తే॥ గీ॥ కష్టసుఖములఁ దలపోసి ♦ కరము సౌఖ్య
మనుభవింపఁ దలంచుచు ♦ మనుజవరుఁడు
ప్రస్తుతావస్థకే తగుల్ ♦ నడక మీఁదె
ఱెంగి జాగరూకుం డయి ♦ మెలఁగు టొప్పు.

అశ్వ—(ప్రవేశించి) ఓయీ! నీకొఱకే నేను వెదకు చుంటిని. ఇక్క
డకు వచ్చితివా! ఏమి యిది! నేఁడు చాలసంతో—

కుము—అయ్యా! వంటలవాఁడ నగు నాతో నేమిపని యుండి
వెదకు చుంటిరి?

అశ్వ—ముఖ్యముగా నేఁటిపని నీతోడనె కానున్నది.

కుము—(స్వగ.) వారముదినములనుండి తెగఁ దినుటచేఁ గడుపుబ్బ
రము జేసి యుండవచ్చును. అందుచే నిప్పుడు నన్నేదేని
గషాయము బెట్టుమని యడుగును గాఁబోలు. చాకిరి చేయ
లేక నేను చచ్చిపోవు చున్నాను. మఱియు వాన. పుల్లలు
పిడకలు తడిసి. పోయినవి. నేను తెలివిగలవాఁడను గనుక

ముందుసంగతి నెఱింగి యీ మోపును మాత్ర మిట్టి యిక్కట్టులకుఁ బనికివచ్చు నని దాఁచు కొని యుంటిని. (ప్రకా.) అయ్యా! నాతోఁ గావలసినపని యేమో చెప్పుఁడు.

అశ్వ—ఉ॥ ఎన్ని దినంబు లాయె నిట ♦ కే మరుదెంచి భటాళితోడ మా
కెన్ని దినంబు లున్నఁ గొద ♦ వేమియు నీయెడఁ గల్గదైన మా
చిన్నది బెంగఁ గొన్నయది ♦ చిక్కులు లే వికఁ వర్ష మాఁగిన
ట్లున్నది గాన నేఁ డరుగ ♦ నుంటి మసత్యము లేదొకింతయున్.

కావున వంటను త్వరితముగ సిద్ధము చేయుటయే నీవలన మాకుఁ గావలసినపని.

కుము—అటులనే చేసెదను. ఎండిన కట్టెలును సిద్ధముగనే యున్నవి.

అశ్వ—కానిమ్ము (స్వగ.) ఇతఁడు నా పరోక్షమందుఁ బలికిన పలుకులు నన్నుగుఱించి యేయని యనుకొంటిని. కాని యట్లుకాదు. తాను రాఁబోవు వర్షకాలమునకై జాగ్రత్త పడిన యీ కట్టెలను గుఱించి పలికియుండును. (నిష్క్రి.)

కుము—ఈదినముతో నాపీడ వదలిపోవున ట్లున్నది. అంత శత్రుత్వమున కింత మిత్రత్వము. (ఇటు నటుఁ జూచి) వీరు నిటులనే వచ్చుచున్నారు!

సుద—(ప్రవేశించి) కుముదా! పాకప్రయత్న మేమైనను జేయుచుంటివా?

కుము—ఏమి పెట్టి చేయుదును? కాళ్లా? చేతులా? పుల్లలన్నియుఁ దడిసిపోయినవి.

సుద—నేఁటి కెట్టులో శ్రమ పడు. రేపటినుండి నీ కేమియుఁ బని యుండదులే.

కుము—రే పెవరు చేయుదురు? వాసంతిక చేయునా?

సుద—అదికాదు. మే మెల్లరము రేపు వారియింటి కేఁగుదుము.

కుము—ఎవరియింటికి? వాసంతికయింటికా?

సుద—అవును. అశ్వనమంత్రిగారియింటికి.

కుము—ఎందులకు?

సుద—మన మీా వారముదినములును జేసినగౌరవమునకు సంతసించి తిరిగి మనల నాహ్వానము సేయు చున్నారు.

కుము— అటులనా! అయిన వంట వెంటనే సిద్ధము చేసెద. ముందు తేనీరు సిద్ధ మైనది. పుచ్చుకొనుఁడు.

సుద—త్వరగాఁ దీసికొనిరమ్ము.

కుము—చిత్తము. (నిష్క్రమించును.)

సుద—ఇతనిసంభాషణము నం దించుక విపరీతము - కాదు - కాదు- నావర్తనం బెంతయు నాకే విపరీతముగ నున్నది ఏలన-

సీ॥ సకలసంపద్రాజి ♦ సంస్తూయమాన మా
    ధనసంచయము చూఱఁ ♦ గొనియె నెవఁడు?
ప్రాజ్యదేశసా♦మ్రాజ్యంబుతోడ రా
    జ్యంబుఁ బాపి గుహాళి ♦ కనిపె నెవఁడు?
పేరువి న్నంతన ♦ భీతిచే నఱచేతఁ
    బ్రాణంబు లిడికొని ♦ బ్రతుకు నెవఁడు?
మొనమొన్న నాచేత ♦ వనసీమఁ జావును
    దప్పించుకొని వెండి ♦ తనరె నెవఁడు?
తే॥ గీ॥ బళిర! యట్టివానిని నేఁడు ♦ కంచభక్ష్య
    పాయసాన్నాళితోడ స♦త్కారిగాఁగ
    గారవింపుచు నున్నాఁడ ♦ గాలమహిమ
    యెట్టివారిచే నేమి చే♦యింప లేదు?

వాసం—(ప్రవేశించి) మానాయనగారిటుల వచ్చిరా?

సుద—ఎందులకు?

వాసం—నేఁడే ప్రయాణ మనిరి. ఏ మయినదో.

సుద—అంత త్వర యేల? మీ యింటికడ నుండిన ట్లిందు లేదా! అవును. ఏల యుండును? నీ హృదయానందకర మగు వస్తు విం దేమి కలదు!

వాసం—అ ట్లనెద రేల? మీ దయాపూర్వక మగు నాతిథ్యమున కంటె నా కానంద మిం కేది కూర్పఁ గలదు?

సుద—ఈ యానందము శాశ్వతానందమును గూర్పఁ జాలదు. అట్టి యానందము వేఱుకారణమునఁ గలుగ వలయును.

వాసం—మీ మాటలు నా కర్థ మగు చుండుట లేదు.

సుద—అవును. నీకర్థ మగు దినము లింకను రాలేదు.

అశ్వ—(ప్రవేశించును.)

వాసం—(దిగ్గున లేఁచి తండ్రిని సమీపించి) నాయనగారూ! ఎప్పుడు మన ప్రయాణము?

అశ్వ—ఇంక నెప్పు డని యడుగు చుంటివా! సర్వమును బ్రయాణ సన్నాహ మగు చుండుటఁ జూడలేదా?

వాసం—అయిన నేనును బ్రయాణ మయ్యెద. (నిష్క్రా.)

అశ్వ—మీ రింకను బ్రయాణమునకు సిద్ధ మగు చుండినట్లు లేదు. మనము త్వరగాఁ జేరవలయును గదా?

సుద—అవును. నేను నా ప్రయత్నమున నే యుంటిని.

అశ్వ—ఆలస్యము చేసినచో నేఁడును బ్రయాణము నాపుకొన వలసి వచ్చును.

సుద—అవునుగాని—

క॥ ఇన్ని దినంబులు పగచే
నున్న మనము మగుడ నెయ్య ♦ మొదవినగతి రాఁ

జన్నే! మీ గృహమునకో
సన్నుతగుణ! నగరిజనులు • చర్చింపంగన్.

అశ్వ—ఇదియా మీ సంశయము!

కం॥ కొన్నాళ్లు వైర ముండినఁ
గొన్నాళ్లకు చెలిమి యుంటఁ • గూడదె చెపుమా
కొన్నాళ్లు చీఁకటియు మఱి
కొన్నాళ్లును వెన్న లగుటఁ • గోవిద! కనమా!

దైవసృష్టియందే యిట్లుండ మానవునివర్తనంబునందు వ్యత్యస్తమున్న లోప మేమి? మఱియు—

ఉ॥ బంధుజనంబునం దహిత • భావ మొకప్డు తటస్థ మైన సం
బంధము నాఁటఁ దీఱ ననఁ • బాడియె! కొన్నిదినాల కైన నా
బంధము వెండిఁ గూర్పఁ దగు • బ్రాజ్ఞమతం బిది కాని మౌర్ఖ్యజా
త్యంధతఁ గన్నుఁ గానని జ • నాళికి వే లోకభంగిఁ దోఁచెడిన్.

సుద—నిశ్చయము. అట్లని యెంచియే ప్రియాణోన్ముఖుండ నైతిని.

అశ్వ—అవశ్యము కాలసినదే- సత్వరము పోపుదము రండు.

(ఇరువురు నిష్క్రమింతురు)

# తృతీయాంకము.

ప్రథమరంగము:— అశ్వనమిత్రు సౌధము.

ప్రవేశము:— సుదర్శన సేవకుఁడు.

సుద — తొల్లి యీసౌధమునందు వసించు నే నిప్పు డొకమూలఁ గల జీర్ణభవనంబునందు వసింప నయ్యెఁగదా! ఆహా! కాల మహిమ నే మందు—

సీ॥ అష్టభోగంబుల ♦ ననిశంబు విహరింప
నను వగు శృంగార♦హర్మ్యవితతి
కనుసన్నల మెలంగి ♦ కడు నూడిగంబులఁ
జేసెడి దాసదా♦సీజనములు
పలుమాఱుఁ గుశలసం♦ప్రశ్నంబు లరయుచు
మిగులఁ బ్రేమించెడి ♦ మిత్రవరులు
చిత్రవర్ణములచేఁ ♦ జెన్నుమీరుచు నున్న
యసమానచీనిచీ♦నాంబరములు

ఆ॥వె॥ ఆదిగాఁ గల సక♦లైశ్వర్యములఁ బాసి
జీర్ణసౌధ మందు ♦ సేవకుం డొ
కండు తోడు గాఁగఁ ♦ గడుప నయ్యె దినంబు
లహహ కాలమహిమ ♦ మబ్బురంబు.

నిశ్చయము; కానిచో—

సీ॥ ఎవని నాగర్భశా♦త్రవునిగ మది నిశ్చ
యించి క్రోధము వహి♦యించి యుంటి
నెవని వధింపఁగా ♦ నెంచి నిర్జనభూమి
ఖడ్గహస్తుండ నై ♦ కాచి యుంటి

నెవని కారణమున ♦ నీసీమఁ బాసి వి
దేశ మేఁగఁగఁ బ్రయ♦త్నించియుంటి
నెవని దుశ్చేష్టల ♦ నెన్నుచు హితులు నా
కోపానలము రవు♦ల్కొన నొనర్చి
ఆ॥ వె॥ రట్టివాని కిప్పు ♦ డాత్మబంధువుఁడ నై
తొల్లి గలుగు రీతు ♦ లెల్ల మఱచి
యేఁగుదెంచినాఁడ ♦ నీయెడ కిదియును
గాలచక్రమహిమ ♦ గాదె యరయ.

కాకున్నచోఁ గొలఁదికాలములోనే యిట్టి మార్పులు గలుగఁ జాలవు. కారణ మేది యైనను సర్వము విధిప్రేరిత మనియే తలంప వలయును. (భవనమును గలయఁ జూచుచు)

సీ॥ ఈ తిన్నెమీఁదనే ♦ మా తండ్రి వ్యవహార
సంబంధ మగుచర్చ ♦ సలుపుచుండె
నీ చంద్రశాలయం♦దే చిన్ననాఁడు నా
మిత్రులతో వేడ్క ♦ మెలఁగి యుంటి
నీ వంకనే బంధు♦బృందంబు నిరతంబు
విశ్రాంతిఁ గైకొన ♦ విడిసి యుండె
నీ సీమనే ద్రవ్య♦రాసుల నెన్నను
ద్యోగస్థు లనిశంబు ♦ మూఁగి యుండ్రి
తే॥ గీ॥ రిట్టి విషయంబు లెన్నియో ♦ యిపుడు జరుగు
చుండి నట్లు దోఁచి విచార ♦ మొదవు చుండెఁ
బూర్వ మొక కొన్నినాళ్లు కాఁ♦పురము జేసి
నసుమ నీకికి విడనాడఁ ♦ బడిన దగుట.

ప్రాప్తి యుండుటచేఁ దిగి యీ నా సౌధమును జూడఁ గంటిని. లేకున్న నిం దొక్కయడు గైనఁ బెట్టఁ గలుగుదునా!

(దృష్టిని సారించి) అదిగో! నామనోహారిణియైన చంచలాక్షి యేతెంచుచున్నది.

వాసం— (ప్రవేశించి) ఆర్యా! మీరు వచ్చినదిమొదలిచటనే కూర్చుండి యుంటిరి. పాప మీ కొలఁదిదూరపు ప్రయాణమొనరించినందులకే మార్గాయాసమును జెందినట్లున్నారు.

సుద— సుందరీ! మే మీమాత్రపు ప్రయాణమొనర్చినందులకే మార్గాయాసమును జెందునంతటి సుకుమారులము గాము. సుకుమారులమే యైనచో—

ఉ॥ నాఁడు వనాంతరంబున ఘనం బగు క్రూరమృగాళి కాత్మలో
నోడక చేతనాయుధము నూని మహార్భటి వచ్చునట్టి యా
జాడను గాంచి యొక్కమహిషం బని యెంచి వధింప నెట్టులో
చేడియ! నేర్చువాఁడ? నిది చెప్పఁగదే సుకుమారుచేష్టయే?

వాసం— (చిరునవ్వు నవ్వుచు) నాఁటి మీ మహదుపకారమెన్నటికిని మఱువఁ దగినది కాదు. దానిని మఱువఁ జాల.

సుద— మఱువఁ జాలక చేయఁ గలుగున దేమి?

వాసం— ఏమియు లేదు— కాని—

సుద— లేదనకుము. ఎప్పటికైనను గలుగక పోదు; కాని నీ వన్నట్లు నాకుఁ గొంచెము బడలికయే చేసినది? కావున నేఁటి సాయంకాల మీ పట్టణబాహ్యప్రదేశమునకు విలాసార్థమేఁగ నిశ్చయించుకొంటి. నీవుగూడ వచ్చెదవా?

వాసం— చిత్తము. వచ్చెదను. ఏల యన నాప్రాంత మందుఁ గల యొక కుటీరమం దొక ముదుసలిది గలదు. నే నప్పుడప్పుడామెను జూచివచ్చుచుందు. ఇప్పటికి జాలకాల మగుటచే నే నామెచెంత కేఁగ నిశ్చయించుకొంటి.

సుద— ఎవ రాముదుసలిది? చతురిక కాదా?

వాసం— అవును. మీ రెట్లెఱుఁగుదురు?

సుద— నేను నప్పుడప్పుడచ్చటి కేఁగుచుందుఁ గావున నేను నా

మొడకే పోవ నిశ్చయించుకొంటిని. నీవును దప్పక రావలయును సుమా.

వాసం— సరిగాని— నే వచ్చిన దెందులకో తెలియునా?

సుద— తెలియ కేమి! వింతగాఁ గైసేసికొనిన నీ యీ నూతన వస్త్రాలంకారమును జూపుటకుఁ గాదా?

వాసం— (నవ్వుచు) అదికాదు— భోజనసమయ మగుటచే మా తండ్రిగారిపనుపున మిమ్ముఁ బిలువ వచ్చితిని.

సుద— అయిన నింత యాలస్యము చేసితి వేల? (పోఁ బోవును.)

వాసం— ఇంచుక వ్యవధి యుండుటచేతను బ్రసంగవశము చేతను ని ట్లయినది; కాని యిఁక ద్వరపడుఁడు.

సుద— ఇదిగో— ఏఁగుచున్నాను. (నిష్క్రమించును)

వాసం— వీనిసంభాషణము మిక్కిలి మృదుమధురముగ నున్నది. కాని- చతురికకుటీరము చెంతకు వచ్చునట్లొప్పుకొంటినే—అదెట్లు! (ఆలోచించి)అయిన నేమి? నే నప్పు డప్పుడు చతురిక చెంత కేఁగు నటుల నే నేఁడు నేఁగెద. (నిష్క్ర.)

---

ద్వితీయాంకము:— చతురికకుటీరము.

ప్రవేశము:— చతురిక — వాసంతిక.

చతు— వచ్చు చుండెనా?

వాసం— ఇంకను లేదు.

చతు— అతఁడు మీయింటఁ బ్రవేశించి యెన్ని దినము లైనది?

వాసం— ఎన్నియో యెక్కడ— మొనమొన్న నే ప్రవేశించితిమి.

చతు— ప్రవేశించితి మను చున్నావు. నీ వెచ్చటి కేఁగితివి?

వాసం— కం॥ చతురిక! పలికెద వెప్పుడుఁ
జతురోక్తులనే మదీయజనకుఁడు నేనున్
గతిపయదినముల నుండియు
నతనిగృహంబునను యుంటి మని యెఱుఁగ వ్రేకో.

చతు—(ఆశ్చర్యముతో) ఏమిది! నీవును నీతండ్రియుఁ గొన్నిదిన
ములనుండియు నతనియింటనే యుంటిరా?

వాసం—అవును. ఎందుల కింత యాశ్చర్య మొందెదవు?

చతు—ఎందులకా!—నీవు చెప్పినరీతినే—

సీ॥ తనజవ మెల్ల నీ ♦ జనకునిచే హరిం
పఁగఁబడె నంచు లోఁ ♦ బగ వహించి
యెపు డొంటరిగఁ జిక్కు ♦ నెపుడు వధింపఁ గ
ల్గు నంచు నిరతంబు ♦ మదిఁ దలంచి
యుండంగ నింతలో ♦ నొకనాఁడు మీతండ్రి
నిను వెంట నిడుకొని ♦ వనవిహార
మున కేఁగ నంతకు ♦ మున్నె తా నటఁ జేరి
సమయ మీక్షింపుచు ♦ సరస నీవు
ఆ॥ వె॥ నుంటఁ గాంచి పాప ♦ మొంటరి వై పోవు
దనుచు నెయ్య మూని ♦ తనదు పూన్కి
మాని మఱియు నొక్క ♦ మహిమంబు మిము సమీ
పించు చుంటఁ గని వ♦ధించె దాని.

ఇ ట్లొనర్చు కారణము స్త్రీజనరక్షణార్థం బని యెంచితిని గాని యిప్పటి మీ రాకపోకలవలన వేఱువిధంబుగఁ దలంపవలసివచ్చె. ఆహా! ఎంతటి గాంభీర్యశౌర్యగుణాలంకృతు లైనను మోహకారణమునఁ బ్రజ్ఞావిహీను లగుదురు కాఁబోలు- రానిమ్ము- (తల యూఁచును.)

వాసం—(స్వగ.) ఈ ముదుసలిది నన్ను జూచి యైన మోమోటఁ బూనక యెంత కఠినముగ మాట్లాడు చున్నది! వానిచెంతఁ గూడ నిటులనే మాట్లాడుఁ గాఁబోలు. అట్లైన నేను వినఁ జాల.

సుద—(ప్రవేశించి) నీవు వచ్చి యెంతసే పయినది?

వాసం—(ఉల్లాసహీనముగ) ఇప్పుడే (కొంచె మావల కేఁగును)

చతు—ఎవరు బాబూ? సుదర్శనసేనుఁడవా?

సుద—అవును చతురికా! క్షేమముగ నుంటివా?

చతు—ఏమో లే; నాక్షేమమున కేమిగాని కాలమహిమ మి ట్లున్నది కదా!

సుద—ఏమీ! యె ట్లున్నది?

చతు—నీకుఁ దెలియుట లేదా!

తే॥ గీ॥ మిత్రవర్యుల నొక్క ని♦మేషమున న
శాత్రవులఁ జేసికొనవచ్చు ♦ శత్రుతతిని
మిత్రులుగఁ జేసికొనఁగ నే ♦ తంత్రమునను
సాధ్య పడ దందు రది నీకు ♦ సాధ్య మయ్యె.

ఇది కాలమహిమంబు గాదా!

సుద—(విన్నఁబాటున) కాదు. ఇది దైవసంకల్పము— కాకున్నచో మాకుఁ గలశత్రుత్వ మెక్కడ? ప్రస్తుతపు మా యీబంధుత్వ మెక్కడ?

చతు—బాంధుత్వ మేమి? వాసంతికను బెండ్లాడెదవా యేమి?

వాసం—ఈ ప్రసంగము ముదురు చున్నది. ఇఁక నిట నుండ రాదు. ఈయన వచ్చువఱకు నా చెరువుగట్టుపైఁ గూర్చుండి యుండెద. (నిష్క్రమించి)

సుద—పెండ్లికాదు. భోజనప్రతిభోజనములచే నిట్టి రాకపోకలు బంధువాత్సల్యమునఁ గాదా జరుగుట?

చతు—నాయనా! "తాతకు దగ్గులు నేర్పె" నన్నట్లు నాదగ్గఱ దాఁపఁ బోకుము. సరే—మిక్కిలి చక్కనిపని. నీ తండ్రిని వధించి నీ జమీ నపహరించినవానితో సంబంధ ముందక పోయిన నిం కెవ్వరితో నందఁ గలవు? ఆగర్భశాత్రవుఁ డగు నాతని వంచింప లేక తుదకు వానికి దాసానదాసుండ వగు చున్నావా! ఆహా! నీ శౌర్యము స్తవనీయము. వే యేల— యీ ఘనకార్యముచే నీ పితరులు తప్పక తరింతురు. ఇట్టి కార్యములే శాశ్వతకీర్తిదాయకములు.

ఆ॥ వె॥ తండ్రి గొంతుఁ గోసి ♦ తనదు సర్వస్వంబు
నపహరించె నెవ్వఁ ♦ డట్టివాని
శత్రుభావ మడిగి ♦ జామాత వగుచుంటి
వీవ శౌర్యధనుఁడ ♦ వీ జగాన.

సుద—(సరోషముగ)చతురికా! ఆ వయోవిలాసినీకారణముననో దీర్ఘకోపస్వభావుఁడను గాకపోవుటచేతనో ప్రస్తుత మిట్లు చరించితిని గాని నీ విప్పుడు సంపూర్ణముగ నా శౌర్యధనమును గాపాడితివి. ఇట్టి నా యుదంతంబు స్మరణకువచ్చిన పిదపఁ గూడ నీమార్గముననే చరింతు నని తలఁపకుము. నే నిప్పుడ నాస్వస్థానమున కేఁగు చున్నాఁడను.

చతు—ఏమో నాయన—మీరు ప్రభువులుగదా! లోకాపవాదములతో మీ కేమి పని? మఱియు—

చ॥ నిరుపమయౌవనాంగి యయి ♦ నీరజపత్రవిశాలనేత్ర యై
దరహసితాననేందురుచిఁ ♦ దద్దయు ముద్దులు గుల్క నొక్క సుం
దరిఁ గనుమాత్ర సంచలిత♦దర్పయుతుం డయి నీచమానవుం
డరయఁడు స్వీయగౌరవము ♦ నైనఁ గులీనత నైన నక్కటా!

కాని మీవంటివారికి మాత్రము.........

సుద—అట్లు కాదు చతురికా! నే నిప్పుడే నా సౌధమున కేఁగు చున్నాఁడను. (నిష్క్రమించును.)

---

## తృతీయరంగము. కాసారతీరము.

(ప్రవే. వాసంతిక కూర్చుండియుండఁగా దూరమున సుదర్శనసేనుఁడు.)

సుద—చతురిక కఠినముగాఁ బలికిన దనుకొనుట కిం దన్నృత మేమి కలదు? ఆ వాసంతికపైఁ గల మోహకారణముననే గదా నా పూర్వపు శత్రుత్వమును సైతము మఱచి యిపుడు—

ఆ॥ వె॥ తనదుకనుల మూసి♦కొని పాలు ద్రావుచు
నన్యు లెఱుఁగ రనుచు ♦ నాత్మఁ గులుకు

పిల్లివోలె నాదు • వెడగు చేష్టల కేన
సంతసింపు చుంటి • స్వాంత మందు.

కాని యింక నైన నావర్తనమును సవరించు కొనని యెడల జననిందకుఁ బాల్పడవలసి వచ్చును. కావున నే నిప్పుడు తప్పక నా స్వస్థానమునకే యేఁగెద. (ఇంచుక పరిక్రమించి) ఎట్లు పోవుదును? అట్లు వాసంతికానివాసమునకుఁగాని యిట్లు మన్నివాసమునకుఁగాని యేఁగుట కా కాసారమును సమీపించినఁ గాని మార్గంబు గానరాదు. అయినను—

తే॥ గీ॥ అట్టి భువనైకనవమోహ•నాంగి నొక్క
నిర్జనప్రదేశంబున • నిర్దయుండ
నగుచు విడనాడి చను టన•ర్హాంబు గాన
సుదతి యనుమతిఁ గొనియె యేఁ•గెద బిరాన.

(వాసంతికను సమీపించును.)

వాసం—(ససంభ్రమమున లేచును.)

సుద— (స్వగ.) ఇట్టి సుందరాంగినా విడిచి చనుట!

కం॥ ఎక్కువమక్కువ గొలిపెడి
యిక్కంజాయతదళాక్షి • యింపగు చూడ్కల్
నిక్కముగ మన్మనోధన
మొక్కత్రుటిని హరించె జిత్ర • మూహింపంగన్.

వాసం—ఏమో విహార మని నన్నిచటకు రా నియోగించిన దీ కాసారతీరమునఁ గూర్చుండఁ బెట్టుటకా?

సుద—కాదు సుందరీ! ని న్నివ్విరిందుఁ గూర్చుండు మనిరి? రమ్ము. ఇందుఁ గల విచిత్రంబుల నరయుదము.

వాసం—వలదు. ఇప్పటికే చాల సేపయినది. ప్రొద్దుగూడ గ్రుంకి నది. త్వరగా నింటి కేఁగుదము రండు.

సుద—కాంతా! కొంచెము మాఁగుము. నీ కొక్క విషయ మెఱింగింప వలయుఁ గాన సావకాశముగా వినఁ గోరెద.

వాసం— మోహనాకారా! వినుటకే యాటంక ముందునా? సెలవిందు.

సుద— తలోదరీ! అభ్యంతరము లేకుండినఁ జక్కఁగా వినుము-

ఉ॥ ఓవనితా! త్వదీయ సుము♦ఖోజ్వల తేఁనుఁ గాంచి సదా మదీ
యావిలమానసాబ్ధి మహా ♦ దద్భుత ... రసాభిరామ మై
యీవిధిఁ బొంగుచుండె నిఁక ♦ నేమి వచింపఁగ నేర్తుఁ గాని నీ
యీన సమర్థురాల విది ♦ యెల్ల నెఱింగి యనుగ్రహింపఁగన్.

వాసం— (లజ్జచే ముఖమును వంచుకొనును.

సుద- శా॥ బాలా! నీదు వచోవిలాస మమృత♦ప్రాయంబు నీగానముల్
నీ లీలానటనావిశేషమును నీ ♦ నెయ్యంపు దృష్టిప్రభవం
బాలోకించి మదీయహృజ్జలజ మ ♦ త్యంతంబు హార్దాంబుధి
శ్రీలం దేలుచు నుంటఁ గాంచితి విఁకం♦జెప్పంగ నే మున్నదే.

తలోదరీ! స్వయంవరాన్వేషణము రాజవంశోచితమే గదా. నీ వంగీకరించినచో నిజననీజనకులు నంగీకరించినట్లే; ఇప్పటికే నీ తండ్రి యంగీకారము స్పష్ట మగు చున్నది. మఱియు—

ఆ॥ వె॥ వారిజాక్షి నీదు ♦ వాలుచూపులుఁ బరి
హాస మొసఁగు మధుర ♦ భాషణములు
నస్మదీయ మనము ♦ నపహరించె నంటంచుఁ
దలఁచు చుంటి నిజముఁ ♦ దెలియు దీవు.

వాసం—(మెల్లఁగ) అవును గాని చతురికహితోక్తుల నేమి చేసితిరి?

సుద—చతురికా! అది యొక మతిచెడిన వృద్ధురాలు. పాటింపఁ బోయి దానిమాటలనే పాటింపవలయునుగా! దానిమాటల కేమి కాని యిటు వినుము—

తే॥ గీ॥ శౌర్యవంతుండ నయ్యు నీ ♦ జనకునకును
మాకుఁ గల వైరమున కైన ♦ మనసునందు
లక్ష్య మూనక నాభాగ్య ♦ లక్ష్మి వనుచు
నమ్మియుంటి నీ వెవ్వరి ♦ సొమ్మొ వసుదో.

వాసం— తే॥గీ॥ తండ్రితో నొక్క కాననాంతరము నందు
వన్యమృగముచేఁ బ్రాణముల్ వాయుతఱిని
బ్రాణదానం బొసంగిన భవ్యమూర్తి
సొమ్ము నగుదు నే నిది నిశ్చయమ్ము సుమ్ము.

సుద—(సంతోషముతో) చెలీ! మన కాదినము. జన్మమధ్యమున మఱవఁ దగని సుదిన మైనది. (వాసంతికను ముద్దుబెట్టుకొనును)

వాసం—సంధ్యారాగంబు కూడఁ దగ్గుచున్నది. ఇఁక నేఁ బోయెద.

సుద—మనోహారీ! త్వరపడియెద వేల? నేనును నీ వెనువెంటనే వచ్చెదను గదా! ప్రేయసీ! నేఁటి యీ శుభదినచిహ్నంబుగ నా యీ యంగుళీయకమును నీ వ్రేల ధరింపుము.

(అని యుంగరము నిచ్చును.)

వాసం—(చిరునవ్వుతోఁ గైకొని పోఁ బోవును.)

సుద—(చేయి పట్టుకొని) అట్లుకాదు. నీ వ్రేలికి ధరించి నన్ను మదానందుని జేయుము. (తానే వ్రేలికిఁ దొడుగును.)

వాసం—(నిష్క్రమించును.)

సుద—నేఁటికి సఫలీకృతమనోరథుండ నైతిని. (నిష్క్ర.)

---

చతుర్థరంగము:—అశ్వనమంత్రి సౌధము.

ప్రవేశము:—అశ్వనమంత్రి.

అశ్వ—నా సంకల్పబీజము క్రమక్రమముగా నాటుకొనినదై తొలుత నంకురముగను బిదప లేఁగొమ్మగను దరువాత వృక్షముగను నయి ప్రస్తుతము పుష్పశోభిత మగుచున్నది. కొలఁది దినములలోపలనే ఫలవంతము కాఁగలదని నమ్ముచున్నాను.

తే॥ గీ॥ అగునొ కాదో యనుచు సంశయమునఁ జేయు
పనుల ఫలితముల్ సంశయాస్పదములె యగుఁ
గాని యేలశా వను పూనికను వహించి

సలుప నగు నెల్ల పనులు నిస్సంశయముగ.

ఇప్పటి కన్నియు ననుకూలముగనే యున్నవి కాని- తలఁచుకొనిన సంశయము గలుగుచున్నది. ఈసంబంధమునకు దా నేమివంకఁ బెట్టునో? తనముఖత స్థిరపఱుపఁబడనిపనులను బనికిరా వనుచు నేదియో యొకలోపమును గనఁబఱచుచునే యుండును మఱియు—

క॥ మగుప చలె నూరకుండక
మగవారివిధంబున ననుమానింపకయే
తగునిది తగదని వ్యవహా
రగణంబులఁ జూని దిద్దు ◆ సాధ్విమె మెప్పన్.

అటుకావున—

ఆ॥ వె॥ ఇట్టి భార్యఁ గలిగి ◆ యేమి చేయఁగ లేని
వెఱ్ఱి నగుచు నిపుడు ◆ వింత యూహ
లేమొ చేయుచుంటి ◆ నేరీతి నెఱవేఱు
సతికి వెఱచు నట్టి ◆ పతులపనులు.

అయినను బ్రస్తుతము సమీపమున లేదు గదా! లేకున్న లాభమేమి? ఇప్పుడు గాకున్నను వివాహము సమీపించు నప్పు డైనఁ జెప్పక తప్పునా! చెప్పిన నేమి విఘ్నములు వచ్చునోగదా! నా పుత్రిక నిచ్చెద నని స్పష్టముగాఁ జెప్పక పోయినను జెప్పినటులనే యభిప్రాయ మిచ్చి యుంటిని. ఏమి కానున్నదో కదా!

ఆ॥ వె॥ కన్య నిత్తు నంచు ◆ గౌరవ మింపార
నొకని దెచ్చి యుంట ◆ నుంచుకొనియు
మగుడ నీయ ననఁగ ◆ నగుబాటు గాదొకో
యేమి యగునొ కాని ◆ యెఱుఁగఁ జాల.

అయినను "మా బిడ్డ నిచ్చెదను రమ్ము" అని స్పష్టముగాఁ బిలిచి తీసికొని వచ్చియుండ లేదుగదా. కానిమ్ము- యేమికానున్నదో!

(సేవకుఁడు ప్రవేశించును.)

ఏమిరా! టపా వచ్చినదా?

సేవ—చిత్తము—(అని యొక లేఖ నిచ్చును.)

అశ్వ— (చదువుకొనుచు) పోయి వాసంతికను బిలిచికొనిరమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్ర.)

అశ్వ—రేపే వచ్చునంట—ఇంతత్వరగా వచ్చుచున్న దెందులకో !

వాసం—(ప్రవేశించి) నాయనగారూ! ఎందులకో పిలచితి రంట?

అశ్వ—అమ్మాయీ! రేపే మీయమ్మ వచ్చుచున్నది. గృహకృత్యములయందేమియు లోపముల నుండ నీయఁ గూడదుసుమా! ఇదిగో లేఖ వచ్చినది. (లేఖ నిచ్చును.)

వాసం—(పుచ్చుకొని) అమ్మ వచ్చుచున్నదను సంతోషముతోఁ గూడ భయమును గలుగుచున్నది. నాయనగారూ! నేనిప్పటినుండియు సేవకులకు హెచ్చరికఁ జేయుచుండెద. పనుల యందు లోపము లున్న నాపైఁ గోపగించును.

అశ్వ—అందువలననే నీకు ముందుగాఁ దెలియఁ జేసితిని. పొమ్ము.

వాసం—రేపటియుదయమున వచ్చునా? సాయంకాలమున వచ్చునా?

అశ్వ—ఆ వివరము లేదు; కాని రేపు తప్పదు.

వాసం—సరే; మాయమ్మను జూచి బహుదినము లయినది.

(నిష్క్రమించును.)

(అవనిక పడును.)

# చతుర్థాంకము

ప్రథమరంగము:—అశ్వనమంత్రిసౌధము.

(సుదర్శనసేనుఁడు కూర్చుండియుండఁగా వాసంతిక ప్రవేశము.)

వాసం—ఏ మది! ఇం దొంటరిగాఁ గూర్చుండియున్నా రేలొకో?

సుద—

శా॥ ఇంతీ! నీ సుకుమారరూపమును మ ♦ ద్హృత్సీమ స్థాపించి బల్
సంతోషాయత వార్ధిఁ దేలుచు భవ ♦ త్సాన్నిధ్య మర్థించి యే
కాంతం బెంతయుఁ గోరియుండ సిట నో ♦ క జాక్షి! నీసత్కృపా
స్వాంతం బేవిధి నొప్పె నీవిధముగాఁ ♦ బ్రశ్నింపన న్నీయెడన్.

వాసం—(చిరునవ్వుతో) నిన్న చెరువుగట్టునఁ గూర్చుండఁ బెట్టి చెప్పినట్టి రహస్యంబులవంటి విం కేమైనఁ గలవా యేమి?

సుద—నా జన్మమధ్యమునఁ గోరఁ దగిన వానినెల్ల నిన్ననే కోరితిని. అంతియేకాక సఫలమనోరథుండఁ గూడ నైతిని. నా కదియే సుదిన మని నమ్ముచున్నాఁడ.

వాసం—అగుఁ గాక—దాన నేమిప్రయోజనము?

సుద—ప్రయోజనము లే కేమి? నీ మనోధనమును సంపూర్ణముగ నాకర్పించి యుండియు నేఁ డీ లెక్కసక్కెము లాడెద వేల?

వాసం—ఎక్కసక్కెములు గావు. కాని—

చ॥ నిరుపమసుందరాంగు నొక ♦ ని న్మనసార వరించి వానిపై
నురుతరమోహ మూని మది ♦ నువ్విళు లూరుచు నుండు నాతలో

దరి తలిదండ్రు లన్యునకుఁ • దద్దయుఁ గూర్పఁ దలంతు రేని యా
తరుణిమనోవ్యథ న్దెలియ • దైవముగాక నరు ల్సమర్థులే.

కావున నా జననీజనకులయభిమతంబు మన్మనోనిశ్చయంబునకు వ్యతిరేక మగు నేమో యని సంశయించు చున్నదాన.

**సుద**—ఇ దేటిసంశయము!

తే॥ గీ॥ నీరజాక్షి స్వయంవరా • న్వేషణంబు
క్షత్త్రికులకన్యకు విధాయ • కంబు గాదె
కాన నీవు వరించిన • వానిఁ గాక
పరుని గూర్చి నీ కహిత మె • వ్వా రొనర్త్రు.

మఱియు నీ తండ్రి యనుకూలించియే యుండెఁ గదా?

వాసం—అవునుగాని- మాయమ్మ యభిమతం బె ట్లుండునో?

**సుద**—గృహాధిపతి యగుమగవాఁడు సమ్మతించినదానికి యాఁడుది యేమి చేయఁ గలదు?

వాసం—అ ట్లనకుఁడు. మాయింటమాత్ర మౌ ననినను గా దనినను మాయమ్మయే సర్వస్వతంత్రురాలు. కావున మాతండ్రి సైతె మొకప్పు డీమెకు జంకుచునే యుండును.

**సుద**—

ఉ॥ ఎవ్వతె పాపభీతిఁ ద్యజి • యించి నిజేశుఁ దృణంబు గైవడిన్
గ్రొవ్వున నేవగించి తన • కుం బదు లెవ్వరుఁ బల్కరా దటం
చివ్విధిఁ బల్కు భార్య లభి • యించిన నంతటి ప్రాజ్ఞుఁ డైన నా
జవ్వనిముందు నించుకయుఁ • జాలనివాఁడె యగు న్గదే చెలీ.

వాసం— నిశ్చయము. (శ్రుతి నభినయించి) అదిగో- మాగుఱ్ఱపుబండి చప్పుడు వినవచ్చు చున్నది. మాయమ్మ వచ్చు చున్నది. (ఇరువురు పాఱఁ జూచు చుందురు.) మాయమ్మతోఁ గూడ బండి దిగు చున్న యా నూతనపురుషు లెవ్వరో గదా!

**సుద**—వా రిటకు వచ్చుకారణ మేమి?

వాసం—వా రెవ్వరో మీ రెఱుఁగుదురా?

సుద—ఎఱుఁగ కేమిగాని—

వాసం— అదిగో! మాయమ్మ యిటే వచ్చుచున్నది. నే నిఁక నిం దుండరాదు. (నిష్క్రమించును.)

సుద— ఈమె మదిరసౌమ్యుల వెంటనిడుకొని వచ్చు కారణ మేమై యుండునో. ఒకవేళ—ఏమో నిశ్చయ మెఱుంగ నిది నిర్ణయింప రాదు; కాని—

తే॥ గీ॥ త్రాగుఁ డంతగా లేకు వ ♦ ర్తనము గొంత
యుక్తమార్గంబునకు వచ్చు ♦ చుండె మఱియుఁ
బిన్నతల్లియాస్త్రియును బ్రా ♦ ప్తించెఁ గాన
నచ్చుపదవి సౌమ్యుం డిపు ♦ డుండె నంద్రు.

(సౌమ్యుఁడు, మదిరుఁడు, రవణిక ప్రవేశింతురు. సుదర్శనసేనుని రవణిక తేఱిపాఱఁ జూచును. సుదర్శనసేనుఁ డది గ్రహించి చూచియుఁజూడనట్లు చూచును.)

సుద—ఏమిది—గృహయజమానురా లగుటచేఁ బరామరిక సేయుటకు బహుఁలు వింతచూపులఁ జూచుచున్నది.

చ॥ చుఱచుఱ వింతచూపులను ♦ జూచుచు నూఁడుటెకాని యన్యు లిం
దఱిగాఱ లేక వర్తిలెడు ♦ నంచుఁ దలంచెడు మాన్యశీలురో
మఱియెవరో యఁటంచుఁ దన ♦ మానము వీడి ప్రశంససేయ ది
త్తఱి నిట నుండరా దిఁక యుందంతయు దవ్వులనుండి చూచెదన్.

(నిష్క్రమించును.)

రవ—(మదిరసౌమ్యులతోఁ) మీరు మార్గాయాసమున మిగులఁ బడలికఁ జెందినట్లున్నారు. ఆగదియం దమర్పఁ బడిన శయ్యాతలంబుల నలంకరించి మీబడలికఁ దీర్చికొనుఁడు. (అటు నిటుఁ జూచుచు) ఎవఁడురా?

సేవ—(ప్రవేశించి) తల్లీ! ఏమి సెలవు?

రవ—ఆగదిలోనికి వీరిని దీసికొనిపొమ్ము

సేవ—చిత్తము—(మదిరసౌమ్యులతో) దయసేయుఁడు (అని యిరువురతో నిష్క్రమించును.)

అశ్వ—(ప్రవేశించి) మఱియు నింక నేమి విశేషములు గలవు?

రవ—ఏమియు లేవు గాని యీ నూతనపురుషుం డెవఁడు?

అశ్వ—ఎఱుఁగవా!

ఆ॥ [illegible]
[illegible]
సమయమం దనూన • సాహసమ్ము మొనరించి
ప్రాణదాన మిడిన • భవ్యుఁ డితఁడు.

ఈ విషయము నీ కిదివఱకు వ్రాసియే యుంటిని. మఱియు-

తే॥ గీ॥ ఎవని సామ్రాజ్యమున మన • మీ యశేష
వైభవంబులఁ గాంచ దూఁగు • ప్రాభవంబు
గాంచఁ గలిగితిమో యట్టి • ఘనుఁ డితండు
చెలఁగు చుండు సుదర్శన • సేనుఁ డనఁగ.

రవ—(బొమముడిపాటుతో) ఇతఁడు మనకు సంపూర్ణశత్రువు గదా! ఇపు డిం దేల మసలు చుండె?

అశ్వ—శత్రు వైన నొకప్పుడు మిత్రుఁడు గాఁ గూడదా? ఇతఁడు మన కిప్పుడు మిత్రుఁడే యయ్యెను.

రవ—మిత్రుఁడా? బంధువుఁడా?

అశ్వ—బంధువుఁ డెట్లగును?

రవ—ఏమి!—కుమార్తె నిచ్చి పెండ్లి చేసిన బంధువుఁడు గాఁడా?

అశ్వ—నే నంతవఱకు నూహింప లేదు.

రవ—ఊహింపనిదే యింటఁ దెచ్చి పెట్టుకొంటిరా? ఎంతవఱకు మీ రూహించినది నే నిదివఱకే విని యుంటిని.

అశ్వ—లేదు— లేదు— నే నేమియు ననుకొన లేదు.

రవ—అనుకొన కేమి? పిలిచి పెండ్లి సేయ నుంటిరి. కాని—

ఉ॥ గర్భదరిద్రు నొక్కరుని • గౌరవహీనుని దోడితెచ్చి యీ
గర్భశుభాఢ్య మైన తనయ • గాదిలిపట్టి నొసంగి క్రూరత

దుర్భరఖేదవారినిధిఁ ♦ ద్రోయఁగ నెంచితె చాలుఁజాలు నా
యర్భకురాలి కే మెఱుక ♦ యాననఁ గా దన నేన యుండఁగన్.

అశ్వ—(వివర్ణుఁ డగుచు)

ఆ॥ వె॥ బ్రతికిచెడినవాఁడు ♦ పరమయోగ్యుఁడు గాని
చెడిబ్రదికినవాఁడ? ♦ చెపుమ యిట్టి
వానికన్న యుక్త ♦ మైనవాఁ డేయెడ
దొరకఁ గలఁడు మనకుఁ ♦ దోయజాక్షి!

అయినను నే నిట్టి యుద్దేశముతోఁ దెచ్చి యుండలేదు; కావున వివాహముమాట తలపెట్టెద వేల? అతఁడు మా కొనర్చిన యుపకృతికిఁ గృతజ్ఞతాపూర్వకంబుగ నిటకుఁ దోడితెచ్చితిని.

రవ—మీ రెంత దాఁచినను మీ రేయుద్దేశముతోఁ దోడ్కొని వచ్చినది నేను వినియే యుంటి నంటిఁ గదా! కావున మీ కాసంశయ మేల! మన వాసంతికకుఁ దగిన వరుని నే నిదివఱకే నిశ్చయించి యుంటిని. మఱియు వానికై యెందును వెదకవలసిన యగత్యమును లే కుండఁగ నా వెంటనే యాతనిని దీసికొనివచ్చి యున్నదాన. కావున శీఘ్రంబుగ వీని నిచటినుండి వెడలిపొమ్మనుఁడు.

అశ్వ—(స్వగ). ఇప్పుడు వీ రిరువురు నిందుకొఱకే వచ్చిరి కాఁబోలు. (ప్రకా.) ఇప్పుడు న న్నేమిచేయ మందువు?

రవ—వానిని వ్వరఁగా నిం దుండి వెడలింపు మని—

అశ్వ—(స్వగతమున)

ఆ॥ వె॥ కన్య నిత్తు ననుచు ♦ మాన్యచరిత్రుఁ డొ
నొకనిఁ దెచ్చి యింట ♦ నుంచుకొనియు
మగుడ నీయ ననఁగ ♦ నగుబాటు కాదొకో
యేమి చేయ నగును ♦ యెఱుఁగఁ జాల.

(ప్రకాశముగా) అయ్యో: ఎట్లు చెప్పుదు? నాలుగైదుదినములలో నతఁడే వెడలిపోవును. ఈమాత్రముకై "పో" మ్మని మన

మన నేల? అందువలన నే మగునో?

రవ—ఏమగును—మన యింటినుండి వెడలిపోవును?

అశ్వ—(స్వగతమున)

శా॥ కన్యాదాన మొనర్తు నం చొకని వేడ్కం బిల్చి కొన్నాళ్లకుం
శూన్యత్వం బొనరించి పొమ్మన బుధస్తోమంబు నిందింపదే
యన్యం బింతకు మించుకల్మష పుంగృత్యం బే యెడ న్గల్గునే
దైన్యం బెంతయు నొందదే యతం డిసీ ధర్మంబె యోచిత్తమా.

రవ—ఏమో యోచింపు చుంటిరి? పిల్ల నిత్తు నని పిలిచి తిరిగి వెళ్లు పొమ్మందు ననియా యాలోచింపు చుంటిరి? అటు లైనం గన్య నిత్తు నని మీ రొకని దెచ్చితిరి. అట్లే నే నొకనిం దెచ్చితిని; గాని యిరువురకును గట్టిపెట్టముగదా! కావున వానిని వెంటనే వెడలిపొమ్మనుఁడు. ధర్మముల విచారించిన నిన్నియో బైలుదేరును.

అశ్వ—నేను వానిని బొమ్మని చెప్పఁజాల.

రవ—నోటితోఁ జెప్పఁ జాల రేని చీటివ్రాసి పంపుఁడు.

అశ్వ—అదియుఁ జేయఁజాల.

రవ—మీరు సేయఁ జాల రేని నేఁ జేసెదఁ జూఁడుఁడు. (తెరవంకఁ జూచి) ఎవఁడురా యక్కడ?

సేవ—(ప్రవేశించి) అమ్మా! ఏమిసెలవు?

రవ—(ఒకచీటిని వ్రాసి) ఇంతకుముం దిచటనుండి లేచిపోయిన యామానిసి కీచీటిని మాయజమానురాలు పంపిన దని చెప్పి యొసంగుము. (ఇచ్చి నిష్క్రమించును.)

సేవ—చిత్తము. (చీటిని బుచ్చుకొని నిష్క్రమించును.)

అశ్వ—కం॥ అయ్యారే! మానవులకు
గయ్యాళిది యైన భార్య గలిగినచో నా

యయ్యులు స్వాతంత్ర్యం బన
నెయ్యది యో యుంచు కైన • నెఱుఁగం గలరే.
(నిష్క్రమించును.)

ద్వితీయరంగము:—చతురిక కుటీరసమీపభూమి.

ప్రవేశము:—సుదర్శనసేనుఁడు.

సుద—అహా! మోమోటమైన లేదె! సరిగా సౌధములో నడుగు పెట్టి యొకగడియ యైన నైనదో కాలేదో కాని యెంతటి సాహస మొనర్చినది!—చెలీ! న న్నడఁచాసితివా?

తే॥ గీ॥ తోయజారాతి లేని రాత్రులను గంటిఁ
బద్మమిత్రుండు లేని పవళ్లఁ గంటిఁ
గాని యిటువంటి గాఢాంధకార మైన
దినము నా కెన్నఁడును దటస్థించు టెఱుఁగ.

అహా! సుందరాంగీ! నీసుందరముఖారవిందసందర్శనభాగ్యంబు నాకీజన్మంబున నింక లభింపదు కాఁబోలు. నేఁటికి నాజన్మంబు వ్యర్థ మైనది; కాని—

ఉ॥ నాఁడు తటాకతీరమున • నన్ను గృపామతి నేలె దంచు నీ
వాడినభాషణంబులకు • హర్షము నందితి నంతెకాని యో
చేడియ యిట్లు విఘ్నములు • చేకుఱు నంచు నెఱుంగ నైతి నిం
కేడకుఁ బోవఁ గల్గుదు నదృష్టవిహీనున కేది దిక్కుగుణ.

పితృవియోగంబును రాజ్యభ్రష్టతయుఁ దటస్థించినప్పుడే దేశాంతరంబు శరణ్యంబు గాఁ గల దని కృతనిశ్చయుండ నయ్యు నను భవింపవలసిన దుఃఖంబు లింకను గొఱవడియుండుటచేఁ గాఁబోలు సంతదనుక నీ ప్రదేశంబును వీడ నైతిఁ గాని యిప్పటికి నాకీ దేశ వాసంబు సంపూర్ణ మైనది; అందువలననే—

చ॥ ఒకవిపినంబునం దహితు ♦ నొక్కని గూల్పఁగ నెంచి చెంత నే
వికసితపద్మనేత్ర కను♦పించుటచే నిఖిలంబు మాని యా
సకియకటాక్షవీక్షణమె ♦ చాలు నటంచుఁ దలంచి యుండ నా
కకట మదీయజన్మమున ♦ నయ్యదియు న్గరు వయ్యెనే చెలీ.

తలోదరీ! నాకుఁ గల యీ సంతాప మంతగా నీ కుండ దని తలంచెద, నేల యన—

ఆ॥ వె॥ మేఘమాలలోని ♦ మెఱుపుతీఁగెను బోలె
నీదు హృదయమున జ♦నించి యల్లె
యంతరింప వచ్చు ♦ వ్యామోహవల్లి నా
కటులఁ గాక వ్యాప్త ♦ మగుచు నుండె.

ఇందునకుఁ గారణ మొండు లేకపోలేదు. సకలసామ్రాజ్య విహీనుఁడ నై దేశేతరంబు శరణ్యంబుగా నిశ్చయించుకొని పూర్వ వైషమ్యకారణములచేఁ గ్రోధరసోద్రేకమానసుండనైసంచరించునేనల్లె శృంగారరసావేశునిగ మార్పఁబడి తుదకు నధోలోకమునఁ ద్రోయఁబడిన వాఁడ నగుటచే నా విచారసాగరమునకు మేర లేదు. నీ విషయ మన్ననో—

ఆ॥ వె॥ ప్రథమ మందు నేను ♦ ప్రార్థింపఁగా నీదు
హృదయసీమ మోహ ♦ మొదవెఁ బిదప
వల దఁటంచు జనని ♦ వారింపఁగా నంత
రించి పోయె నిపుడు ♦ మించుబోఁడి.

కావున నీ విచార మంతగా నిలుకడగలదిగా నుండ దని తలంచెద. (తలపంకించి) ఇది కేవలము భ్రమ— చిత్తవైకల్యము— సుందరాంగీ! నీ మనఃపూర్వకముగా నన్ను బ్రేమించియే కదా నా కరాంగుళీయకమును గైకొని నీవు ధరించి యుంటివి. మఱియు—

"చ॥ నిరుపమసుందరాంగు నొక♦ని న్మనసార వరించి వానిపై
నురుతరమోహ మూని మది ♦ నువ్విళు లూరుచు నుండు నాతలో

దరితలిదండ్రు లన్యులకు ♦ దద్దయుఁ గూర్పఁ దలంతు రేని యా
తరుణిమనోవ్యథ న్దలియ ♦ దైవముగాక నరు ల్సమర్థు లే,"

అను నీ రసోద్రేకవాక్యంబుల వినియే యుంటిని గనుక మన కిప్పట్టున సమాన మైన సంతాపమె సంప్రాప్త మైనది. దైవమా!— ఏమి చేయుదును? (యోజించి) అయినను నీ దుఃఖమునకు నేనే కారణుండనుగదా! ఏల యన—

కం॥ శౌర్యధనంబును గోల్పడి
యార్యమతము ననుసరింప ♦ కక్కట నీ సౌం
దర్యమున కలరి నా గాం
భీర్యమతము బూదిఁ గలిపి ♦ వెంగలి నైతిన్.

కావున నీ వియోగదుఃఖమునకు నా యవివేకమును గొంత కారణ మైనది. తలోదరీ! ఎట్లయినను నీ వియోగభరంబు భరింపఁ జాలను. అంతియకాక—

మ॥ రమణీ! తావకదివ్యసన్నిధి నజస్రంబుఁ బ్రియాలాపనం
భ్రమచిత్తాబ్జుని జేసి దంచు మది హార్షం బంది యుండంగ జ
న్మమునం దెన్నఁ డెఱుంగనట్టి ఘనచింతావార్ధిలోఁ ద్రోసి యేఁ
గుమటంచు న్వచియింప న్యాయమగునె నాకుం దిక్కెక్కడే భువిన్.

అయినను నీ వియోగదుఃఖభరంబును బరస్పరంబుఁ గనులఁ జూచుకొనుటకైన సమావేశ మొనరింపఁ గల హితులు గాని హితురాండ్రు గాని యీ యూర నొక్కరును లేరు. ఉన్నను నా భవనంబును బ్రవేశింపఁ జాలరు—అహా! చిత్రమా! త్వరపడకుము. నీ కాక తెరవు గన్పించు చున్నది.

ఆ॥ వె॥ చతురికా! త్వదీయచాతురీగరిమచే
నామనోహరాంగి ♦ నాయనూన
భాగ్యరాశినొక్క ♦ పరిఁ జూపి యీ పరి
తాప మార్ప రాదె ♦ దయదలిర్ప.

ఆహా! ఇదియు నొకవెఱ్ఱియే కాంబోలు. ఏల యన నీ బాంధవ్యమునకుఁ గడగిన నన్ను దొలుత నే తన మృదూక్తులచే మందలించి తుదకుఁ దానే యిందులకు సాయపడునా! అయినను వెళ్లి యాశ్రయించెద. (ఇంచుక పరిక్రమించి) ఆ సందడి యేమై యుండును? అయ్యో! ఏ మిది. మీ రట్లు గుంపులు గూడి చూచు చున్నారు?

పౌరు—(ప్రవేశించి) సుదర్శనసేనుఁడుగారూ! మీరా! పాపము— మీరు ప్రేమతో మిగుల నాదరించు చుండు చతురికకు నేఁటితో భూమిపై భత్యము తీరిపోయినది. కనులు గానరావు. దిక్కు లేదు. డబ్బు లేదు. చచ్చినదేమో సుఖపడినదేమో— కాని— ఆ యొక్కకుమారుఁడుఁ గూడఁ బ్రస్తుతమునఁ జెంత లేఁడు. చతురిక ప్రాణములను విడుచుతఱి మిమ్ములఁ జూడవలె నని మిక్కిలి కలవరించి మఱి చచ్చినది.

సుద—(స్వగ. దుఃఖముతో) ఆహా! విధి యవిలంఘనీయము గదా! అందువలననే తా నొకటి దలఁప దైవము వే ఱొకటితలఁచు నందురు. ఇంతకును నా కీ దినములు దురదృష్టపు దినములు. ఈ దినములే కావు— నా జన్మ మంతయు దురదృష్టమైనదియే. లే కుండిన నీచతురికయు నిప్పుడే చావవలెనా! ఇది యేదియో యశుభసూచకముగ నున్నది- కానిమ్ము— కా నున్నది కాక మానదుగదా. (ప్రకాశముగ) ప్రొద్దు గ్రుంకవచ్చు చున్నది! ఇంకను జాగు చేసెద రేల?

పౌరు—మే మేమిచేయఁగలము? దిక్కు లేదు. తుదకు డబ్బైనను లేదు.

సుద—(స్వగ.) ఈ నాదేశవియోగారంభమం దనాథప్రేతసంస్కారసుకృత మొకటి లభించినది. ఇయ్యది నెఱవేర్చి కొలఁదిదినములలోనె మగధ కేఁగి యీ నా దుఃఖమును మఱచెదఁ గాక— దుఃఖము మఱపునకు వచ్చునా! నన్ను నేనే మఱచెదను. (ప్రకా.) అయ్యో! నేను వచ్చి యన్నియుఁ జక్క జేసెద—పోవుదము, రండు.

పౌరు— ఆపెయదృష్టరేఖయె మి మ్మిటకుఁ గొనివచ్చినది. దయ సేయుఁడు.

సుద— (స్వగ.) కాదు— నా దురదృష్టరేఖయె న న్నిట కీడ్చి వైచినది. (ఇరువురు నిష్క్రమింతురు.)

---

తృతీయరంగము:— గృహము.

ప్రవేశము:—వాసంతిక, రవణిక.

రవ—అమ్మా! వాసంతికా! ఏ మిది? ఇట్లు మందమతివిగఁ గన్పించు చున్నావు? మన క్షత్రియవంశోచితాచారమును బట్టి నీ యంగీకారమును బొంది పిమ్మట నిన్ను తన యర్ధాంగలక్ష్మిగఁ జేకొన వారు వచ్చి మనయింట నుండిరి. నీ విపు డిట్లుండు టుచితము కాదు. ఇంచుక యుత్సాహపూరిత వగుము.

వాసం— తే॥ గీ॥ నాల్గుదినముల నుండియు ♦ నా క దేమొ
కాని దేహంబునందు రుగ్ణత జనించెఁ
జిత్త మస్వస్థతను జెంది ♦ చివురు చుండె
నిట్టితటి పెండిలితలంపు ♦ లేల యమ్మ.

రవ—నీ రుగ్ణత నే నెఱుఁగనిది కాదు. నీ కీ యస్వస్థత నిన్నటి నుండియే కదా కలిగినది?

వాసం—(తల వంచుకొని)
తే॥ గీ॥ దేహమున నుష్ణ మధిక మై ♦ స్థిరతఁ గాంచె
నేవి చవిఁ జూచినను రుచిఁయింప వయ్యె
నిన్న గా దిది నాకు జనించి నాల్గు
దినము లయ్యెఁ గారణ మేమొ ♦ తెలియ దమ్మ.

రవ—అమ్మా! వాసంతికా! నేను నీ వనుకొనునంతటి తెలివితక్కువ

దానను గాదు సుమా! ఆ సుదర్శనసేనుఁడు మనయిల్లెప్పుడు విడిచినో నీకప్పుడే యీ యస్వస్థత- చిత్తచాంచల్యము తటస్థమయినది. కాని—

పంచచామరము॥ నిరంతరంబు గ్రుద్ధుఁ డౌచు ♦ నీతిబాహ్యుఁడై వర్తి
జరించు దుష్టవర్తనుండు ♦ శాత్రవుం డగుం గదే
వరింప సద్గుణాఢ్యులైన ♦ వారు వేఁచియుండ నీ
దరిద్రుఁ డేడ నుండి నీకు ♦ దాపరించెఁ జెప్పుమా!

కావున నాతనిపైఁ గల నీ మమతను విడిచిపెట్టి సౌమ్యగుణములచే సార్థకనామధేయుండును, ధనాధికుండును, నీకజమీ కధికారుండును నగు నొకని నీ క్షేమ మరసి మనయింటికిఁ దోడ్కొనివచ్చి యుంటి. నీ వాతని వరింపఁ దగును.

వాసం—

ఉ॥ నందియ మంద కమ్మ! విను; ♦ స్వస్థత లేక శరీర మందు నేఁ
గొందఱ మందు చుండ నిటుఁ ♦ గూరిమిపెంపునఁ జేసి యేమొ యా
నందము గూర్ప నెంచెదవు ♦ నా కవి వీనులవిందు సేయ లే
వెందును బెండ్లివార్త లిఁక ♦ నేఁటికిఁ బల్కెద విట్టివేళలన్.

రవ—(ఇంచుక కోపముతో) ఏ మది! కొలఁదికి మీరు చుంటివి! యుక్తాయుక్తములను మాకన్న ముక్కుపచ్చలారని నీ వెక్కుడెఱుంగుదువా? మా ప్రయత్నము లన్నియు నీక్షేమమునకే కాదా? శరీరమునందు స్వస్థత లేదని మన మిప్పు డుపేక్షించినచో నిట్టి సంబంధము మనకుఁ దిరిగి లభించునా?

వాసం—(విచారముతో వెనుకకుఁ బోవును.)

మదిరసౌమ్యులు (ప్రవేశింతురు.)

రవ—రండి—ప్రస్తుతము మా వాసంతిక కొంచె మస్వస్థతగా నున్నది. అయినను గొలఁదిదినములలోనె వివాహము నిశ్చయింప నగును.

మది—"శుభస్య శీఘ్రము" మ్మనున ట్లదియే యుక్తము. అట్లే

కావింపుఁడు — కాంచి, యీరుగ్మత యేమి?

రవ — ఆ — ఏమియు లేదు. కొంచెము శిరోభారము చేసిన దఁట.

సౌమ్య — సరే. ఇఁక మాత్ర మనుత్తమున మీ మందిరము. (నిష్క్రమి.)

రవ — సంతోషికా! ఏంటివిగదా! ఇఁక నీ దేహారోగ్యమునకై జాఁగ

రూకురాలవు కమ్ము. (నిష్క్రమి.)

వాసం —

ఉ॥ ఏ మిఁకఁ జేయుదాన హృద♦యేశ్వర! నిన్నుఁ బాయు టొండిగా
నీ మృదుదేహవల్లి కృశి♦యించుచు నుండె వియోగవహ్ని న
న్నోర్వఁగఁ గల్గువా రెవరు ర♦య్యో జననీ! మము వేఱు సేసి నీ
పేమ సనైక భావమును ♦ వీడితె మత్కృతపుణ్యపాకమునన్.

తల్లీ! ఎంత చేసితివి!

తే॥ గీ॥ ఒకని మనసారఁ బ్రేమించి ♦ యుండ నన్యుఁ
డెట్టి యధికుఁ డైనను మది ♦ నిసడమునఁ
గాంచుదురుగాని వాని వ♦రించు నట్టి
తెరవ లుందురె? యిది నీకుఁ ♦ దెలియనిదియె.

నా తల్లియెడల నాకిదివఱకుఁ గల చనవునకంటె వేయిమడుగు లధికంబు గలిగించుకొని సంభాషించినను బ్రయోజనము లేకపోయె నుగదా! — కొలఁదిదినములలోనే యఁట — ఆహా! ఈవివాహ మెంత సంతోషదాయకముగ నున్నది. (వ్రేలియుంగరమును దీసి)

ఉ॥ శ్రీనవరత్నమేదుర వి♦చిత్రసముజ్జ్వలకాంతిఁ బూని యె
వ్వానికరాంగుళంబున వి♦భాసిలుచుండెద వీవు నిచ్చ ల
వ్వానిని ముద్దుటుంగరమ! ♦ పాసి మదంగుళిఁ జేరు కారణం
బే నెఱుఁగంగఁజాల నిఁక ♦ నీ వమున నైలుపంగరా దొకో?.

తెలుపుట కేమున్నది? వాని కరగ్రహణంబు మఱవవల దని బోధింప నన్నుఁ జేరితివి; కాని నీవు నా వ్రేలి నుండఁగనే యన్యు నొక నిని జేపట్టవలసి వచ్చుచున్నది. అకటా! ఏమిచేయుదును?

సేవ — (ప్రవేశించి) అమ్మాయిగారూ! ఎచ్చటినుండియో మీ

కీ లేఖ వచ్చినది. (యిచ్చి నిష్క్రమించును.)

వాసం—(జాబువిప్పి యిట్లు చదువును.)

తే॥ గీ॥ "నీకు శుభ మగుఁ గాక యో • నెలత! నీ వ్రా
సంగ జనకుఁ డొప్పెనుగాని • జనని సమ్మ
తింప దాయెఁ గావున నే వి • దేశయాత్ర
సేయ నున్నాఁడ నీ వైనఁ • జింత లుడిగి
యన్యు నొకనిఁ బెండ్లాడి సౌ • ఖ్యమున మనుము."

అకటా! నామూలమున నీకుఁ దీరనిదుఃఖమే కాక దేశభ్రష్టతయు సంభవించెనా? ఆజన్మము నెడఁబాయ సంతతిప్రేమ మూఁకిన మన కిట్టివియోగము తటస్థమైనది— నీసహజశౌర్యగుణాదులను వీడి, చతురికచే నిందితుఁడ వయ్యును బాటింపక నాపైఁగల యనురాగవిశేషమునం గదా మత్సదనంబున కరుదెంచి మజ్జననిచే నిట్టి యగౌరవంబునకుం బాల్పడి తుదకు దేశభ్రష్టతయు, దీరనివియోగదుఃఖమును బొందుచుంటివి? అకటా!

చ॥ కరముఁ గృపాకటాక్షములఁ • గావఁ దలంచి వనాంతరంబునన్
సరసగుణాఢ్య! నీ యతుల • శౌర్యధనంబును గోలుపోయి న
న్నిరుపమలీలఁ బ్రోచితివి • నీకుఁ గృతజ్ఞతఁ జూపుదాన నై
స్థిర మగుదుఃఖ మొందు నిజ • దేశవియోగత యొందు గూర్చితిన్.

కావున నీ యెడల నే నెంతయు నపకృతి యొనర్చి దోసంబు గట్టుకొను చుంటిని. నీ తెఱఁ గే మగునో కదా—అకటా! (చతికిలఁ బడు చున్నది). తెరపడును.

## చతుర్థరంగము:—గది.

ప్రవేశము:—మంచములోఁ బరుండిన వాసంతిక.

వాసం—కం॥ కోరిక లీరిక లెత్తఁగ
సారెకు నుల్లాస మొప్పఁ • జరియించెడి యు
వ్వారికి గాక పదింబదిఁ
గోరెడి నా కెటులఁ జాపు • గూడును చెపుమా.

(కూర్చుండి) హా దైవమా ! కోరినకోరికలలో నొక టైనను నెఱవేర్పరాదా ? మనసార వరించిన యీ నవసుకుమారాకారుని కౌఁగిలి దుర్ఘటం బైనను బ్రాణకోటుల కిష్ట మైనను గలుగక తప్పని యీ మృత్యుదేవతనైనఁ బ్రసాదింపరాదా? అందుననుఁ గూడ నదృష్టంబు గావలయుఁ గాఁబోలు. అకటా ! నే నెంత నిర్భాగ్యురాలను. ఇట్టి మరణావస్థలోఁ బెండిలి యఁట! సమీపించుచున్న దఁట!—

తే॥ గీ॥ దుఃఖమున కెన్నఁ జావు, సంతోషమునకుఁ
బరిణయము హేతు వండ్రు; నా పట్ల యట్లు
గాక పరిణయ మన్న దుఃఖమును మృత్యు
వన్న నమితసంతోషంబు నగుచు నుండె.

ఏమో కాని పెండ్లియన్నపు డెల్ల గుండె దడదడ లాడు చుండె. ఇట్టి స్థితిలోఁ గన్నతల్లికే కనికారము లే దయ్యెఁ గదా!

ఉ॥ సమ్మతి లేనిదానికి నజస్రముఁ బెండిలి పెండ్లి యంచు మా
యమ్మ వచింపు చున్నయది యక్కట నా కిఁక నేదిదిక్కు నే
సమ్మతిసేయ నాదగు విచారము నెంచక కుట్ర లెన్ని యో
యిమ్మెగఁ బన్ను చున్నయది యేమి యొనర్చెద నోమనోహరా!

ఇం కెక్కడి మనోహరుఁడు ! అతఁ డెదియో దేశాంతరగతుఁడై నటుల నిన్నటి లేఖయందుఁ జదివితినిగదా! అయిన నా లేఖ సత్యయమైనదో? లేక మా యమ్మచేఁ గల్పింపఁబడినదో? ఎటు లైన నేమి ప్రయోజనము? అతఁడు తిరిగి కన్పించునా? (మగుడఁ బరుండును.)

రవ—(ప్రవేశించి) అమ్మా! వాసంతికా! నీ శరీరస్థితి యెట్లున్నది?

వాసం—ఎటు లున్నదో చెప్పఁ జాల. అబ్బా—

వర—(ఆతురతతో) చెప్పఁ జాలక పోవు టేమి? మిగులఁ గృశించి చూచువారలకు భయము గల్పించుచున్నావు. సుముహూర్తమునకు వ్యవధి లేపోక దినమేకదా—ఉండు—వైద్యునైనఁ బిలిచికొని వచ్చెద. (నిష్క్రమించును.)

సేవ—(ప్రవేశించి) అమ్మాయిగారూ!

వాసం — అబ్బా! (శయ్యపైనుండి కదలుచు) మాఘ వేసవినాఁటి సూర్యుఁడైన నింత వేడిమిగా నుండఁడు. అకటా! శరీర మంతయు దహించుకొని పోవు చున్నది.

సేవ — (స్వగ.) కుమారిచేను జూచి యైన జాలిపడి తన మూర్ఖత్వమును విడువక పాప మీబిడ్డయుసురును బోసికొను చున్నది. మన సొకసియందు లీన మై యుండ వే ఆ్రాకసిసి బెండ్లాడ వలసివచ్చినప్పుడు కొఱవిఁబెట్టి గోకినట్లే యుండును.

వాసం — (కదలు చున్నది.)

సేవ — అమ్మాయిగారూ! ఇదిగో లేఖ వచ్చినది.

(లేఖ నిచ్చును.)

వాసం — (చదువుకొని) హా హాతవిధీ!

తే॥ గీ॥ దేహమున నుండు వేని యే ♦ దేశ మందు
నైన నెపు డైనఁ గన్నులఁ ♦ గాన వచ్చు
ననుచు మది నెంచి యుండ నీ ♦ వకట జీవ
యాత్రయే సల్ప నయ్యెనా ♦ యమలచరిత!.

(మూర్ఛిల్లి శయ్యపైఁ బడి కొంతవడికి మూర్ఛదేరి లేచి) అకటా! నే నెంత మందమతిని. త్రాటినిజూచి పా మనుకొను చుంటిని. ఒకవేళ నీలేఖ నా జననిచేఁ గల్పింపఁ బడినది కాఁగూడదా? అటులనే కాకున్న నలేఁడు మృతినొందిన నాకీ లేఖ వ్రాయు నంతటివా రెవరు? అతఁ డింత త్వరలో మృతి నొందుకారణ మేమి కల్గును? నిశ్చయముగ నిదియు మాయమ్మకుట్రయే. అదిగో వచ్చు చున్నది.

(రవణిక, వైద్యుఁడు ప్రవేశించుచున్నారు.)

రవ — అయ్యో! వివాహము సమీపించు చున్నది. ఈమె యీస్థితి యందున్నది. కావున మీరు కొంచెము శ్రద్ధతోఁ జూడ వలయును.

వైద్యు — (వాసంతికచేయి పట్టుకొని నాడిఁ జూచుచు) ఎంతకాలము నుండి యిటు లున్నది?

రవ— ఎంత కాల మొక్కడిది? కొద్ది దినములనుండియె.

వైద్యు— కొద్దిదినములకే యింతటి తీవ్రస్థితి గలిగెనా? మీ సేవకుని బంపుడు. మందిచ్చి పంపెద. (కొంచెము ముందునకు వచ్చి) ఈరోగము మనోవ్యథచేఁ గలిగినది గాన దీని నెవ్వఁడు మాన్ప లేఁడు. మనోవ్యాధికి మందు గలదా?

(నిష్క్రమించును. తెరపడును.)

---

# పంచమాంకము.

---

ప్రథమరంగము:— వివాహ వేదిక.

వేదికయందు సోమయాజులు, వాసంతిక కూర్చొని యుండఁగా అశ్వినమంత్రి, రవణిక, పండితుఁడు, పురోహితుఁడు ప్రవేశింతురు.)

పురో— (కొంచెము ముందునకు వచ్చి)

ఉ॥ ఏటివివాహమో యెఱుఁగ • నీగతిమై ననరాదుగాని నా
నాఁటికి దైన్యమందుటను • నన్నన గొక్కఁడుఁ జిత్ర మయ్యెడిన్
నూటికి లేనివాఁ డయినఁ • గోరిన ద్రవ్యపుఁగాంక్షఁ జేసి యీ
లాటిస్థితిన్ వివాహము; దొలంగరు లుబ్ధులు లోకనిందలన్.

ఉ॥ ధారుణి లుబ్ధులౌనకాలు • ద్రవ్యపుఁ గాంక్షను జేసి భావిమః
ఖోరుభరంబు నారయక • యుక్త మయుక్తము నెన్న రట్టులే
వీరు జమీనుదారులః • వీడఁడు పెండ్లికుమారుఁ డీరునున్
గోరుచు వీడు రాతనికిఁ • గ్రొత్తగ నొక్కజమీ లభించుటన్.

వారికి వీరికి లేనిది మధ్య నా కేల? ఏ మనినను వీరి కీసమయమున నశుభముగ నెంచుదురు. అయినను నెవరిలాభము వారు చూచుకొనవలెనే కాని యీ సందర్భమున నేమియు ననరాదు.

రవ— ఏమండీ! సోమయాజులుగారూ! అంతయు సిద్ధ మైనప్పటికి

మీ రింక నక్కడనే తిరుగు చుంటిరి!

పురో — ఏమియు లేదు — పెండ్లికుమారిత సిద్ధముగా నున్నదా?
(సమీపించును.)

మది — అందఱు సిద్ధముగనే యున్నారు. తమదియ యవశిష్టము.

రవ — అయ్యా! పెండ్లికూఁతురు కూర్చుండఁజాల కున్నది. త్వరత్వరగాఁ ముగింపుఁడు

మది — మీ ఛాందసమును మాత్రము పెంచక త్వరగాఁ గానిండు.

పురో — ఎంత — రెండునిమిషములు — అమ్మాయి! ఇటు తిరిగి కూర్చుండుము.

రవ — అయ్యా! పెండ్లికుమారిత కొంచె మస్వస్థతగా నున్నది. అట్టి వేమియుఁ జేయింపక మీతంత్రమును మాత్రము జరిగింపుఁడు. వలసినచో మంగళవాద్యధ్వనుల మోగ్రిఁగ నీయుఁడు.

అశ్వ — (స్వగ.) అయ్యో! ఇది యేమో మోసముగా నున్నది. ముందేమి కానున్నదో తెలియదు; కాని తల్లియుఁ దండ్రియు సమానబాధ్యతగలవారలే కనుక నే నేమియు ననఁ జాల కుంటి. భగవంతుఁడు క్షేమముఁ గూర్చుఁ గాక.

సుద — (సూత్రధారణ జరుగుతటి నాయుధపాణి యై యొకమూల నుండి ప్రవేశించి)

చ॥ కమలదళాక్షి నామొదల • గాఢతరం బగు మోహ మూనె; నా
రమణిని గాంచి నేనును గ•రంబు విలోలహృదంబుజుండ నై
తమకముఁ జెంది యుంటినిగ•దా; యిటువంటి పరస్పరానురా
గము విడఁదీయు టెంతయు న•ఘుంబని యెంచ రిదేమిపాపమో.

ఈ వివాహవార్త నాకును దరుణముననే తెలిసినది. అదిగో సూత్రిధారణ మగు చున్నది. తండ్రి యగు యశ్వనమంత్రికి సమ్మతి గలదు. కన్య యగు వాసంతికయు నంతకుంబూర్వమే బద్ధానురాగ యయ్యెఁ; గాని యల్లియగు రవణిక మా యిరువురయునురును బోసికొనుచున్నది. అయినను స్వయంవరాచారము గలదుగదా! వాసంతిక

నె ట్లొప్పించినదో!— మనోహారీ! భువనైకసుందరీ! నీ మనసార వరించిన నన్ను విడచి యన్యు నెట్లు పెండ్లాడ నుంటివి?

సీ॥ వనసీమ మరణాప • దను దొలంగించిన
తఱిఁ గల నీదు కృ • తజ్ఞతయును
జనకునితోడ మ • త్సౌధ మందున్నప్డు
పలికిన సరససం • భాషణంబు
మనసార నలనాఁడు • వనజాకరసమీప
మం దొనర్చిన హృద • యార్పణంబు
మొనమొన్న నీసౌధ • మున నల్పినట్టి యే
కాంతవిహారంపు • సంతసంబు

తే॥ గీ॥ నిట్టి వన్నియు మఱచి నీ • వెట్టు లన్యు
నిపుడు చేపట్ట నుంటివో • యెఱుఁగఁ జాలఁ
గటకటా! కామినులప్రేమ • కరము హృదయు
పూర్వకం బైన దని నమ్మి • మోసపడితి.

(దృష్టినిగిడించి) అదిగో! వివాహము జరుగు చున్నది. నా సంగ తిని గనుఁగొని పోయెద. (సమీపించి)

తే॥ గీ॥ నాదుసామ్మ టంచు • నమ్మితి నేయింతి
నట్టిసుందరాంగి • నన్యుఁ డొకఁడు
పెండ్లి యాడు చుండె • వీక్షించితే చిత్త
మా! యిఁకేటిసామ్ము • మగువ నీకు.

(రోషముతో) ఆర్యులారా? ఇచ్చట జరుగు చున్న యీ కలక లమేమి?

మది— ఎవరు—సుదర్శనసేనుఁడుగారా! మిత్రమా! ఎచ్చటి నుండి నీ రాక?

సుద— చాలుఁ జాలు. నీ యిచ్చకంబు లిఁకఁ జాలించి యీజరుగు చున్న దేమో చెప్పుము.

మది— వివాహ కార్యము.

సుద — ఎవరికి?

మది— వాసంతికకును సౌమ్యునకును.

సుద— (రోషముతో) సౌమ్యుఁ డెవఁడు?— వాసంతిక నన్ను వరించినది. నేను వాసంతికను వరించి యున్నాను. మధ్య నితఁ డెవఁడు? ఏఁడీ— ఆ సౌమ్యుఁడు— గీమ్యుఁడు— (కత్తి దూసి) దుర్మదాంధ! నీ పెండ్లి నే నొనర్చెదను. నిలువుము.

రవ— చాలుఁ జాలు. ఇట్టి శుభకార్యసమయమునందు లేనిపోని జోక్యమును గలిగించుకొని యింత వదరుచున్న నీ వెవరవు?

అశ్వ— (స్వగ.) ఆహా! ఎంతటి యవమానము ప్రాప్త మైనది.

సుద— ఎవరా! నీ పుత్రికచే వరింపఁబడినవాఁడను.

రవ— నాకుమారి యెన్నఁడును నిన్ను వరించి యుండ లేదు. ఇట్టి యున్మాదోక్తుల నిం దాడకుము.

సుద— ఆ— యున్మాదోక్తులా? ఇం దసత్య మాడువారి కీ కరవాలంబున కెర యగుదురుగాక. నీపుత్రికచేత నే యొప్పించెద రమ్ము.

రవ— ఈ గొడవ యంతయు మా కేల! మాపుత్రిక యెన్నఁడు నిన్ను వరించి యుండలేదు. మే మెన్నఁ డంగీకరించి యుండలేదు. శీఘ్రముగ వెడలిపొమ్ము.

సుద— అంగీకరించి యుండ లేదా! అదిగో! ఎదుటనే యున్నది. అడుగుము. (అని వాసంతికను జూపును.)

అశ్వ— (ఏమో చెప్పఁ బోవును)

రవ— (వారించి) వృథావాద మేల? మా వాసంతిక మిమ్ము వరించి యుండ లేదు. మీ రిం దుండి శీఘ్రముగా వెడలి పొండు.

సుద— అది యే కనుంగొనియెద. మీ రెవ్వ రిం దుండరాదు. పొండు. మదిరా! వినుము.

తే॥ గీ॥ నన్ను వరియించి యుండె నీ ♦ వన్నుతాంగి
నేను వరియింపఁ బడితి నీ ♦ వలఁత వలనఁ
గనుక నీయింతి నాధనం ♦ బని తలంచి
వేగ నిం దుండి మీరలు ♦ వెడలి పొండు.

మది—మమ్ము వెడలిపొమ్మనుటకు నీవు స్వతంత్రుఁడవు కావు— మఱియు వాసంతికను మీరు వరించి యుండిన నుండవచ్చును గాని మి మ్మాపెమాత్రము వరించి యుండ దట్లు నమ్మఁజాలను—

సుద—నీవు నమ్మిన నేమి? నమ్మకున్న నేమి? తత్క్షణం బిట నుండి మీరు వెడలి పొండు (కత్తిఝుళిపించును.)

రవ—కుమారా! రామరాజ! ఊరకుండెద వేల? పరుఁ డొకఁడు సేయుచున్న నీ కల్లోలమునకు నీవును క్షత్రియవంశోచితాచారంబును జూపక యున్న కుంటి వేల?

రామ—(రోషముతోఁ గత్తిని దీయుచు) నీచాధమా! నీ విం దుండి తత్క్షణంబ వెడలి పొమ్ము. అట్లు పో కుంటి వేని—

అశ్వ—కుమారా! మిత్రులారా! ఇంచుక శాంతింపుఁడు. అతఁడు గోరిన ట్లించుక విశ్రాంతి నొసంగుఁడు. దీన మన కేమి నష్టము?

పారో—ఇది శుభకార్యము గనుక నిచ్చట ఘోరకృత్యములు జరుగనీయక యశ్వనమంత్రిగారు చెప్పినట్లు కొంచెము విశ్రాంతి నొసంగుఁడు.

మది—(భీతుఁడై) మిత్రమా! సౌమ్యుఁడా! లేచి రమ్ము. (రామరాజ సౌమ్యమదిరులు నిష్క్రమింతురు.)

సుద—మీ రెల్లరిం దుండి వెడలిపో వలసినదే. అట్లు పో కుంటి రేని మి మ్మెల్లర నిప్పుడే చెండాడెద.

రవ—ఎవఁడా చెండాడునది! ఏదీ రమ్ము! ఎట్లు చెండాడెదవు? నేను మాత్ర మిందే యుండెదను.

సుద—తే॥ గీ॥ నన్ను వరియించి యున్న యీ ♦ నాతి నెటులఁ
బరున కీయంగ నుంటివో ♦ పడఁతి యెటుఁగ
దీన మాయిరువురకు ను♦దీర్ణదుఃఖ
మును ఘటించి మాయసురును ♦ బాసికొంటి.

రవ—వృథాలాపంబు లాడకుము. ని న్నీపగు వరించి యుండలేదు.

సుద—అదియే యడిగి తెలిసికొనియెద. (వాసంతికను సమీపించి)

ఉ॥ వనిలో మొన్న తటాకతీరమున నీ ♦ వాక్యామృతాస్వాదతఁ
మనసార న్నను గోరి యుంటివిగదా ♦ మ త్తద్విరేఫాలకా!
సను నీవు న్వరియించి యుంటివిగదా! ♦ న్యాయంబు నోనాఁడి య
న్యుని బెండ్లాడుచు నాఁటిప్రేమ విడ నీ ♦ యుల్లం బ దెట్లొప్పెనే.

వాసం—(వెనుక నానుకొని యున్న తల్లిపై నొరగు చున్నది.)

పురో—(స్వగ.) మాట్లాడుటకు స్మారక మేది?

అశ్వ—బిడ్డ మైనను దక్కన ట్లుండ లేదు.

సౌమ్య—(మెల్లగఁ బ్రవేశించి) వారిరువురు ననురాగపాశబద్ధులై
యుండ నట్టి సంబంధంబు విడఁ దీసి యీపె నామెడకుఁ
గట్టినది. ముం దేమి కా నున్నదో కదా?

సుద—హా మనోహరీ! కనుల నైన నెత్తి చూడవా?

మ॥ సరసీజేక్షణ! నోటిమాటకును నోఁచన్ లేద? నీ మాధురీ
సరసాలాపములన్ నిరంతరము హా♦ర్షస్వాంతుఁ గాఁ జేసి దు
ర్భరదుఃఖార్ణవ మందు నున్నతఱి నా ♦ భంగంబు నూహింప కీ
సరణిన్ మిన్నక యుంట న్యాయమగునే ♦ సఖ్యంబు నోనాఁడి తే.

రవ—ఇట్టి వృథాలాపములచే మాకార్యభంగంబు గా నీయక శీఘ్ర
ముగా నిం దుండి వెడలి పొమ్ము. నీ యాయుధంబులకు మేము
భయపడువారము గాము.

సుద—అడుగవలసిన దొక్కటి యడుగ నిమ్ము.

రవ—ఆ యడుగున దేదియో నన్నే యడుగుము. నేను సమాధా
నముఁ జెప్పెదను.

సుద—నీవు మాట్లాడకుము. మంజుభాషిణి! మద్హృదయాపహారిణి!

తే॥ గీ॥ అల్ల కాసారతీరంబు ♦ నందు నాఁడు
జలజవితతి తజ్జలజాళిఁ ♦ జెలఁగుభృంగ
చయము మన కిరువురకు సా♦క్ష్యంబు గాఁగ
నన్ను వరియింప లేదె యో ♦ సన్నుతాంగి!.

వాసం—ఊ—(అని మూల్గును.)

రవ—అదిగో "ఉహూ" యని నీ యనృతంబును వెలిబెట్టు చున్నది. ఇఁక వెడలి పొమ్ము.

పురో—(స్వగ.) పాప మీ వాసంతికకు స్మారకమే తెలియక దేహాదుర్బలతచే నేమో మూల్గినది.

సుద—ఆహా! కానిమ్ము—అటులైన నా కరాంగుళీయమును నీవలఁ బడవేయుము.

రవ—ఇదిగో యిచ్చు చున్నది. (అని తానే వాసంతిక వ్రేలియుంగరమును దీసి యిచ్చును.)

సుద—(తీసికొని యీవలకు వచ్చి)

తే॥ గీ॥ నిఖల మీవే యటంచు న♦న్నియును విడిచి
గారవోన్నతులను బూదిఁ ♦ గలిపి తమ్ము
చేరువఱకును మగువలు ♦ చెలిమిఁ జేసి
యవలఁ దా మేమియు నెఱుంగ ♦ నట్టు లుంద్రు.
(నిష్క్రమించును. తెరపడును.)

---

ద్వితీయరంగము:—పడకగది ముందటిభాగము.

ప్రవేశము:—పురోహితుఁడు.

పురో—ఇట్టి స్థితిలో నీవివాహ మేమి? ఈ గదిలోనికిఁ బంపు టేమి? ఏమో లే—ప్రొద్దుపోయినది. నిద్రవచ్చు చున్నది. ఇందించుక పరుండెద. (పరుండును—గదిలోఁ గలకలము.)

మది—(రామరాజ రవణికలతోఁ బ్రవేశించి యాతురతతో) ఈ పడకగదిలో నీ కలకలంబు లేమై యుండును?

పురో—మూల్గుట కైన నోపికలేని వాసంతికకంఠధ్వని గాదు.

రవ—తలుపు తట్టుఁడు. ఏమో ప్రమాదముగా నున్నది.

వామ—(మదిరునితో) చూచెద రేల? తలుపుఁ దట్టుఁడు.

మది—(తలుపు దట్టును.)

రవ—నాకేమో భయముగా నున్నది. త్వరగాఁ దీయింపుఁడు.

మది—బలవంతముగాఁ దలుపులఁ ద్రోసి చూచి) ఎంతదారుణ మెంతదారుణము! సర్వము రక్తమయము—భయావహము. ఏమో చోద్యముగా నున్నది.

రవ—(తలుపులను బాగుగాఁ దెఱచును.)

(ఒకమూల నొదిగి వాసంతిక పరుండి యుండును; రక్తమయుఁడై సౌమ్యుఁడు పడి యుండును.)

మది—(భయాశ్చర్యములతో) ఏమీ ఘోరము? ఎవ రింతటి దారుణ కృత్య మొనర్చిరి?

రవ—అమ్మా! వాసంతి కా! ఇంతటి ఘోరకృత్య మొనర్చిన వా రెవరో చెపుమ?

రామ—వాని నిప్పుడే తుత్తునియలుగాఁ జేసెద.

పురో—సరే—బాగుగా నున్నది—

ఉ॥ మూఁడుదినంబు లుండియును ♦ మూల్గుట కైనను శక్తిలేక మీ వేడుక జూడఁగాఁ గనులు ♦ విప్పి యెఱుంగక యెండవేడిమిన్ వాడిన లేఁతతీఁగయొ యనన్ గరము గృశియించి యున్న నీ చేడియ యే మెఱుంగును వచింపఁగ మూర్ఛిలి యున్న దెంతయున్.

మది—(గది నాలుగువైపులఁ జూచుచు)

ఉ॥ ఈ గది నే యెడ న్గనిన ♦ నీఁగ చొరంబడ నైన సందు లే దేగతిఁ జొచ్చె నన్యుఁ డిది ♦ యె ట్లెఱుఁగం దగు నిట్టి ఘోరమే లాగు జనించెనో యకట ♦ లాతి యొకండును గాన రాఁడు మి

తాని! గతజీవుఁ జేసిద సంతం డెవఁడో యెఱుగంగఁ జెప్పుమా?
సౌమ్య—(పరుండియే) నే నేమియుఁ జెప్పఁ జాలను—చెప్పను-నన్ను త్వరగా మాపురికిఁ జేర్పుఁడు. అబ్బా—బాధ యెక్కు వగు చున్నది.
రామ—మీారే వచింప కుండిన నాదుష్టుఁ డెట్లు పట్టుబడఁ గలఁడు? వానికి దగినశాస్తి యె ట్లొనరింపఁ గలుగుదుము?
సౌమ్య—నేను జెప్పను—నన్ను ద్వరగాఁ గొనిపొండు.
మది—మిత్రమా! నీవు తగిన స్వాస్థ్యము నొందువఱకుఁ బ్రస్తుత మొక వైద్యశాలయం దుండుట యుక్తమని తలంచు చున్నాను.
సౌమ్య—నీకు యుక్త మని తోఁచిన విధమున నొనర్పుము. బాధ యధిక మగు చున్నది. త్వరపడుము.
మది—అట్లనే యొనర్చెదఁ గాని—

తే॥ గీ॥ దుష్టమార్గానువర్తుఁ డై ♦ దుర్మదమున
నిట్టి ఘోర మొనర్చిన ♦ వృజనచిత్తుఁ
దెలియఁ జెప్పుమ నాకసి ♦ దీరు నటుల
నిముసమాత్రాన వాని ఖం ♦ డించి వైతు.

సౌమ్య—అదిమాత్రము నేను చెప్పను—చెప్పను—ముమ్మాటికిని జెప్పను—ఈదౌష్ట్యమునకు నేన కారకుఁడను. నే నిఁక బ్రిదుకఁ జాలను.
రామ—మదిరా! నిన్న పెండ్లిసందడిలో—

మత్తకోకిల.

విందు సేయగఁ బోవు చుండి నవీనబంధుజనాళితో
నొందుఁ గాంచినఁ గానుపింపమి ♦ నేడ దాచితినో యటం
చుందలంచితి నాకృపాణముఁ ♦ జూచి దాని హరించి యీా
చంద మొప్పఁగ జేసె నీ కలుషం బెవండో దురాత్ముఁ డై.
అట్లు గాకున్న నా ఖడ్గ మేల కనఁబడదు?

మది—నీకత్తిని దీసికొనినమాత్రమున నే మగును? పైనఁ గనఁబడుచున్న యీా గాలికిటికియొక్కటి దక్క యీాగదిలో నల్లచీమ యైనను

ప్రవేశింప నవకాశము గాన రాదు.

రామ—అదియు నిజమే—సందర్భ మగ్రాహ్యముగా నున్నది.

పురో—(వాసంతికను సమీపించి చూచి) ఓయీ! మీ విమర్శనము పాడుగాను. ఆసంగతిని దరువాతఁ జూచుకొనవచ్చునుగాని యిక్కడ బిడ్డసంగతిఁ జూడుఁడు. అయ్యో—అమ్మగారూ! బిడ్డ కెట్లున్నది?—

ఉ॥ అమ్మ! యి దేటిమోసమొ? ము ♦ ఖాబ్జమున న్గళ లేదు నేత్రప
ద్మములు విప్పదేర వస ♦ మానసువర్ణతనూవిలాస మీ
కొమ్మకుఁ దొల్లిరీతి నవ ♦ కోమల మై కనుపింప దయ్యె శ్వా
సమ్ములు క్షీణ్య మయ్యె నిఁక ♦ జా గొనరించెద రేల యక్కటా!

రవ—అయ్యో! నా కేమియుఁ దోచుట లేదు. చిత్తములోఁ జిత్తము లేదు. కనులు మూఁత వడు చున్నవి. ఆహా—దైవమా! ఎంత చేసితివి?—

చ॥ అకట! శుభంబు గూర్పఁగ న ♦ హర్నిశము న్దలపోసి మత్కుమా
రిక కిది యుక్త మంచు నొన ♦ రించిన వానికి యిట్టి దుఃఖదా
యకగతి సంభవించె; దురి ♦ తాత్ములపూర్వకృతంబు జేసి తా
మొకటి దలంప దైవము మ ♦ ఱొండు దలంచుచు నుండు నిచ్చలున్.

అయ్యో! ఏమి చేయుదును. (కూలఁబడును)

పురో—(వాసంతిక చేయిఁ బట్టుకొని) అయ్యో! చేయి చల్లగఁ గూడ నున్నది. రామరాజా! సోదరిగతి యె ట్లున్నదో చూచితి వా? పెండ్లి కని వచ్చితివికాఁబోలు—నింకను జూచెద వేల? త్వరగాఁ బోయి వైద్యుని దోడ్కొని రమ్ము. ఇం కెక్కడివాసంతిక—ఇం కెక్కడి చెల్లెలు—

మది—మిత్రుఁడా! ఎంతగతి పట్టినది.

రామ—(ఆతురతతో నిష్క్రమించును.)

సౌమ్య—అబ్బా! బాధ యెక్కు వగు చున్నది. నాగతి యేమి కా నున్నదోగదా. మదిరా! వైద్యుఁ డేడి?

మది—ఇదిగో! వచ్చుచున్నాఁడు.

రామ—(వైద్యునితోఁ బ్రవేశించును.)

వైద్య—(సౌమ్యుని బరిశీలించి) అయ్యా! ఇతనికిఁ బ్రాణభయము లేదు. వెంటనే నావైద్యశాలకుఁ బంపుఁడు. తగు చికిత్సఁ జేసి యంతయు సరిజేసెద. (కొందఱు సౌమ్యునిఁ గొని పోవుదురు.)

రవ—అయ్యా! ఈ బిడ్డగతిఁ జూడుఁడు. నోటిమాటయుఁ బోయినది. కండ్లు మూఁతపడినవి.

వైద్య—(వాసంతికనాడిని జూచి) అతిబలహీనముగ నుండుస్థితిలో జరిగిన నీ ఘోరకృత్యమువల్ల పాప యీమెకు మతి దప్పి నాడి క్షీణించుచున్నది. వేడిమి తగ్గినది. జీవించుట దుర్ఘటము; అయిననే నిప్పుడే తగినయౌషధమునుగొనివచ్చెద. ఈమె నిక్కడ యుంచి నిశ్శబ్దముగా నుండుఁడు. (నిష్క్ర.)

తెరపడును.

---

## తృతీయరంగము:—శ్మశానము.

కొఱవిని జేతఁ బట్టుకొనిన యశ్వసమంత్రి, రామరాజు, పురోహితుఁడు, వాసంతికను మధ్య నిడుకొని మఱికొందఱు ప్రవేశింతురు.

అశ్వ—దైవమా? ఎంత చేసితివి!

ఉ॥ నాఁడు వనాంతరంబుల మ♦నంబునఁ బెండ్లితలంపు లూని యీ
వేడుక లాత్మ నింప నిను ♦ వెంబడిఁ దోడ్కొనివచ్చితిం గదా!
నేఁడు శ్మశానభూమి నిటు ♦ నిర్భరదుఃఖముచేఁ గృశింపు చు
న్నాఁడఁ ద్వదంత్యకర్మము మొ♦నర్పఁగ నీ కిపు డక్కటక్కటా!

ఆహా! విధిసంకల్ప మవిలంఘనీయముగదా! బిడ్డా! వాసంతికా! ఇంకెక్కడి వాసంతిక! ఆబాల్యమునుండియు నిన్నతిగారాబమ్మునఁ బెంచుచుఁ దగినవరు నన్వేషించి నీ పరిణయదినమ్ములఁ గన్నులారఁ గాంచి సంతసింప నెంచుచున్న నన్ను దుద కెట్టి తీఱని దుఃఖసాగరమున ముం

చితివి! "పూర్వోపార్జితపాపస్య ఫల మశ్నంతి దేహినః" అనునట్లు పూర్వజన్మార్జితపాపఫలంబులేగాక యీ జన్మమునందలి పాపంబు లాజన్మమునందే యొకప్పు డనుభవనీయంబు లగు చుండును.

ఆ॥ వె॥ పిల్ల నిత్తు నంచుఁ ♦ బేరాసఁ గొల్పి యీ
వల నిడక యగౌర♦వం బొనర్చి
సాగనంపువాని ♦ కీగతిగాక వే
ఱొండు గలదె వాని ♦ యుసురు దాఁక.

నీ క్షేమముఁ గోరియే నే నొక యుచితసంబంధ మరసితి; నీ తల్లియు నీ క్షేమముఁ గోరియే యంత కెక్కుడు యుక్తమని మఱియొక సంబంధమును గూర్చినది; కాని నీ కీ రెండుసంబంధములును దుఃఖకరములై తుదకు మరణమునుగూడఁ గలిగించినవి. అకటా! నే నేమి చేయుదు—

తే॥ గీ॥ నీకు క్షేమంకరం బగుఁ ♦ గాక యంచు
నొకటి దలఁప దైవంబు వే ♦ ఱొకటి దలఁచి
మమ్ము దుఃఖపాథోరాశి ♦ మధ్య ముంప
నీకు మృత్యువు గ♦ల్పించె నే విధాత.

పురో—అయ్యా! గతించినదానికి జింతించినను ఫలంబు లేదు; కావున మనలమనమే యూరడించుకొనవలయును.

రామ—ఆర్యా! మాటల నెన్నైని జెప్పవచ్చునుగాని గర్భశోకంబు దుర్భరంబు గదా!

పురో—అయ్యో! మాకుమాత్రము దుఃఖము లేకుండెనా!

తే॥ గీ॥ కటకటా! నేఁటిదనుక మా ♦ కనులయెదుట
పూఁచి నట్టితంగేటి విధం♦బునను బ్రీతి
మించు వాసంతికకుఁ బెండ్లి ♦ యంచు వచ్చి
యిప్పు డంత్యకర్మంబు సేయింపు చుంటి.

రామ—(దుఃఖముతో)

శా॥ చెల్లీ! నీదు వివాహకార్య మని నా ♦ చిత్తాంబుజాతంబు రం

జిల్ల న్మొప్పిరి గొన్న మోదమున నే ♦ శిఖరింబ యేతెంచి సం
ఫుల్లాబ్జాతదళాక్షీ! యిట్లు మరణంబు న్జూడఁగా నయ్యో నేఁ
జెల్లర్ బాపపుదైవ మిట్టిగతి వ్రాసె న్నీ లలాటంబునన్.

తే॥ గీ॥ అంతకుడను నెనె కారకు ♦ రాల ననుచుఁ
దల్లి యొకమోఁల మఱియు నీ ♦ తండ్రి యొక్క
మోఁల నేస్చుచు నుండ నో ♦ ముద్దుచెల్లి!
నిన్న మఱచి యే నెట్లుండ ♦ నేర్తు నకట!

పురో—వత్సా! యూరడిల్లు మూరడిల్లుము. (ఎల్లరఁ గూర్చుండఁ జేయును.)

సుద—(దూరముగా నాతురతతోఁ బ్రవేశించి)

తే॥ గీ॥ ఏ మనోహారిఁ బరిణయ ♦ మై మదీయ
జన్మమున సంతతానంద♦జలధిఁ దేల
నెంచి యున్నాఁడనో యట్టి ♦ మించుఁబోఁడి
పోవు చున్నది పరలోక♦మునకు నదిగో.

(ఎదపైఁ జేయి చేర్చి దృష్టి నిగిడించి) హా మనోహారీ! ఎట్టిగతికిఁ బాల్పడితివి—

మ॥ అతివా! తావకసన్నిధానమె మదీ♦యాశేషసౌభాగ్యసం
తతి యంచు న్గతభాగ్యభోగ్యమున కై♦నన్ డెందమం దింతయున్
వెతల న్జెందక సర్వము న్మఱచి సం♦ప్రీతి న్భవత్సంగతం
బతిమోదంబునఁ గోరియుండ నిటు దుః♦ఖాంభోనిధి న్ముంచితే.

నాపై నెనలేని మోహ మూనుటచేఁ గదా నీ కీపాటు తటస్థించినది — అయిన నీ నిర్భాగ్యుఁడు గోచరింపనియెడల నీ వేపురుషునకో యర్ధాంగలక్ష్మి వయి సకలసౌభాగ్యంబుల ననుభవించుచుండెదవుగదా! కాని నీ యభిమతంబు నెఱవేఱదని తోఁచినప్పుడైనను నాపైఁ గల నీ యనురాగపాశంబును ద్రెంచి మనసును ద్రిప్పుకొనఁజాలక బేలవై నీజీవంబులఁ గోలుపోయితివి! నిశ్చయముగా నిది బేలతనమె కాని—

ఉ॥ ప్రేమ యనంగ నిది, పరుఁ • బెండిలి యాడఁగ నొల్ల కమ్మరున్
వేమఱు జంకుదాన నయి • వేఱువిధంబు వచింపలేక, నా
పై మమకార మూని కడు • పారములేని మనోవ్యథ న్గటా!
తామరసాక్షి! యీకరణి • తావకజీవముఁ గోలుపోయితే.

రామ—ఆర్యా! హంతకుఁ డెవఁడో యాగది నెట్లు ప్రవేశించెనో తెలియ దయ్యెఁ గదా!

పురో—ఎట్లు తెలియును?—

తే॥ గీ॥ ఎఱిఁగి యున్న సౌమ్యుఁడు వచి•యింపఁ డయ్యె
నింక నవసానగతి నున్న • యీకుమారి
కీ ప్రపంచమె లే దయ్యె • నెఱిఁగి పలుకఁ
గాన గత మెట్లు తెలియంగఁ • గలదు మనకు.

రామ—నిశ్చయము— కాని—

కం॥ సునిశిత మగు నాఖడ్గము
విను నిన్నటినుండి నాకు • వెదకిన నెందున్
గనఁబడ దయ్యెను దానిని
గొని యెవ్వరో చేసి • రిట్లు కుత్సితమతులై.

పురో—ఇది కడుఁ జిత్రముగా నున్నది. వేసినతలుపులు వేసినట్లే యుండెఁ; గదిలోఁ బ్రవేశింపఁ జీమ కైనను సందు లేదు.

సుద—భువనైకసుందరీ! నీ మనోహరాకారంబు కంటె నీ హృదయ సౌజన్యము నన్ను మఱింతఁ దహింపఁ జేయు చున్నది—కావున—

తే॥ గీ॥ చెలియ! యీలోకమునఁ గాదు • చెలిమిఁ జేయ
మనకు నను వగు నాలోక•మున నఁటంచు
కొలఁదిదినములలోన నీ • కొఱకు వచ్చు
చుంటి నందు నా కయి వేఁచి • యుండఁ గదవె.

రామ—మనవలెనే దైవబలంబు చాలని యతఁ డెవ్వఁడో గదా! (సమీపించి సక్రోధముగ) ఓనిర్దయాత్మ! నీకారణముననే

గదా మా ముద్దుచెల్లెలిని గోలుపోయితిమి?

సుద — ఓయీ! నీ జననికారణమున నీవు నీచెల్లెలిని నేను నామనోహారిణిని గోల్పోయితిమి.

రామ — అట్లు కాదు — ఈ కీడున కెల్ల నీవ కారకుండవు; కావున నేఁడు నీ రక్తమాంసాదులఁ జూడఁగోరుచున్నాఁడను. యుద్ధమునకు సన్నద్ధుఁడవు కమ్ము.

సుద — ఓయి మూఢుఁడా! దీన నీ కేమి లాభము?

రామ — ఏమి! ఆఁకలి దీర కున్నను కసి యైనను దీరదా? దాన నా దుఃఖమున కొకింత యుపశమనంబు గలుగదా?

సుద — చావునే కోరుచున్న నా కది యెంతయు సంతసమే; కాని యొకవేళ నీవే నాచే మడసిన?

రామ — అదియు నా దుఃఖోపశమనమునకుఁ గారణమే యగుఁగదా?

రామ — అటులైన రంగప్రదేశమును నిర్ణయింపుము.

రామ — నీ సౌధాంతికంబునం గల యా పెద్దవాఁగున కద్దరిఁగల విశాలప్రదేశము యుక్తమని తోఁచుచున్నది.

సుద — సరే; అచ్చటనే రేపుదయమునఁ గలిసికొందము; రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు. తెరపడును.)

చతుర్థరంగము:— నదీతీరము.

(ప్రవే) అద్దరి ఖడ్గపాణియై రామరాజు ఇద్దరి ఖడ్గహస్తుండైన సుదర్శనసేనుఁడు, కుముదుఁడు.

సుద — (స్వగ.) మనోహారీ! ఇంకెక్కడిమనోహారి —

మ॥ కలికీ! నీదు మనోహరాననవిలోకం బెప్డు సంప్రాప్తమై
కలపం సాగెను నామనంబు నపుడే కాంక్షించితిన్ వేడ్క నీ
చెలిమిన్ నాదగు సర్వమీవ యని యిస్సీ నీవె లేకున్న నా
కిల నేమున్నది? నీదువెంట నిదిగో యేతెంచెదన్ మానినీ.

(నిశ్చయముగా నీవు నాపై నెనలేని మోహము నూనుటచేతనె

కదా యీసామ్యునితో సకలసంపదలచే మనసార సౌఖ్యపారావారమున నోలలాడ నీతల్లి నీ కవకాశము గల్పించినను సరకు సేయక నా కారణముననేగదా నీ విట్టిమరణమునకుఁ బాల్పడితివి? అకటా? నీయట్టిసుందరాంగిని గోలుపోవుటయకాక నిమరణంబునకుఁ గూడం గారకుఁడ నైన నే నింక నేల యీయాసువులతోఁ జరింపవలెను? చరించుద మన్నను నీయసువుల భరింపఁ గలుగుదునా? ఏల యన—

ఉ॥ మోహపయోధిఁ గొన్నిదిన♦ముల్, భవదీయవియోగదుఃఖవీ
చీహతిఁ గొన్నినాళ్ళు, నిటు ♦ చింతలచేఁ జివుకాడుచున్న నీ
దేహము నింక నెట్లు సుదతీ! భరియింపఁగలాఁడఁ గాన సం
దేహము లేదు నే నిదిగొ ♦ నీవెనువెంటనె రాఁ దలంచితిన్.

కుము— (స్వగ.) అహా! ఎట్టివ్యాకులత సంప్రాప్త మైనది! ఆ పగవానిని దనయింటికి దెచ్చు టెందులకు? తా నట కేఁగు టెందులకు? ఏఁగిన నందరానిమ్రానిపండ్ల కఱ్ఱులు సాఁచిన ట్లాపెపై మితిలేని వ్యామోహ మూని యిట్లు వాపోవు టెందులకు? అయిన నిపు డీవిచారముచే నేమిప్రయోజనము? ఆచిన్నది వీని శోకాలాపంబులచేఁ దిరిగి సజీవ యై లేచి వచ్చునా? (తలయూఁచి) ఈవిషయములో మన మేమియు నన లేముగాని యిపు డీ ప్రయాణ మెచటికో—

సుద—(స్వగ.) రామరా జీసమయమున నాపైఁ గరుణాళువై నట్లు తోఁచెడిని. ఏలయన—

ఉ॥ హానవమల్లికాకుసుమ♦హాసవిలాసపయోరుహాస్య! యో
సూనశరాసనాస్త్రమ! వసుంధర ని న్నడఁబాసి మేన నీ
ప్రాణము లేగతి న్నిలుప ♦ వచ్చు నఁటంచును నీదుభ్రాత నా
పై నన రూని నీకడకుఁ ♦ బంపఁగ నెంచెఁ బరోపకారియై.

(కుముదునితో) కుముదా! ఇటు వచ్చుచుంటి వెందులకు? సౌధమునకుఁ బొమ్ము.

కుము— దేవా! నేడు తమ రెక్కడి కేఁగ......

సుద — (చీకాకుతో) నన్నిట్లు డేమియుఁ బలుకరింపక నీదారిని బొమ్ము.

కుము — (వినయముతో) నే నేమియు నడుగుటలేదు గాని తా మిపు డొందుల కేఁగ నుంటిరో యదిమాత్రము తెలియఁ గోరెద.

సుద — (కోపముతో) నే నిపు డద్దరి కేఁగ నున్నాఁడ. అయిన నీ కెందులకు? నీదారిని బొమ్ము.

కుము — అయ్యా! ఒక్క మనవిమాత్రము చేయు చున్నాఁడను. ఇటీవల వచ్చిన వరదచే మిగుల నొండుమట్టి పేరుకొని క్రొత్త నీరు వచ్చుచుండుటచే నిప్పు డీయేఱు మహాప్రవాహము వలెఁ బాఱు చున్నది. కావున నిపు డీద్దానిని దాట మిగుల దుస్సాధ్యము. దయచేసి నేఁటికి సౌధమునకు రండు. వలసినచో మఱియొకసారి యరుగ వచ్చును.

సుద — ఓయీ! నీప్రసంగ మికఁ జాలును గాని తత్క్షణం బిం దుండి వెడలిపొమ్ము.

కుము — (స్వగ.) ఏమి యా నున్నదో కాని వీనియభిప్రాయ మేమో తెలియ కున్నది. నే నెదుటనుండిన కోప మధిక మగు చున్నది. కావున నీప్రాంతములనే యించుక మఱుగుననుండి చూచు చుండెద — ఇఁక నే నేమి చేయఁగలను. (నిష్క్ర.)

సుద — ఇప్పటికి నేను సర్వబంధములనుండియు విముక్తుండ నైతిఁ గదా! యిఁక నాకుఁ గర్తవ్య మేమి? తలోదరీ!

మ॥ నిను బెండ్లాడఁగ లేదు నేను మఱియుం • నీ వన్యుఁ బెండ్లాడరా
దని వారింపఁగఁ బూనలే దయిన మోహావేశవై నా కతం
బుననే నీతనువుం ద్యజించుటను బూఁబోఁడీ! త్వదీయార్థ మై
నను నాదేహము వీడి రాఁదగదె యన్యం బింక నే మున్న దే.

నా నిఖిలసౌభాగ్యంబులు నీవే యగుదు వని నే నెవరిని నెఱ నమ్మికొని యుంటినో యట్టి నామనోహారియే లే కుండిన నిఁక నా కన్యంబు లేమిగలవు? కావున నే నిప్పు డాతనిచే మడసిన నా కది యెంతయు సంతోషదాయకమే యగుఁ గాని నే నాతనిఁ జంపిన నా కేమి

లాభము? ఇదివఱకు కొక స్త్రీహత్యను గట్టుకొంటినిగదా! ఇఁక రెండవ దీపురుషహత్య గాఁబోలు.

రామ—(అద్దరినుండియే స్వగతమున) దుర్మదా! ఎంత చేసితివి!

సీ॥ నీవును మాకు నెన్ని దినాల నుండియో
ప్రబల శత్రుత్వంబు ♦ బరగుచుండ
మజ్జనకుని నీదు ♦ మాయచే నీయింట
విందు లొసంగి నీ ♦ చందముగను
మాయింటఁ జొరబడి ♦ మాముద్దుసోదరి
హృదయధనము హరి♦యించి యిట్టి
ఘోరకార్యంబున♦కుం దిగి మాయును
రులఁ బోసికొనిన యో ♦ కలుషచిత్త

తే॥ గీ॥ యింకఁ ద్రుటికాల మైన నీ ♦ వీజగాన
నిలువఁ దగదు గాన మదీయ♦ నిశితఖడ్గ
ధార కెఱజేసి నాకసి ♦ దీర యముని
సదనమున కంపెదను వేగ ♦ సాగి రమ్మ.
అదిగో వచ్చుచున్నాఁడు.

సుద—దైవమా! అయిన దేమో యయినది గాని యొకటిమాత్రము
ప్రసాదింపఁ బ్రార్థించుచున్నాఁడ. ఏది యన—

మ॥ అతఁడే నన్ను వధింప గల్గు నెడ నా ♦ కై యేడ్చు వారెవ్వరు లే
రతనిఁ నేనె వధింపఁ గల్గునెడఁ గ♦ట్టా! వానికై యెందరో
తతదుఃఖాబ్ధినిమగ్నులౌదురుగదా ♦ దైవంబ! న న్నింక నీ
క్షితిపై వారలగోడు వోసికొని గా♦సిం జెందఁగా నీకుమా.

దయామయుఁడవగు నో భగవానుఁడా! ఈ కడసారి ప్రార్థనంబును గూడ నవధరింపుము.

ఉ॥ ఏ నలినాక్షి నిట్లు వరి♦యించి కరంబుఁ గ్రహించుచుంటి నో
యే నవకోమలాంగి మది ♦ నెన్నఁగరాని విరాళిబూని నా
పై, నెడఁబాసెనో యసువుఁ ♦ బాపురె! యా జలజాతపాణి నా

చానను గూర్పఁ గోరెదను ♦ జన్మశతంబుల కైన భార్యఁగా.

(అని వాగులో దిగి) అబ్బా! ఇసుక రేవుగా నుండవలసిన దిట్లు నేఁడు బురదతోను మెఱకపల్లములతోను నున్న దేమి చెప్పమా!—(మఱికొంతనడచి నదిలోఁ బడి యదృశ్యుఁ డగును. దూరమున నున్న రామరాజు సమీపించి నదివంకఁజూచి)

రాము—ఇతఁ డీసుడిగుండములో దిగుటచే నధఃప్రదేశమునకు సంపూర్ణముగా మునిఁగిపోయెనుజుమా—

కుము—(గుండెల మోదుకొనుచుఁ బ్రవేశించి) అయ్యో! సుదర్శన సేనమహారాజా! ఇ దేమి— నేఁ డీయకాలమృత్యువువాతఁ బడితి వేమి? నాజన్మాంతమువఱకును దమరే నాకు శరణ్యంబు గాఁగలరని నెఱనమ్మిన న న్నిట్లు దిక్కుమాలినవానిని గాఁ జేసి యెం దేఁగితివి? అయ్యో! ఇట్టిపాటు దటస్థించు నని కల నైనఁ దలఁప నైతినే-అకటా-(అని నేలపైఁబడి విలపించును.)

రాము—ఓయీ! ఈ సుదర్శనసేనున కీ ప్రాంతము లన్నియు బాగుగాఁ దెలిసినవియే గదా! అటఁ గల యిసుక రేవును విడిచిపెట్టి సుడి గుండముగల యీ యగాధస్థలమున దిగుటకుఁ గారణమేమి? తెలియక మోసపోయెనా? లేక ప్రాణంబుల విడువనెంచి యిట్లు చేసెనా?

కుము—అయ్యో! ప్రాణంబుల విడువవలసినంత యవసరము వాని కేమియు బట్టలేదు గాని యే కారణముననో వాని మన సులో మనసు లేకపోవుటచే నింత తటస్థించినది.

రాము—(స్వగ.) ఎట్లయిన నేమి? నేఁ జేయ నున్న పనిని భగవంతు డే నెఱవేర్చెను. (నిష్క్రమించును.)

కుము—ఖడ్గహస్తుఁ డై యీతఁ డిచ్చటఁ దిరుగు చున్న కారణ మేమో? పూజ్యుఁ డ వగు నోదేవా! నీ విట్లు మరణించుటకుఁ గారణ మేమి! అతఁ డన్న ట్లది మనఃపూర్వకముగాఁ గలిగిం చుకొన్న మరణమా! లేక దైవికమునఁ దటస్థించిన మర

ణమా? మనఃపూర్వకముగాఁ గలిగించుకొనిన దైనచో సీఁత
డి ట్లాయుధసమేతుఁడై రణరంగంబున కేఁగు యోధునివలె
ని ట్లరుదెంచు కారణమేమి?—మనఃపూర్వకమైనది గదను
టకును వీలు లేకున్నది. ఏలయన నితఁ డీప్రదేశంబుల
బాగుగా నెఱుఁగును. మఱియు నేనుగూడ జ్ఞాపకముచేసితిని
గదా—అయినను గానున్నది కాక తప్పదయ్యె. ఇంతకు
నిది దైవఘటన మని తలఁపవలసి యున్నది.

శా॥ శ్రీమద్ధారుణి నాట్యరంగముగ సీ ♦ జీవాళి పాత్రాళిగా
సోమార్కుల్ నవదీపికవ్రజముగా ♦ సొంపార సృష్టించి యరా
రా! మాయామయనాటకంబుఁ గడు సం♦గ్రాహ్యంబుగా నాడు ని
ష్కాముం డీ మను జేప్పి తానుసరుఁడై ♦ కామ్యాళిఁ జేకూర్చునే.

(నిష్క్రమించును.)

గద్య.

ఇది శ్రీమత్పార్వతీయాచలజాపాదారవింద
మకరందాస్వాదసానంద హృదయేందిందిర
శ్రీరామన్వయ దుగ్ధపయోధి సుధా
కర గంగయాఖ్య పుత్ర సుబ్బ
మాంబాగర్భశుక్తిముక్తాఫల
వీరబ్రహ్మాహ్వయ ప్రణీతం
బైన వాసంతిక యందలి
పంచమాంకము

సంపూర్ణము.

ఏతద్గ్రంథకర్తచే రచింపఁబడి

విక్రయమునకు సిద్ధముగా నున్న గ్రంథములు.

---

| | |
|---|---|
| నానారాజన్య చరిత్రము. శ్రీ వెంకటగిరి మహారాజా గారిచే రు 500లును, శ్రీ రాజా భుజంగరావు బహదరు గారిచే నొక సువర్ణపతకమును బహుమతి వడసినది. చిత్రపటశోభితము. 300 పేజీలు. క్యాలికో బైండు. | రు 3-0-0 |
| చంద్రకాంత. (ఆఱంకముల నాటకము. మూఁడవకూర్పు) | 1-0-0 |
| జపానీయము. (అయిదంకముల నాటకము) | 0-12-0 |
| వాసంతిక. స్కాటు నవల యగు బ్రైడ్ ఆఫ్ లేమర్ మూర్ నుండి యనువాదింపఁబడిన అయిదంకముల నాటకము. ఇంటర్ మీడియేటు టెక్స్టు. | 1-4-0 |
| మార్కండేయ విలాసము (హరికథ) | 0-12-0 |
| పాదుకాపట్టాభిషేకము. (హరికథ) | 0-12-0 |
| ప్రియదర్శిక. (ప్రస్తుతకాలానుసరణముగ సంస్కృతమునుండి యనువాదింపఁబడిన మనోహరమగు నవల) | 0-12-0 |
| శిల్పశాస్త్రము. | 0-4-0 |
| శ్రీ విరాట్ప్రభు శతకము. | 0-4-0 |
| శ్రీకృష్ణరాయల కొండవీటివిజయము. చెన్నపురాంధ్ర సభ వారిచే 'కాంపిటేషన్' లో నొక పతకము బహుమతివడసినది. పద్యకావ్యము. అచ్చులోనున్నది. | 0-12-0 |

శ్రీరామ వీరబ్రహ్మము,
పండిట్,
నోబిల్ కాలేజి,
మచిలీపట్టణము.